UNIVERSAL LIBRARY
OU_204258
UNIVERSAL LIBRARY

# బీరకాయ పీచు

[ కథల సంపుటి ]

కొడవటిగంటి కృష్ణమూర్తి

1947

యువ బుక్ డిపో
గవర్నరు పేట : : ఆచారప్పన్ వీధి
బెజవాడ : : మద్రాసు 1

యువ ప్రచురణ :
ప్రథమ ముద్రణ :

Checked 1969

జి. యస్. కె. ప్రెస్,
మద్రాసు 1

# బీరకాయ పీచు

'వాళ్ళమ్మాయికి సంగీతంట, చెపుతారా?' అంది విశాలక్షి వంటింట్లో కూర తరుగుతూ.

'ఏమిస్తారట?' అన్నాడు భుజంగరావు ఇవతలగదిలో తల దువ్వుకొంటూ.

'ఇచ్చేదేమిటి—ఎరిగున్న వాళ్లలో!'

'తలు పేసుకో!'

'అదేమిటి - వెళ్తున్నారేం?' అంటూ ఇవతలికి వచ్చింది విశాలాక్షి.

'నాకు పనివుంది—'

'నే నడిగిన సంగతేమిటి?'

'నే నడిగిన సంగతేమిటి?' అన్నాడు భుజంగరావు.

'ఏమో బాబూ! నాకు తెలీదు. ఆవిడ అడగమంటే అడిగాను. తర్వాత మీ ఇష్టం!'

'ఆవిడ అడగమంటే నన్నడిగావు - బాగానేవుంది. ఏమిస్తారో కనుక్కోమని నేను నిన్ను అడుగుతున్నాను—వెళ్ళి కనుక్కో!'

'నా కిదేపని! మీ కిష్టంలేకపోతే చెప్పనని చెప్పరాదూ—'

'ఎవరితో?' అన్నాడు భుజంగరావు.

'మీరు చెప్పరుట అని చెప్తాను!' అంది విశాలక్షి.

'మధ్య నన్ను చెడ్డవాడిని చెయ్యటం దేనికి? నేను చెప్పనని నీతో అన్నానా?'

'మీ రన్నదానికి అంతకన్న అర్థమేముంది?'

'నే నన్నది నీకేమి అర్థమయింది?'

'మీ రనే మాటలు నాకు బాగానే అర్థం అవుతయి!'

'వొట్టి దబాయింపు—నీకేమీ అర్థంకాదు!'

'చివరకు నన్ను తెలివితక్కువదాన్ని చెయ్యటమేగా మీపని!'

భుజంగరావు నవ్వాడు. విశాలక్షితో అతనికివచ్చే అవస్థే అది. వొట్టి

పుణ్యానికి అనవసరమైన విషయాలలో ఆవేశం చూపించి విశాలక్షి మొహం చిటపట లాడించగానే అతనికి ఆమెను గట్టిగా ముద్దు పెట్టుకో వాలన్న దుర్బుద్ధి పుట్టటమే అతని దురలవాటు. అతని వృద్ధత్వాన్ని తక్కువమే కనిపెట్టే నేర్పు ఆమెకు వుండటం శోచనీయం. విశాలక్షి కొంచెం అవతలికి జరిగి నిల్చుంది!

'నిన్ను తెలివితక్కువదాన్ని ఎవరు చెయ్యగలరు చెప్పు?'

'అందుకే కొమాలు నన్ను తెలివితక్కువదాన్ని చెయ్యటం!'

'నీ ఇష్టం---ఎలా అనుకున్నా సరే!'

'సరే నన్నారని ఆవిడతో చెప్పనా?'

'నేను సరేనని అనకపోయినా నేను సరేనని అన్నానని నీకు ఆవిడతో చెప్పాలని వుంటే—చెప్పు!'

'తర్వాత నాకు మాటరావటానికా—తీరా ఆ అమ్మాయి వచ్చిం తరవాత హాట్ హుటాట్ అంటూ నెపం నామీదికి నెట్టటానికి—నా కామాత్రం అర్థంకాకపోలేదు!'

'అంత జాగ్రత్త కలదానివి చెప్పకు!'

'మరి ఆవిడతో ఏం చెప్పమన్నారు?'

'నీ మీది కే నెపమూ రాకుండా చెప్పు!'

'నాకు చేతకాదు సుమండీ—!'

'నా మీదికే నెపంవచ్చేటట్లు చెప్పు అయితే'

'నేనేం చెప్పను'

'చెప్పకు!'

'నేనక్కడికి వెళితే ఆవిడ అడిగితే?' అంది విశాలక్షి దూరదృష్టితో.

'అక్కడికి వెళ్ళకు!'

'బాగుంది మీరు అందరితోనూ సంబంధాలు తెంపుకున్నారని నన్ను కూడా అలాగే చెయ్యమన్నారా? ఎవ్వరితోనూ అవసరం లేకుండా మీరు జరుగుతుందేమో కాని, ఆడవాళ్లకు మాకు జరగదు సుమండీ!'

'అయితే వెళ్లు!'

'నేను వెళ్ళకుండానే ఆవిడ ఇక్కడికివచ్చి అడుగుతుంది.'

'ఏమని అడుగుతుంది?'

'ఏమండీ కనుక్కున్నారా అని అడుగుతుంది.'

'అంటే కనుక్కున్నదీ లేనిదీ చెప్పు.'

'అందుకేగా మిమ్మల్ని అడగటం.'

'మరి నేను సమాధానం చెప్తినిగా!'

'ఏం చెప్పారు—పామూ విరక్కుండా, బడితా చావకుండా—'

'పామూ చావకుండా, బడితా విరక్కుండా అని కాబోలు నీ ఉద్దేశ్యం-!'

'ఏమిటో—మీ మాటలు నాకర్థంకావు—'

'అపుతయ్యా అని దబాయించావు?'

'బాగా నాకెందుకు కానీయండి—మళ్ళీ ఈ సంగతి ఎత్తితే అప్పుడనండి—'

'నే నిందాకటినుంచీ నీ కెందుకనే చెబుతున్నది. అర్థంచేసుకోటానికి ప్రయత్నం చేస్తేనా నువ్వు—?' భుజంగరావు తలుపుదాకా వెళ్ళాడు.

'మరి ఇంతకూ ఏమిటి—?' అంది విశాలక్షి.

అతను వెనక్కు తిరిగి చూచాడు. ఆమె అక్కడే ధీమాగా నిల్చుంది. భుజంగరావుకు నవ్వవచ్చింది.

'మీకు అన్నీ ఎగతాళే—కొంచెము సంగీతం చెపితే అరిగిపోతారా? ఈ మాత్రం సహాయం మీరు చెయ్యకూడదా? అంత ఎవ్వరితోనూ అవసరంలేనివారు పదిరోజుల కిందట పుస్తకం తెమ్మని మరి నన్నెందుకు వారింటికి పంపారు?'

'చేతయితే సమాధానం చెప్పండి అన్నట్టు విశాలక్షి కూచుని కూర తరుక్కోవటం మొదలుపెట్టింది. భుజంగరావు నిర్ఘాంతపోయినాడు. అతని మొహం ఎర్రబడిపోయింది. రహస్యంగా అతని హృదయాన్ని పీల్చి పిప్పి చేస్తున్న బాధను అతని భార్య, తెలిసీ తెలియకుండా కాలితో తొక్కి రెచ్చకొట్టింది. తమ జీవితానికేమీ సంబంధించని విషయాలలో అనవసరంగా ఘర్షణపడి భార్యాభర్తలు ఎడమొహం పెడమొహం పెట్టుకుని

కదాచిత్తుగా పస్తుపడుకోటంకూడా అనేకసార్లు జరిగింది. భుజంగరావు సమస్యలు విశాలక్షికి అర్థంకావు—పట్టించుకోవలసిన అగత్యంకూడా లేదు—చేతగాకూడాదు. జీవితాన్ని ఒకఘోరణిలోకే తీసుకురాలేకుండా వున్న భుజంగరావుకు విశాలక్షి తెచ్చిపెట్టే సమస్యలు దినదిన గండాలు కావటంలో ఆమె నేర్పు చాలావుంది. విశాలక్షి తెచ్చిపెట్టే సమస్యలు భార్యా భర్తల కిద్దరికీ అక్కర్లేని విషయాలు—కనీసం భుజంగరావు వుద్దేశం అది.

కాని భార్యాభర్త లిద్దరూ అన్యోన్యంగా వుంటారనే ప్రతీతి—ఓవిధంగా నిజంకూడాను! దానిక్కారణం విశాలక్షి అమాయకత్వమూ, ఆమె నిర్మించే సమస్యా సౌధాలకు పునాది లేకపోవటమూ. భుజంగరావు సంసారం సాగరంలోతుపానుకు తట్టుకుని యథాస్థితికి వచ్చేటప్పటికి భళ్లున తెల్లవారుతుంది. భార్యాభర్తల పోట్లాటలు చుట్టుపట్ల అమ్మలక్కలకు కాస్తోకూస్తో అవగాహనం అవుతూనే వుంటయి. అలా పోట్లాడగలిగిన శక్తిను సంపాదించినందుకు విశాలక్షినిమెచ్చే కొందరానో గొప్పగానో అనూయపడిన వాళ్లు వుండటం భుజంగరావు దురదృష్టం! ఎంత పోట్లాడుకుంటే ఏం, చిలకా గోరింకలు అన్న పేరు వచ్చింది దంపతులకు. ఈ పోట్లాటలు కథలుగా రాస్తే చదువుకోటానికి బాగానే వుంటయితప్ప నిజంగా అనుభవించటానికి అర్హమైనవి కావు!

ప్రస్తుతం విశాలక్షి వేసిన రసాన్నారాయణాస్త్రంలా పనిచేసింది.

'మరి వాళ్ళింటినించి ఆ పుస్తకం తేవటానికి అంత గునిశావేం?' అన్నాడు భుజంగరావు తాపీగా.

'నేనేం గునవలా!'

'పోనీ సణిగావేం?'

'సణగటం ఏముంది? మీకు కావలసిన పుస్తకాన్ని ఆయన్ని వెళ్ళి. నన్ను అడగమన్నారా?'

'ఆయన్ని అడగమని ఎందుకు చెబుతాను? నువ్వు వెళ్ళి ఆయన భార్యని అడిగితే, ఆవిడ భర్తని అడిగి తీసుకుని ఇయ్యాదూ?'

'అంత శ్రమ దేనికి—మీరే వెళ్ళి ఆయన దగ్గర తెచ్చుకోరాదూ?'

'సంగీతం చెబుతానా అని ఆవిడ నిన్ను అడగటం దేనికీ—ఆవిడ భర్తే వచ్చి నన్ను అడుగకూడదూ?'

'ఏమో నాకు తెలీదు!'

'భేష్! మరి నీకు తెలిసిందేమిటి?'

'ఏమో—తీరా ఆయనవచ్చి మిమ్మల్ని అడిగితే మీరు చెప్పనంటే-'

'నామోషీ కాదూ పాపం! అందుకని ఆయన భార్యా ద్వారా అడిగించుకుని లేదనిపించుకుంటే నామోషీ ఆయనకు కాదుగా!'

'వింత అర్థాలు తియ్యటంలో మీరు ఫస్టు! ఆయనేం భార్యాని అడగమని చెప్పలేదు—'

'అదీ నామోషీ కావచ్చాలు ఆయనకు! అయితే ఆయన భార్యే భర్త అభిప్రాయం గమనించి నిన్ను అడిగింది కామాలు—'

'ఎందుకు వాళ్ళకు లేనిపోని వుద్దేశాలు కల్పించటం—వాళ్ళకు ఇటువంటి ఆలోచనలు ఎప్పుడూ వుండవు!'

'ఆ ఖర్మం నాదే కామాలు! అయితే వాళ్ళమ్మాయికి సంగీతం చెప్పించాలని ఆరుద్ర ఆమెకేగాని ఆయనకేమీ లేదంటావా?'

'ఆయనకు మటుకెందుకుండదు?'

'వుంటే సంగీతం చెప్పించేభారం ఆయనకు కంటె ఆవిడకే ఎక్కువ పెట్టినట్టుందేం?'

'మీకు సమాధానం చెప్పటం నాకు చేతకాదు—'

'మరి వెళ్తావేం—నీ దగ్గరవున్న దురలవాటె అది!'

'మీతో పెట్టుకూర్చుంటే ఈ పూట మరి భోజనంవుండదు—కొత్త ఏముంది?'

'మరి ఇటువంటి సమయంలో తీగె కదిలించావు దేనికి? నీవు ఏవిషయం ఎత్తావో నీకు తెలియదు కాబట్టి ఇప్పుడిది తేల్చాలిసిందే—'

'తేల్చేదేముంది—ఇతరులకే దురుద్దేశాలు వుంటయి, మీకు అన్నీ మంచి వుద్దేశాలే—'

'నువ్వేమన్నా నా కభ్యంతరం లేదు. నాకే దురుద్దేశాలున్నాయి... ఇతరుల కందరికీ మంచి వుద్దేశాలున్నాయని నీవు అన్నా నేను వొప్పుకుంటాను. కాని అసలుసంగతి చెప్పు!'

'ఏంచెప్పను? కూతురు సంగీతం విషయం తల్లికిమటుకు పట్టదూ?'

'ఎందుకు పట్టదూ? కాని నా ప్రశ్న ఏమిటంటే అది ఆమెకే ఎక్కువ పట్టినట్టుందేమని—పోనీ, ఆయన కేమీ పట్టనట్టుందేమని.'

'ఆయనకు మటుకు ఎందుకు పట్టదూ—ఆయనా సంగీతం మేష్టరు కోసం చూస్తూవుండి వుంటాడు!'

'పాపం, ఆసంగతి ఆవిడకు తెలియదు కామాలు! బాగానే వుంది—భార్యకు తెలియకుండా భర్త, భర్తకు తెలియకుండా భార్యా సంగీతం చెప్పేవాడికోసరం చూస్తున్నారన్నమాట! వాళ్ళది మన సంసారం లాంటిదే—'

'నా విషయాలు మీ కేమీ అక్కర్లేదు, కాని మీ విషయాలు నా కేమీ అక్కర్లేకుండా పోలేదు!'

'మంచి మాటన్నావు తెలిసీ తెలియకుండా!'

'భార్యా, భర్త ఒకరికొకరు సంబంధంలేకుండా వుండాలని కామాలు మీ వుద్దేశ్యం?'

'అదిమటుకు అన్యాయం—నేనెప్పుడూ అలా అనలేదు—'

'ఇప్పుడు మీ వుద్దేశ్యం అంతకంటె ఏముంది?'

'పోనీ, నాకు అలాంటి దురుద్దేశ్యమే వున్నదనుకో. అయితే వాళ్లు నా వుద్దేశప్రకారమే వుంటున్నట్టున్నదే?' అన్నాడు భుజంగరావు.

'వాళ్లేం అలా వుండటంలేదు!'

'అయితే మరి ఇద్దరూ సంగీత చెప్పేవాడికోసం వెతుకుతున్నట్టు ఇద్దరికీ తెలుసునన్నమాట!'

'ఎందుకు తెలీదేం? సంగీతం చెప్పించాలని వున్నప్పుడు ఇద్దరికీ తెలియకుండా ఎలావుంటుంది? ఇక ఆయనకు తెలియకుండా ఆపని ఆవిడ ఎందుకుచేస్తుంది?'

'అయితే నేను సంగీతం చెబుతానో చెప్పనో నని ఆవిడ కనుక్కొం టున్నట్లు ఆయనకు తెలుసునన్నమాట !'

'ఏమో నాకు తెలీదు'

'ఇంటాకా వచ్చి మొండికెయ్యారు !'

'ఆయనకూ తెలిసేవుంటుంది బహుశా !' అన్నది విశాలక్షి.

'చాల మంచిదానివి! అయితే నేను వాళ్ళమ్మాయికి సంగీతంచెప్పడం ఆయన కభ్యంతరం లేదన్నమాట ?'

'చెప్పటానికి నీకా కిష్టంలేదు కాని మీరుచెబితే ఆయనకు ఇష్టంవుండక పోదు.'

'చెప్పటం ఇష్టంలేదని నే నెప్పుడూ అనలేదు. అయినా అది అంత ముఖ్య విషయంకాదు. నేను సంగీతం చెప్పటం ఆయనకు ఇష్టమే కాని నన్ను అడగటానికి మాత్రం ఆయన కిష్టంలేదు కామాలు !'

'అని నీ వుద్దేశ్యం, ఆయన ఎందుకు ఇష్టంవుండదు మిమ్మల్ని అడగటం ?'

'ఏమో నాకేం తెలుసు ? నన్నడగటం ఆయన కిష్టం వున్నదో లేదో నాకు తెలియదు—నాకు అవసరం లేదు కూడాను. కాని నే నడిగే దేమిటంటే ఆయన నన్నెందుకు అడగడంటాను—ఆవిడవచ్చి నన్ను ఎందుకు అడుగుతుంది అంటాను!'

'ఎవరడిగితే ఏమిటంటా ? ఇందులో అంత పట్టుదల దేనికి ?'

'నాకు పట్టుదల లేదు—ఆ సంగతి నీకు తెలియదు కామాలు !'

'మరి ఇదంతా దేనికిట ?'

'నీకు అర్థం కావటానికి ! ఎవరడిగితే ఏమన్నంత విశాలదృష్టి కల దానివి అప్పుడా పుస్తకం అడగటానికి అంత గునిశావేం — పోనీ సణిగావేం ?'

'మళ్లీ మొదలా ? నీతో నేను వాదించలేను బాబూ—మీకో నమస్కారం !'

'మంచిదానివి కాదూ !'

'పుస్తకం దారి వేరు'

'అదా సంగతి—నాకు తెలియదు సుమా! లేక పుస్తకం కావలసింది నాకు కాబట్టి దాని సంగతి నీకు అంత పట్టలేదా? ఆవిడ అవసరంలో వున్నంత శ్రద్ధ నీకు నా అవసరంలో లేదు కామాలు!'

'నామీద మీకు అటువంటి అభిప్రాయం వుంది కామాలు!'

'అని నే నెప్పుడన్నా అన్నానా?'

'మీరు వేరే అనక్కర్లేదు—మీ మాటలే చెబుతయ్యి.' విశాలక్షి బిక్క మొహం వేసిన మాటమాత్రం నిజం!

'పోనీ ఆ విషయం వదలిపెడదాం—'

'ఆవిడను ఆ పుస్తకం నేను అడిగినా మీరిలా అంటున్నారు—పోనీ లెండి!'

'నీవు ఎంత రాద్ధాంతంచేసి ఆవిడను ఆ పుస్తకం అడిగావో మరచిపోయినట్టున్నావు. పోనీ ఆ పుస్తకం అడిగినప్పుడు ఆవిడ ఏమన్నదో జ్ఞాపకం వుందా?'

'ఆయన పుస్తకాలూ, ఆయన గొడవా ఆయనదే నంది కామాలు.'

'ఆవిడ ఎంత తెలివి తక్కువదో చూచావా? నీవంటే సుగుణత కలదానివి కాబట్టి తెలివిగా పనులు చేసి పెట్టగలవు కాని అందరికీ ఆ నేర్పు వుండదు!''

'బాగుందే—తాళం వేసివున్న బీరువాలో పుస్తకాలు ఆవిడకు ఎలా దొరుకుతయ్యి?'

'పోనీ, ఆయన్ని అడగచ్చుగా?'

'పుస్తకం నాకని చెబితేమటుకు ఆయన కర్థం కాదా ఏమిటి మీకని?''

'అయితే నాకేనా అర్థంకానిది సంగీతం చెబుతారా అని ఆవిడ డిఅగితే ఆ విషయం ఆవిడ కొక్కర్తకే పట్టలేదని?'

'ఇంత చిన్నవిషయానికి ఇంత అర్థం లాగటం దేనికంటా?'

'నీకు అర్థం కావటానికే! అదీ కాక నీచేత ఆవిడను ఆ పుస్తకం అడిగించక పూర్వం నేనే ఆయన్ని అడిగానని నీకు తెలియదు కామాలు!'

'మీా రడిగితే ఆయ నేమన్నాడూ?'

'అది వేరే సంగతి—'

'మీా రడిగిం తర్వాత నాచేత అడిగించటం దేనికీ?'

'నీకు తెలియని దేముంది—నా కన్నీ గురుద్దేశాలేగా!'

'ఇంతకూ ఆయ నేమన్నాడు?'

'ఆ పుస్తకం తన దగ్గర లేదు—'

'ఎవరికన్నా ఇచ్చాడేమో?'

'కొనాలను కుంటున్నాను అని అన్నాడు!'

'ఆయన దగ్గర లేదేమో?'

'మరి రెండురోజుల కిందే ఆ పుస్తకాన్ని డాక్టరుగారింట్లో చూచానన్నావు—నిజం కాదా ఏమిటి?'

'నిజమే! ఎవరిదని అడిగితే డాక్టరుగారి పెళ్లాం వీళ్ల దేనని చెప్పింది!' అంది విశాలక్షి ఆలోచిస్తూ.

'ఒక్కసారి నీ మొహం ఈ అద్దంలో చూసుకో - ఎంత బాగున్నావో!'

'ఏమీా అక్కర్లేదు—అయితే మీా రడిగితే ఆయన ఎందుకు లేదని వుంటాడు?'

'నాతో ఆయనకు ఏమి అవసరం వుంటుంది?'

'అవసరం లేకపోతే పుస్తకం ఇయ్యటాని కేం?'

'నువ్వు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగినంత తెలివికలవాడిని కాదు—వొట్టు!''

'అవును పాపం! అయితే—'

'ఈ పూట మనల్ని ఎవరన్నా భోజనానికి పిలిచా రేమిటి?'

'మీాకు అలాగే వుంటుంది—ఆయన పుస్తకం లేదంటే పూరుకోక మళ్లీ నాచేత అడిగించటం దేనికీ?'

'ఎవరికన్నా ఏదన్నా కావలిస్తే ఇంట్లో ఎంత గోలచేస్తావో నాకు తెలుసు. కాని నాకు ఏదన్నా కావలిస్తే నువ్వు ఎంత ఘర్షణచేస్తావో చూద్దామని!'

'ఎట్నొచ్చీ చెడ్డదాన్ని నేనే నన్నమాట!'

'ఆ మాట నే ననందే?'

'అయితే ఆ పుస్తకం తన దగ్గర లేదని ఆయన అన్నప్పటికీ వుందని తెలిసే నాచేత అడిగించా రన్నమాట?'

'అంత చెడ్డవాడిని మటుకు కాదు!'

'మీరా! అయితే మీకు ఇయ్యనప్పుడు నే నడిగితేమటుకు ఎలా ఇస్తా డనుకున్నారు?'

'నే నడిగిన సంగతి తెలియకుండానే ఆయన భార్య నీతో పుస్తకాల గొడవ ఆయనదేనని చెప్పిందిగా?'

'కాదు ఆయన దగ్గర ఆ పుస్తకం నిజంగావుంది కాబట్టి మీరు అడిగిన సంగతి ఆయన భార్యతో చెప్పివుంటాడు!'

'నీకు తెలివి తేటలు ఎక్కువ అవుతున్నయ్యంటే నమ్ము!'

'ఆయన అలా అబద్ధం ఆడి తప్పించుకొన్న తర్వాత ఆవిడ ఇస్తే గుట్టు బైటపడుతుందని, తప్పించుకోవటానికి తనకు తెలీదు పుస్తకాల సంగతి అని చెప్పింది!'

'నీకంటే ఆవిడే తెలివికలదల్లే వుంది.'

'కాని డాక్టరుగారి పెళ్ళానికి మళ్ళీ ఇచ్చేసింది.'

'అంత తెలివికలది కాదల్లేవుంది.'

'ఏమో—మీకూ మీకూ ఏమేం వుద్దేశాలున్నయ్యో. నే నడిగిన అసలు సంగతి ఏమిటి?'

'చెబితినిగా?'

'అంత నిర్మొహమాటంగా అడగటం నాకు చేతకాదు!'

'నాజూకుగానే అడుగు.'

'ఆయనే మిమ్మల్ని అడిగితే ఏం?'

'ఆయన నోరు చేసుకుని అడగాలిసినంత అవసరం ఏముంది? ఆయన భార్య ఆయన కా శ్రమలేకుండా నిన్ను అడిగింది—నువ్వు తెలివికల దానివి కాబట్టి ఆవిడకూ ఆట్టే శ్రమలేకుండా పనిచేసిపెట్టగలవు.

తర్వాత ఏరోజునైనా ఆయన తనెప్పుడూ నోరు చేసుకొని అడగలేదని చెప్పుకోగలడు.'

'వాళ్లకు అటువంటి అభిప్రాయా లుండవు.'

'వాళ్లకు లేకపోతే ఏం — నాకు ఘంటే చాలదూ వ్యవహారం చెడటానికి ?'

'ఏమో—నీ యిష్టం!'

'నా యిష్టం వొచ్చినట్టు నే నెలాగో చేస్తాను కాని నీకు చేతకాని పనులు—నాకు సంబంధించనివి—నన్ను చెయ్యమని బాధపెట్టకు. నీకు సంబంధించిన పనుకున్న వ్యవహారాలు నీకు చేతనయినట్టు చెయ్యి. మనిద్దరికీ సంబంధించిన పనులు నాకు చేతనయినట్టు చేస్తాను—చేతయితే నీవు కూడా చేతనయిన విధంగా సహాయం చెయ్యి. ఇప్పుడు వాళ్లమ్మాయికి సంగీతం చెప్పటం విషయంలో నీవు ఏదో తేల్చుకోవాలనుకుంటే వాళ్లే మిస్తారో కనుక్కో. అలా అడగటం ఇష్టం లేకపోతే నీకు చేతనయిన విధంగా చెయ్యి.'

'నే నేమీ చెయ్యను!'

'చూర్గాంగా—ఇలా కోతలు కొయ్యటం నువ్వు ఎన్నో సార్లో!'

---

# అనాధశరణాలయం

'ఇవాళకాదు - రేపు-అసలు నేను వచ్చి ఇయ్యనూ, నువ్వురావాలీ ?
అన్నారండి ఆయన' అన్నాడు శాస్త్రితో రామదాసు.

'సరేలే' రామదాసు వెళ్ళిపోయాడు.

'మనవాళ్ళ తెలువులు ఇలా వుంటయిఅండి! మీకింకా బాగా తెలియదు!' అన్నాడు రావువేపు తిరిగి. వెంటనే శాస్త్రిలేచి దబదబా బయటికివెళ్ళి రామదాసును పిలిచాడు. మలుపు తిరగబోతున్న రామదాసు మళ్ళీ వచ్చాడు.

'మరిచిపోయినా-మావాళ్లు బయటవున్నారు. వెల్కం హోటలుకు పోయి—ఏమిటి ఎరగవూ ? ఆచాకలి బట్టలషాపు పక్కనే కదోయి వుంటా!-వెల్కం హోటలు ఆ! కారేజీ పట్టుకురావాలి! మరి నువ్వెక్కడికి వెళతా ?'

'మరి నేను ఇంకా చందాలు వసూలుచేయటానికి వెళ్లాలి కామా ?' అన్నాడు రామదాసు.

'ఎంతసేపు పనోయి! మరిచిపోయేవు సుమా ?'

రామదాసు వెళ్ళిపోయినాడు.

'ఇంతమంది ఆంధ్రులం వున్నాం ఈవూళ్లో! ఒక్క క్లబ్బు నడిపించలేకుండా వున్నాం. చందాదార్లుగా చేరేవారేకాని చందా ఇచ్చేవాడు ఒక్కడూ లేడు. ఇంటిఅద్దె ఇయ్యాలి, ఎలక్ట్రిక్ చార్జసు, పేపర్లు. తెలుగుపత్రికలన్నా పూరికే పంపరండి-వీటి అన్నిటికీ నెల తిరగగానే ఎక్కడినించి వస్తుంది డబ్బు. ఎవడిమటుకు వాడు నా చందా లేకపోతేనేం క్లబ్బు నడవదా అనేవాడేగాని! మీరింకా కొన్నాళ్ళు వుంటారా? చూడండి ఎంత విచిత్రమైన విషయాలు వింటారో!' అన్నాడు శాస్త్రి.

'ఇక్కడ ప్రత్యేకంగా కొత్తవాళ్లు వుంటారనుకోను' అన్నాడు రావు.

'అమ్మమ్మా! అలా కాదండోయి! మాటవరసకు చూడండి. ఇప్పుడు

చందాకోసం వెళ్ళి వచ్చినాయనకు మూడువందల రూపాయలపైన జీతం. నెలకు ఎనిమిదణాలు చందా ఇవ్వటానికి ఆయనకు తీరదు. పరాయి దేశంలో వున్నవాళ్ళం మనకు ఒక కూడస్థలి లేకపోతే ఎలాగు చెప్పండి. ఏ వుద్యమం అన్నా బయలుదేరదీయండి వెనక్కులాగేవాళ్ళేకాని కలిసి పనిచేతాం అనేవాళ్ళు లేనేలేరు. ఇతరులు ఏమనుకుంటారు? వీళ్ళింత పనికి రానివాళ్ళేమా అనుకోరూ? మనవాళ్ళకి రోషమన్నా లేదేమండీ? ఎవడన్నా ఆంధ్రుడువస్తే నలుగురు ఆంధ్రుల్నీ చూడటానికి వీలుండద్దూ! ఎవడన్నా కొత్తవాడువస్తే వీడెవడు, వీడిది ఏజాతి-చూడచూడ ఆంధ్రుడల్లే వున్నాడే అనన్నా అనుకోరు. పరాయిదేశంలో తనవాడిని చూడటానికి ఎవడు సంతోషించడు? అలాంటప్పుడు ఎవడన్నావస్తే వాడిని మర్యాదన్నా చెయ్యడం చేతకాదేమండీ-ఖర్మం. రామదాసు వున్నాడనుకోండి-ఎంతమంది ఇళ్లకు ఎన్నిపనులమీద తిరుగుతాడు. ఎవడికివాడు నెలకాగానే చందా తెచ్చి మామొహాన పారెయ్య కూడదూ? అడిగితేనేమో వెధవ అర్ధరూపాయి ఎన్నిసార్లు అడుగుతా వయ్యా అని కసురు. లేకపోతే మరి నన్ను అడక్కపోతే నాకెలా తెలు స్తుందీ ఎప్పుడియ్యాలో అని నీలుగు! ఈతడవ మీటింగులో నేను రాజీ నామా ఇచ్చేస్తాను.'

'పెద్దలు అలా తొందరపడకండి. ఏదోకాలాన్ని బట్టి వెళ్ళాలి. ఒక్క రోజులోనే అంతా పరిశుభ్రంగా వుండాలంటే వీలవుతుందా?'

'వెళ్ళేమార్గం సరిఅయినది అయితే ఇవాళ కాకపోతే అయిదుసంవత్సరా లకు ఈసంస్థ బాగుపడ్డా నాకు అభ్యంతరం లేదు. ఈప్రకారం వెయ్యి సంవత్సరాలయినా దీనికి ముక్తిలేదు మరి! మొన్న ఎవరో ఆంధ్రుడు వచ్చి తెలుగువాళ్ళ క్లబ్ వుందని తెలిసి చూడటానికివస్తే ఎవరునువ్వు అని అడిగిన పాపానపోలేదు ఎవ్వరూ. పదినిమిషాలుండి అతను అందరికీ నమస్కారంపెట్టి 'వెళ్ళివస్తానండి' అన్నాడు. అందరూ వింతగా అతన్ని ఓ మృగాన్నిచూచినట్టు చూడటంవల్ల అతను భయపడి వెంటనే జారు కున్నాడు. ఇంకా నయం. అతను చూడటానికన్నా వచ్చాడు. బోలెడు

ఆంధ్రులకు ఈ వూళ్ళో తెలుగువాళ్ళ క్లబ్ ఒకటి వున్నది అనికాని అది ఎప్పుడూ పాడుపడినట్టే వుంటుందనికాని శాస్త్రికి తెలియదు.

'అదీకాక ఏదో పొరపాటు తలిచి సెక్రటరీగా వుంటే ప్రతివాడూ వేలు పెట్టి తప్పులెంచేవాడేకాని పూనుకుని వాటిని తొలగించేవాడు లేడు. సెక్రటరీగాచేరితే వాళ్ళకు తప్పులెంచటానికి అవకాశం వుండదు. అందుకని వాళ్ళు సెక్రటరీలు కారు.'

'ఇది కొత్తకాదండీ-ప్రతిచోటా ఇలాగే తగలబడి వుంది మనవాళ్ళ వ్యవహారం' అన్నాడు రావు.

'మనదేశంలో వుండటం వేరు-అక్కడంతా మనమే. కిందబడ్డా తెలుగువాళ్ళే మీదబడ్డా తెలుగువాళ్ళే. ఇక్కడ అలాకాదు. ఇది మన దేశం కాదు. ఇక్కడ మన సంఖ్య చాల తక్కువ. ఆంధ్రసంఘ స్థాపం చాలిసిన విధి మనమీదవుంది.' అన్నాడు శాస్త్రి.

'క్లబ్‌లో ఏమేమిచేస్తూంటారు?' అన్నాడు రావు.

'మాక్లబ్‌లో చీట్లపేక తప్ప మరే డిపార్టుమెంటూ లేదు. వాళ్ళకి ఓ సంగీతం అక్కర్లేదు, సాహిత్యం అక్కర్లేదు. దేశం అక్కర్లేదు. ఏమీ అవసరంలేదు. పేకవుంటె చాలు. ఈ ధ్యాయిలతో ఎలా నడుస్తుందీ? ఎవడన్నావస్తే పేకాటతప్ప ఇంకోటి కనపడదు. అందుకని అనేకమంది సభ్యులుగా చేరటం మానేశారు.'

'మా వూళ్ళో పేకాటవాళ్ళతోనే క్లబ్ నడుస్తొ. వాళ్ళని తీసేస్తే క్లబ్ వుండదు.' అన్నాడు రావు.

శాస్త్రికి క్లబ్ విషయమై రావుకు ఇంకా ఏం చెప్పాలో తోచలేదు.

'చుట్టుపక్కల ఎక్కడికైనా, ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళరాదూ? సంవత్సరాని కోసారి విందు ఏర్పాటు చెయ్యరాదూ? ఏదో ఒకరకం కదలిక వుండాలి. సంస్థ జీవించివుండాలి. కప్పనుమింగిన పాముమల్లేవుండరాదు.' అన్నాడు రావు.

'మాబాగా సెలవిచ్చారు! ఓసారి మేము ఎక్స్‌కర్షన్‌కు బయలు దేరాం. రేపు బయలుదేరుతామనగా ఇవాళ సాయంత్రంవరకూ పదిమంది

తయారైనారు. ఏమైనా సరే పంతంకోసం బయలుదేరాల్సనుకున్నాం. మర్నాడు పొద్దున్నే గైలుదగ్గర మరి పాతికమంది తయారైనారు! మేము వీళ్ళందరికీ ఎక్కడ సప్లయిచేయగలం? ఎలాగోలాగు తంటాలు పడ్డాం. ఎవ్వరికీ ఏమీ అందలేదు. రసాభాసం అయింది. మళ్ళీ ఇంటికి చేరేటప్పటికే గగనం అయింది. వచ్చినవాళ్ళయినా సద్దుకుపోరాదూ? పెళ్ళాంమీద కోపంవచ్చి రాత్రి అన్నంమానేసి మర్నాడు పొద్దున గైలు దగ్గిరకి వచ్చి అప్పుడు డబ్బిచ్చిన ఒకాయన పెళ్ళాంమీద కోపమూ తన ఆకలీ పదిమందికి తెచ్చుకున్న పదార్థంమీద చూపించాడు.

"అందుకనే నేను ఇటువంటివాటికి రాను. ఇలా అవుతుందని నాకు మొదటినించీ తెలుసు. అసలు నేను ఇచ్చిన రూపాయి ఇస్తే హోటలులో నిక్ష్యేపసవిందు లభిస్తుంది. పదిమందిమీద రూపాయి ఇస్తే న్యాయంగా ఇంకా విలువైనవిందు రావాలి—ఎందుచేతనంటే పదిమందిమీద కలిసి వస్తుంది కాబట్టి!" అని అంటాడు పైన సిగ్గులేకుండా!'

'అటువంటివాళ్ళను రానీయకూడదు!' అన్నాడు రావు.

'ఎలా వీలు అవుతుంది?'

'వీలు కావాలి!'

'వచ్చినవాళ్లయినా మర్యాదగా ఇచ్చింది పుచ్చుకోవటంలేదు - నీళ్ల నెత్తితగలబడ! చదువుకుని పిల్లల్ని కంటూరు,ఏడవనా?' అన్నాడుశాస్త్రి.

'నేను మరి శలవు పుచ్చుకుంటాను.' అన్నాడు రావు.

'ఇంకా వుంటారా?'

'ఆ! కొంతకాలం వుంటాను.'

'అయితే మీరు సభ్యులుగా చేరాలి!'

రావు కొంచెంసేపు ఆలోచించి సరేనన్నాడు.

రావు మెంబరుగాచేరి రెండు నెలలయింది. కొంతమంది మెంబర్ల చర్యలు అతనికి బొత్తిగా రుచించలేదు. రామదాసుచేత ప్రతి మెంబరూ ప్రతి పనీ చేయించుకునేవాడే. ఇన్ని శ్రీరంగనీతులు చెప్పిన శాస్త్రి గారు అతన్ని స్వంత నౌకరుగానే చూచుకునేవాడు.

ఆ రోజు జనరల్ బాడీ మీటింగు. ప్రెసిడెంటుగారు అరగంట ఆలిస్యంగా రావటంవల్ల మీటింగు ఏర్పాటు చేయబడిన టైముకు గంట ఆలిస్యంగా మొదలుపెట్టాలిసి వచ్చింది. మీటింగులో శాస్త్రిగారు స్పష్టంగా చెప్పారు. తను అట్టే భాగ్యవంతుడుకాదనీ, ఏ తత్కారణంచేత తన ఆస్తిని సభ్యులమీద వినియోగించలేననీ,ఆస్తిపోయినాక్లబ్‌కు సెక్రటరీగా వుంటేచాలు అనే మోహం తనకు లేదనీ, అందుకని తను రాజీనామా ఇస్తున్నాననీ. అనేకమంది ఆయన్ని బతిమాలారు సెక్రటరీగావుంటమని. రామదాసువల్ల ఆయన పొందుతుంటాడే సౌకర్యంకూడ ఆయన్ని ఆ పదవిని త్యజించకుండా వుండటానిక అడ్డుపడలేదు. మరెవ్వరూ సెక్రటరిగా వుండమంటే వుంటమన్నారు. ప్రెసిడెంటుకు వేళ కావటంచేత ఎవ్వరూ వుండకపోయే ట్లయితే క్లబ్బు మూసేయాలిసివస్తుంది అన్నాడు. ఎవడికి కావాలి బాధకొపని అన్నారు ఒకరు. ఒక్క నిమిషం అటూ ఇటూ అన్నట్టు అయింది.

'ఎవ్వరూ వుండరా ?' అన్నాడు ప్రెసిడెంటు.

'ఎవ్వరూ వుంటని పక్షంలో నేనుంటాను.' అన్నాడురావు. అందరూ అతని వంకచూచారు. క్లబ్‌లో బడాఆద్మీలకు అతనెవరోకూడా తెలియదు—వా రేగోజున్నైనా క్లబ్‌కువచ్చిన పాపాన పోతేనా !

'ఎవరండి మీరు !' అన్నాడు ప్రెసిడెంటు.

'రెండు నెలలయింది లెండి వారువచ్చి!' అన్నా రెవరో.

'నేను కిందటిసారి వచ్చినప్పుడు మీరున్నారా ?'

'మీ రెంతకాలంకింద వచ్చారు ?' అన్నాడు రావు.

'ఏమో ! వారు సెక్రటరీగా వుండటానికి ఎవరికైనా అభ్యంతరం వుందా ?' అన్నాడు ప్రెసిడెంటు.

'తెలియని మనుజుని తీసుకోవటం ప్రశంశనీయమా—అది లాభహేతువా ?' అన్న మీమాంస వచ్చింది బడాఆద్మీస్‌లో. ఒకళ్ల మొహాలు వకరు చూచుకున్నారు.

'ఆల్ రైట్ ! మీరు ఈనాటినుండి శక్రటరీ !'

'మూడురోజులలో ఇది మూయకపోతే చూడు.' అన్నాడు ఒక ఆద్మీ.

'నీకూ అలాగే తట్టింది—నే నెప్పుడో అనుకున్నాను!' అన్నాడు ఇంకో బడాఆద్మీ.

ఇద్దరికీ తెలియదు రావు ఎవరో, అతనిది ఏవూరో!

*　　　　*　　　　*

రావు క్లబ్ ఎకౌంటు లెక్కలు మొదలైనవన్నీ ఓ వారంరోజులు తిరగవేశాడు. క్లబ్‌లో దాదాపు నూరుమంది సభ్యులున్నారు. నూరుమంది చందా సరిగా ఇస్తే ప్రతినెలా 75 రూపాయలు వస్తాయి. ఖర్చులు అన్నీపోను ప్రతినెలా పదిరూపాయలపైగా మిగలాలి. కాని లెక్క చూస్తే క్లబ్‌కు పాతిక రూపాయలు అప్పువుంది! ఆరునెలలకుపైగా చందా ఇవ్వాలిసినవారు డజనుకుపైగా వున్నారు. వారింటికి ప్రత్యేకంగా రామదాసును ఒకరోజు పంపాడు. ఒక్కళ్లూ చందా ఇయ్యలేదు. నాలుగైదుసార్లు పంపాడు. లాభించలేదు. పైలాన్ తీసి చూచాడు. చందా ప్రతినెలా ఇయ్యనిసభ్యుడిని ఏమి చెయ్యవలసిందీ విశదీకరింపబడలేదు. వెంటనే జనరల్ బాడీనిపిలిచి ప్రతినెలా సక్రమంగా చందా ఇయ్యని సభ్యుడిపేరు తీసివేయబడును అని నిబంధన కావాలని కోరాడు. దీని కెవ్వరూ వప్పుకోలేదు. సంసారపక్షంగా పోతేగాని లాభంలేదని సెలవిచ్చారు కొందరు. మూడురోజులలో సభ్యులందరిపేర్లూ కొట్టివెయ్యాలిసివస్తుందని సూచించారు, కొందరు.

"అటువంటివాళ్ళు మనక్లబ్‌లో లేకపోవటమే మంచిది. క్లబ్ బాగుండాలి అని వారికి కించిత్ అభిలాషకూడా లేనప్పుడు వారెందుకు ఇక్కడ మనకు అడ్డంగా! అది పెడితేతప్ప నేను వుండలేను!" అన్నాడు రావు.

కొంతమంది రావుపక్షం పలికారు. నానాగోల ఐంది. మొత్తంమీద ఒక్కవోటుతో రావు నిబంధన ఆమోదించారు.

'చూడండి మళ్ళీ ఈ తారీక్కు ఇది మూయబడకపోతే!' అన్నాడు ఒకాయన. ఎవరో ఆయన గోచి వూడతీశారు వెనక!

మర్నాడు ఒక నెలపైగా బాకీవున్న వాళ్లందరికీ సభ్యుల తీర్మానంతో పాటు నోటీసు పంపించాడు రావు—ఒక వారంలోపల చందా చెల్లింపబడకపోతే పేర్లు తీసేయబడతాయి అని. నలుగురైదుగురుతప్ప ఎవ్వరూ ఇయ్యలేదు. మళ్ళీ మీటింగుపెట్టి పేర్లు తీసేయాలి అన్నాడు రావు. చాలా గొడవయింది. ఏలాగైతేనేం పేర్లు తీసేయటానికి నిశ్చయం అయియింది. అరవైమంది పేర్లు తీసేయబడ్డాయి. 'ఇది చాల ఘోరం!' అన్నాడు ఒక సభ్యుడు అంతా అయింతరువాత. 'మరి తప్పలేదు' అన్నాడు రావు చిరునవ్వుతో.

తీసివేయబడిన పేర్లలో ప్రెసిడెంటు పేరుకూడా వుండటం మూలాన మళ్ళీ ఎలక్షన్లు పెట్టాలిసివచ్చింది. బడాఆఫీసర్లు లందరికీ ఆవేశం కలిగింది. రావుమీద పట్టరాని ఆగ్రహం కలిగింది. తాము లేకుండా క్లబ్బు ఎలా నడుస్తుందో చూదాం అన్నారు. కొందరు రావును తీసెయ్యటానికి విశ్వప్రయత్నంచేశారు. కాని లాభంలేక.

సభ్యులసంఖ్య తగ్గటంవల్ల డబ్బు చాలలేదు. క్లబ్బు నడవాలంటే చందా ఎక్కువచెయ్యక తప్పదుఅని సూచించాడు మీటింగులో. కొంతమంది వొప్పుకోలేదు. మొత్తంమీద చందా హెచ్చించారు. చందా హెచ్చించే పక్షంలో మేము వుండమన్నారు ఇరవైమంది. అలా ఐతే చందా ఇంకా హెచ్చించాలిసి వస్తుంది అన్నాడు రావు. చాలసేపు ఘర్షణ జరిగింది. ఇరవైమంది వొప్పుకున్నారు. ఇరవైమంది చందా హెచ్చినకారణంచేత మానుకున్నారు.

'క్లబ్బు నిజంగా ఎంతమంది కావాలో వారు ఎవరో నాకు ఈ రోజున తెలిసిపోయింది. వారందరికీ నా అభివందనాలు. నాకు ఆరునెలలు టైము ఇచ్చేటట్టయితే ఈ క్లబ్బుకు వందమందికాక దానికి రెట్టింపుసంఖ్యని చేర్చగలననే ధైర్యంవుంది. ఏమైనాసరే ఈ ఆరునెలలూ మీ సహాయం తప్పదు!' అన్నాడు రావు. అంతా చేతులెత్తారు. ఆ మీటింగులోనే బైలాస్‌లో అనేకమార్పులు సూచించాడు. అన్నిమార్పులూ జరిగినై. ముఖ్యమైనవిషయం ఏమిటంటే అతను ఏదికోరినా ఆ సభ్యులలో ఒక్క

రికీ అనవసరంగా కనపడలేదు. వారిలో ఎవరు సెక్రటరీగావున్నా ఆ మార్పు జరిగివుండేదే అన్నట్టుగా తోచింది. రావు నామకః సెక్రటరీగా వున్నట్టు వుండటమే కాక ప్రతివాడు తనమీదా బాధ్యత వున్నట్టు భావించారు.

ఈ ఇరవైమందిలోనూ సాహిత్యసంఘం అనీ, నాటకసంఘం అనీ, వ్యాయామసంఘం అనీ, ఏర్పాటులు జరిగినై. ఒక మంచి నాటకం ఏరి ఒక నెల అభ్యాసంగా రిహార్సలుచేసి నాటకం ఆడించాడు రావు. దాదాపు సభ్యులందరు నాటకంలో వేషం వేసేవారయినారు. అందరూ కాన్వాస్ చేసి టిక్కెట్లు అమ్మారు. బాడా అడ్మిన్‌కు సహాయం దొరికింది. 'ఇప్పుడు మేం కావలిసివచ్చామేం?' అన్నారు. కసిరారు. అవమానం చేశారు. రావు సభ్యులను కోరాడు, తమను అవమానం చేసినవారందరినీ క్షమించమని! నాటకానికి అయిదువందల రూపాయలు వచ్చినై. ఇంకోసారి వేశారు. నాలుగువందలు వచ్చినై.

'మన క్లబ్‌కు ఎనిమిదివందలు మూలధనం వచ్చింది. రెండువందలు ఖర్చు కాలకిందా ఒకవంద నాటక సామగ్రికిందా ఖర్చుపెట్టక తప్పదు' అన్నాడు రావు. 'నీ యిష్టం!' అన్నారు సభ్యులు.

'మనకు ప్రతినెలా మీటింగు కావాలి. నెలకొకసారి మనం ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళాలి. రెండునెలలకొకసారి సాహిత్యకచ్చేరి కావాలి. ఆరునెలలకొకసారి నాటకం ఆడాలి. సంవత్సరానికొకసారి ఆంధ్రులందరికీ విందుచెయ్యాలి, వూళ్ళో ఆంధ్రులందరికీ—ఎంతమందియినా సరె కాకపోయినా సరె!'

వూళ్ళో హడావిడి బయలుదేరింది. అద్భుతమైన పాటకచేరీలు పెట్టించాడు రావు. పెద్దల్ని ఆహ్వానించేవాడు. వాళ్ళమీద గౌరవంచేత కాదు. తమ క్లబ్ యొక్క సంఖ్య వెల్లడికాకుండా వుండటానికి!

నోరూరే విందులు ఏర్పాటుచేయించేవాడు. 'డబ్బు ఇచ్చినా అటువంటి విందు మనకు ఎప్పుడూ లభించింది?' అన్నారు సభ్యులు.

అనేక చోట్లకు ఎక్స్‌కర్షనుకు వెళ్ళారు.

బాడా అడ్మినుకు అసూయ ఎక్కువయింది.

క్రమంగా సభ్యులు మళ్ళీ రావటం మొదలుపెట్టారు. పాతబాకీ చెల్లిస్తే తప్ప సభ్యులుగా చేర్చుకోవటానికి వీల్లేదు అని రూలు చూపించాడు రావు. మరి తప్పలేదు. సభ్యులసంఖ్య హెచ్చయినకొద్దీ చందా తగ్గించాలి అన్నాడు రావు. సభ్యులసంఖ్య నానాటికీ పెరిగిపోయింది. వూళ్ళోవున్న ప్రతి ఆంధ్రుడూ క్లబ్‌లో మెంబరుగా వుండకుండా వుండటానికి సిగ్గుపడ్డాడు. సంవత్సరం పూర్తిఅయేటప్పటికి సభ్యులసంఖ్య వెయ్యిదాటింది. బడా ఆఫీసర్లు చిరునవ్వుతో మళ్ళీ చేరక తప్పలేదు. పాతబాకీ ఇచ్చి మరీ!

వార్షికోత్సవసమయంలో రావును అఖండంగా గౌరవించారు. ఒక్క సంవత్సరంలో ఏ సంస్థనూ ఎవ్వరూ ఈ స్థితికి తీసుకురాలేదు. మేమంతా మీకు కృతజ్ఞులం అన్నారు.

'మీ కృతజ్ఞతకు నేను తట్టుకోలేను! నేను యిక్కడినించీ శెక్రటరీగా వుండలేను. నేను రాజీనామా ఇచ్చేస్తున్నాను!' అన్నాడు రావు.

కోలాహలం బయలుదేరింది సభలో.

'నేను లేకపోయినా ఈ సంస్థకు చెలనం వుండదు అని నాకు గట్టి విశ్వాసంవుంది. నాకు అనేకం పనులున్నాయి. నాయందు కనికరంవుంచి నన్ను విముక్తుడిని చెయ్యమని కోరుతున్నాను' అన్నాడు రావు. అతన్ని కష్టపెట్టడం ఇష్టంలేక ఆమోదించారు.

సభ అయిపోయింది.

'మన క్లబ్బు ఇంతదికావటం చాల ప్రశంసనీయమే కాని దానికి కారణం నువ్వుకాబట్టి నీకు కృతజ్ఞుడనై వుండక తప్పదు' అన్నాడు శాస్త్రి.

'నేను రాజీనామా ఇయ్యటానికి అదే కారణం! ఈ క్లబ్బులో చేరక మునుపు నా కిష్టమయిన జీవితం జీవించేవాడిని. అందుకని దానికోసమే మళ్ళీ దానిదగ్గరికే పోతున్నాను. నాకు రుచించేజీవితమే మన క్లబ్బులో చేరినవారందరికీ రుచించడం నా అదృష్టం!' అన్నాడు రావు.

---

# శ్యామలా ప్రొడక్షన్సు

ఆ రోజుల్లో శ్యామలరావు టూకీగానన్నాసరే టాకీ తీయిస్తానని చేసిన గోల ఎవరికి తెలియదు ? ఫలాని స్టుడియోలో తీయబోతున్నాం అని ఒకసారీ, నటీనటులతో ఫలానిరోజున బయలుదేరబోతున్నాం అని వకసారీ, ప్రతి పత్రికలోనూ ఎడ్వర్టయిజుచేసిన రోజులవి. కాని అంత అట్టహాసమూచేసి చివరకు ఏమీ లేకుండా శ్యామలరావు ఎందుకు విరమించుకున్నాడో చాలా మందికి తెలియదు. తెలుసునని విర్రవీగే కొందరికైనా తెలియదు నిజం. నిజంగా చెప్పాలంటే మరి నిజం చెప్పాలి!

మొహం సబ్బుతో కడిగేసుకుని, తల దువ్వుకుని ఇస్త్రీ చొక్కా, మల్లుపంచా ధరించి ఖద్దరు వుత్తరీయం భుజానవేసుకుని షికారుకు బయల్దేరాడు శ్యామలరావు. పదిగజాలు వెళ్ళాడో లేదో ఎవరో పిలిచినట్టు వినిపించింది. వెనక్కు తిరిగి చూచాడు. ఆ సందు చివర ఒకామె నీళ్ళబిందె భుజాన పెట్టుకుని ఇంట్లోకి పోతున్నది. ఓ కుక్క ఏం చెయ్యడానికీ తోచక రోడ్డుమధ్య నిలబడి ఆలోచిస్తున్నది. మరి ఆ వీధిలో ఎవ్వరూ లేరు. పక్క వాకిట్లో తలపాగా చుట్టుకున్న బంట్రోతు తప్ప.

'నన్నేనా?' అన్నాడు శ్యామలరావు.

'మా అయ్యగారు పిలుస్తున్నారు!' అన్నాడు బంట్రోతు.

'మీ అయ్యగారా!' అంటూ ఆలోచిస్తూ వెళ్ళాడు శ్యామలరావు.

*　　*　　*

రాత్రి పదిగంటలు దాటింతరవాతగాని శ్యామలరావూ, వెంకట్రామయ్యా భోంచేసి ఇంటికి రాలేకపోయినారు.

'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అన్నాడు వెంకట్రామయ్య చొక్కా వొంకెన తగిలిస్తూ.

'నాకివ్వాళ ఎన్నడూ జరగని అనుభవం జరిగింది!' అన్నాడు శ్యామలరావు.

'ఏమిటది?'

'మన ఇంటిపక్కనున్న కలెక్టరుగారు ఇవ్వాళ నన్ను పిలిచాడు!'

'దేనికీ?' అన్నాడు వెంకట్రామయ్య కళ్ళు పెద్దవిచేసి.

'నేను వాళ్ళ అమ్మాయిని పిలిచానుట-ఆ విషయం కనుక్కోటానికి!'

'వాళ్ళ అమ్మాయిని పిలవటం ఏమిటి?'

'వాళ్ళమ్మాయి దొడ్లోకివచ్చినప్పుడల్లా ఆమె నావేపు చూచేటట్టు ఏదో చప్పుడు చేస్తూనే వున్నానుట. ఒకసారి తీరా ఆమె చూచేటప్పటికి మాట వినబడకుండా 'మాట' అని పిలిచానుట-నిజమేనా అని అడిగాడు ఆయన నన్ను!' అన్నాడు శ్యామలరావు.

'నువ్వేమన్నావు?'

'నేనా అమ్మాయినెప్పుడూ రమ్మని పిలవలేదు—పైగా సమయం దొరికితే పొమ్మని చెబుదామనుకుంటున్నానని చెప్పదామనుకున్నాను!'

'ఆయనింకా ఏమన్నాడు?' అన్నాడు వెంకట్రామయ్య.

'ఇలాంటివి జరగటం, అవి తనదాకా రావటం తనకిష్టంలేదనీ అంతకన్న ఆయనేమీ చెప్పదలుచుకోలేదనీ అన్నాడు.

రెండు నిమిషాలసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

'అసలే మనం సినిమావాళ్ళం—మనం వచ్చినపనా సినిమాకెవరైనా మంచి చదువుకున్న హీరోయిన్ దొరుకుతుందేమోనని! మనవల్ల ఏ తప్పూ లేకుండానే జనం మనమీదో కన్ను వేసివుంచటానికి బోలెడు వీలుంది. ఆపైన మనం వుంటున్నది కుటుంబాల ఇళ్ళమధ్య! నాకు తెలిసినంతవరకూ నేనే ఈపని చేసివుంచటానికి వీల్లేదు. చదువుకున్నదో చదువురానిదో కొంచెం తెలివి తేటలుగలిగి మామూలుగా అందంగా వుండి సినిమాలో నిజంగా అభిలాషవున్న దెవరైన దొరుకుతుందేమోనని చూస్తున్నాను. ఇప్పటికి అయిదారు వూళ్ళు తిరిగానుగాని లాభించలేదు. నాకు హీరోయిన్ దొరకగానే నే నీవూరినించి వెళ్ళిపోదామనుకున్నాను. ఈ మధ్యలోనే వెళ్ళాలిసి వచ్చేటట్టుంది. మరినువ్వు నా సహాయంకోసం వచ్చిన రెండు రోజుల్లోనే—'

'నే నిందాకా వస్తుందనుకోలేదు బ్రదర్! కాని—నువ్వు నమ్మవు కాని—ఆ అమ్మాయి నావంక ఎలా చూచిందని! అలా చూచిన అమ్మాయిని ఏ మొగవాడయినా ఏం చెయ్యటానికి సంసిద్ధంగాడు? నువ్వు ఇక్కడికివచ్చి నెలరోజులు దాటుతున్నది కాగూ? నీవంక ఆ అమ్మాయి అలా ఎప్పుడైనా చూడలా? కాని—పోనీ నేను పిలిస్తే ఆ అమ్మాయి నువ్వు పిలిచావనుకుంటేమో!'

ఈ ఆలోచన వెంకట్రామయ్యకు చాలా బాగుండటంవల్ల దాన్నే తీవ్రంగా నెమరువెయ్యటం సాగించాడు.

'ఎందుకంటే అలా చూచినమ్మాయి అలా చెప్పకుందా?' అన్నాడు వెంకట్రామయ్య.

'అదంతా నాకు తెలియదు. నేను పిలిచేటట్టుగా ఆ అమ్మాయి నావంక చూడటమూ నాకిష్టంలేదు—అలా చూస్తే నాకు పిలవటమూ ఇష్టంలేదు. అలా పిలవగానే ఆ అమ్మాయివెళ్ళి వాళ్ళతో చెప్పటమూ ఇష్టంలేదు!'

'ఇటువంటివి చెయ్యటం నాకూ ఇష్టంలేదు—పైగా నేను చేసిన వాటికి ఇంకోరు అనుభవించటంకూడా నాకిష్టంలేదు—కాని ఆ పైన ఆ చూడటంచూస్తే—!'

'ఆ అమ్మాయి ఇంటర్ చదువుతున్నది కాబోలు. తండ్రి కలెక్టరు! ఏమోనబ్బా ఈ వ్యవహారం ఇంత స్వల్పంలోపోయినందుకు నే నదృష్టవంతుడినే. ఈ వ్యవహారంలో ఆయన అంతకన్న మర్యాదగా ప్రవర్తించటానికి వీల్లేదు! మరొకరైతే—!'

శ్రమ అంతా శ్యామలరావుదే అయినప్పటికీ వెంకట్రామయ్య కొద్దిగా పెట్టుబడి పెట్టిన పాపాన పోవటంవల్ల అతనికే ఎక్కువ అధికారం వుండటంవల్ల శ్యామలరావు అంతకన్నా ఏమీ అనలేకపోయినాడు. సినిమా జీవితం అతనికి కొత్తగాదు. ఎవరేమి చేసుకున్నా అతనికి అభ్యంతరము లేదు. కాని చిత్రం సక్రమంగా సంపూర్ణం కావటానికి ఇటువంటివేవి అడ్డంవచ్చినా సహించలేని స్థితిలోవున్నాడు. ఎవరికిష్టం లేక

పోయినా అటువంటివి జరక్కుండా వుంటయి అని అతనికేకో శానా నమ్మకంలేదు!

అతను అన్ని ఆటంకాలూ దాటగలిగి ధనం చేకూర్చటానికి చేసే ప్రయత్నంలోనే చాలా ధనం అప్పటికే ఖర్చయింది! ఫిలిం తయారు కాకపోతే అతనికివచ్చే నష్టం ఏమీలేదు. శ్రమకు ఏ రూపకంగానూ ప్రతిఫలం రాకపోవటం తప్ప.

'ఇవాళ నిన్ను మళ్ళీ ఆ కలెక్టరు పిలిచాడల్లేవుందే?' అన్నాడు వెంకట్రామయ్య.

'ఆ!' అన్నాడు శ్యామలరావు.

'దేనికీ?'

'నిన్న ఆయన చాలా తొందరపడ్డాడని అనుకున్నాడుట! జరిగిందేదో జరిగిపోయింది; నన్ను అదేమీ మనస్సులో పెట్టుకోవద్దని కోరాడు. ఆ తర్వాత లోకాభిరామాయణం ఏదో వచ్చింది. నేనికక్కడికెందుకొచ్చిందీ, ఈరోజుల్లో సినిమాలకు మంచి లాభాలు వచ్చేదీ లేనిదీ, సినిమాలు ఎలా తీసేదీ ఆయన నాద్వారా తెలుసుకున్నాడు.'

'ఇలాంటివన్నీ చెబితే మనకు నష్టంకాదూ?'అన్నాడు వెంకట్రామయ్య.

'మనకేవిధంగా నష్టం?' అన్నాడు శ్యామలరావు.

'సినిమాలు ఎలా తీసేదీ అందరూ తెలుసుకుంటే ఇదివరకే తెలిసి కష్టపడుతున్న వారందరికీ నష్టమే!'

'సినిమాలు ఎలా తీసేది కష్టపడి నేర్చుకున్నవారికే ఇందులో ఆశ్రయం లేకుండా చేయగలిగి సినిమా వర్తకులు వ్యాపారం చెయ్యగలుగుతుంటే ఇక మాటలతో ఎలా సినిమా తీసేది తెలుసుకుని వారు పోటీకివస్తే నష్టంవస్తుందేమోనని భయపడితే అర్థం ఏముంది? లేక సినిమాలు తీసే విధం మాటలతోనే తెలుసుకుని పోటీకి వస్తారనీ భయమా? ఈ భయం ఒకసారి ఘాటించుచూస్తే అంతా నేర్చుకుపోతారేమోనని భయపడటం లాంటిదే? అయినా అసలింకా ఏమీలేదు ఇంతభయం దేనికి?'

'మాటవరస కన్నాను!'

* * *

వెంకట్రామయ్య ఎక్కడికో వెళ్ళాడు. చీకటి పడబోతుండగా శ్యామలరావు కాళ్ళు కడుక్కువద్దామని తలుపు తెరిచి బావిదగ్గిరికి వెళ్ళాడు. బావిపక్కన చిన్న పిట్టగోడవుంది. ఆపిట్ట గోడమీదుగా అవతలిదొడ్డి కనపడుతుంది. గోడకు పక్కగా చిన్న చిన్న పూలచెట్లు వున్నాయి. సంపెంగతీగపక్కన నిలబడి పూలకోసం వెదుకుతున్న ఆమె శ్యామలరావుకు కనపడింది. తలుపు చప్పుడుకాగానే ఆమె ఇటువేపు చూసీ చూడకుండా అవతలికి పోబోయి ఆగి మళ్ళీ వెనక్కుచూచింది. శాలమైన నుదురు, మెరుస్తున్న కళ్లు, చెదిరి చెవులను కొంచెం కప్పేసిన జుట్టు, తేలిక వంగపండురంగు చీరా, నాజూగ్గా, మొత్తంమేద తీగె చివర వికసించిన పుష్పంలావుంది ఆమె ముఖం వుత్సాహంతో! ఆమె చూపు లోపలికివెళ్ళి ఇంటో చెప్పేటట్టులాలేదు! శ్యామలరావుకు కొంచం ఆశ్చర్యంవేసింది. కాని ఏమీ గమనించనట్టుగానే నీళ్లుతోడి మళ్ళీ అటుచూచాడు. ఆమె అక్కడే నిలబడి ఆ సంపెంగతీగతోనే అర్థంలేని సంభాషణ చేస్తున్నది!

'ఏమండీ!' అన్నాడు శ్యామలరావు—కనీసం అన్నాననుకున్నాడు!

ఆమె ఇతనివంక చూచింది.

'క్షమించాలి—ఓ చిన్న విషయం!' ఆమె అలాగేవుంది.

'చిన్న పొరబాటు జరిగిపోయింది. మీరు దాన్ని అపార్థంచేసుకోవద్దని నా ప్రార్థన!' అన్నాడు శ్యామలరావు.

'నేను చాల పొరబాటు చేశాను—'

ఆమె గొంతు బాగావుండదని శ్యామలరావు వూహించుకోనప్పటికీ, ఆమెగొంతు బాగుండగానే అతనికి కొంచెము ఆశ్చర్యం కలిగింది.

'నేను కాలేజీకి వెళ్ళేటప్పుడు అనేకమంది కోతుల్లా ప్రవర్తించినప్పటికీ ఇతనిగోల మరీ అసహ్యంగావుంది. మరో అతను మీయింటో వున్నాడనే నాకు తెలియదు! మానాన్నగారు మీరే అలా చేసింది అనుకుని పొరపాటు చేశారు. వారు మీతో మాట్లాడుతుండగా నేను వినటం

తటస్తించింది. మీరు వెళ్ళిపోగానే నేను వారితో అప్పుడే చెప్పాను జరిగిన పొరబాటు. మీకు ఎంత కష్టం కలిగిందో—మీరు నన్ను క్షమించాలి!'

ఆమె ముఖంలో ఆవేదన, నిష్కాపట్యం, అమాయకత్వం తాండవం ఆడుతున్నై. శ్యామలరావుకు నవ్వొచ్చింది.

'నా క్షమాపణ మీతో చెప్పాలని నిన్నటినుంచి—ఎప్పుడు చూచినా అతనే ఇక్కడ వుండేవాడు!'

'మీ క్షమాపణ అవసరంలేదు. ఇలాంటిది జరక్కుండావుంటే నేను ఎంతో సంతోషించేవాడిని. అయితే ఇది జరగకపోతే—ఇలాంటిది జరగకపోతే—ఎంత సంతోషించేవాడినో నేను వూహించుకోటానికి వీలుండేదికాదు!' మరేం మాట్లాడాలో శ్యామలరావుకు తెలియలేదు.

'వస్తాను!' అని ఆమె వెళ్ళబోయింది.

'మీ పేరు?' అన్నాడు శ్యామలరావు.

'శ్యామల!'

* * *

'ఇవాళ నన్ను మన కలెక్టరుగారు భోజనానికి ఆహ్వానించాడు. ఆయన ధోరణి చూస్తే ఆయనకు ఫిలిం పరిశ్రమలో పెట్టుబడి పెట్టాలని వున్నదేమోనని నా అనుమానం!'' అన్నాడు శ్యామలరావు.

'ఏమాత్రం?' అన్నాడు వెంకట్రామయ్య.

'సమ్మకం కుదిరితే చాలా ఇయ్యొచ్చు!'

'అయితే మనం వెళ్ళి రేపు మాట్లాడదామా?'

'అక్కడికి రావటానికి నీకేమీ అభ్యంతరం లేకపోతే!' అన్నాడు శ్యామలరావు.

'ఓహో—అదా!'

'అదికాక ఆయన ఇంకా ఏమీ సూచించలేదు. కాని నా అనుమానం ఆయనకు ఆ వుద్దేశ్యం వుందని. ఆయన పెట్టుబడికూడా మనకు లభిస్తే మనం ఇంకెవర్నీ ఆశ్రయించక్కర్లేదు.'

'అయితే ఆ విషయం నువ్వే చూడు. మరి నేను రేపుసాయంత్రం వూరి కెళ్ళుతాను. ఆ వర్ధనిని బుక్కు చేస్తే బాగుంటుందేమో?'

'దాంట్లో చాలా అవస్థవుంది. చిన్నచిన్న విషయాలే అది బొత్తిగా గ్రహించుకోలేదు. మాట్లాడించకుండా తెరమీదికి తీసుకురాదలిస్తే— బుక్కు చెయ్యచ్చు. మరి మన హీరోయినుకు బోలెడు తతంగంవుందే!'

'సరే నీయిష్టం!'

* * *

కలెక్టరుగారికి అనేకసార్లు పిచ్చాపాటీ మాట్లాడుకోటానికి శ్యామల రావు అవసరం అయినాడు. అప్పుడప్పుడు శ్యామలకూడా పాల్గొనేది. అదీకాక గోడదగ్గిర తలవని తలంపుగా అనేకసార్లు ఇద్దరూ అదీ ఇదీ చెప్పుకునేవారు. పరిచయం బాగానే అయింది. శ్యామల అతనితో ధాటీగానే మాట్లాడేది. సినిమాలో అతనికున్న అనుభవం చెప్పాడు.

'అయితే చూడండి సినిమాల్లో ఆడవాళ్ళని మహానిర్బంధపెడతారనీ, అందరికీ వాళ్ళు లొంగిపోవాలనీ, లేకపోతే అనేకవిధాల బాధస్తారనీ అంటారు నిజమేనా?'

'అలా జరిగిన సంగతులు లేకపోలేదు. కాని—'

'అలాంటప్పుడు చదువుకున్నవారు సినిమాలలో చేరమంటే ఎవరు చేరతారు?'

'సినిమాలలో చేరగానే చెడిపోయేటట్టయితే చదువురానివాళ్లుమాత్రం చెడిపోవాలనీ, చదువుకున్నవాళ్ళు చెడిపోరాదనీ ఎక్కడవుంది? చదువుకుని చెడిపోదలుచుకున్నవాళ్ళు సినిమాల్లో చేరచ్చు! అదీకాక సినిమాలలో వున్న మగవారినే తప్పుపట్టాలిసినపనిలేదు. ఈ ఆడవాళ్ళు ఏవిధంగానూ తక్కువతిన్నవారుగాదు. వీరి ప్రేరేపణ లేకపోతే దూరంగా నిలబడి చప్పుడు చెయ్యాలిసిందేగాని మొగవాడు ఏమీ చెయ్యలేడు—చెయ్యడు. అంటే మొగవాడు ఆడదాన్ని బురదలోకి ఈడ్చటానికి ప్రయత్నం చెయ్యడనికాదు. ఆ వాతావరణం అటువంటిది. పాతివ్రత్యం పాటించ

దలుచుకున్నవాళ్ళు సినిమాలలోకివచ్చి అందరితోడూ తెంపకుండా వుండటం చాలా అవసరం. సినిమాలలోనే జీవితాన్ని గడపాలని అభిలాషవున్న స్త్రీ ఇతరవిషయాలను లక్ష్యంచెయ్యదు—అంతమాత్రాన బజారున పడదు. సినిమా ప్రపంచంలో జీవించేస్త్రీకి పురుషుడి చెయ్యి తగిలితే తప్పుగా తోచదు కాలక్రమాన. ఈ మార్పు ఒకరోజులో వచ్చిందికాదు. సినిమాలలో స్త్రీ పురుష సమస్యలేదు అని చెప్పటం ఎలా పొరబాటో ఈ పాపానికంతకూ మొగవాళ్ళే కారణం అనటం అంత పొరబాటు. వెధవవేషాలు వేసేస్త్రీలు అనేకమంది. మొగవాళ్ళ కాలేజీలో నలుగురు స్త్రీలుంటే మొగవాళ్ళల్లో చాలామంది ఏవిధంగా కోతులై పోతారో, ఆడవాళ్ళ కాలేజీలోకి నలుగురు మొగవాళ్ళువస్తే ఆడవాళ్ళు ఆవిధంగానే కోతులైపోతారు! ఈసమస్య ఈనాటిదికాదు. ఇది ఎవరికి చేతైనట్టు వారు సర్దుకోవాలి!'

'నాకు సినిమాలో నటించాలని వుందండీ!'

శ్యామలరావు నిర్ఘాంతపోయినాడు.

'ఏమిటీ! నిజంగానే!'

శ్యామల తలవూపింది.

'నేను నమ్మను—అన్నిటికీ తెగించి సినిమాలలో నటించాలన్నకాంక్ష అంత తీవ్రంగావుంది అనుకోను!'

'నిజంగానే వొట్టు!'

'నాకిష్టంలేదు—అయితే దానికేమీ అర్థంలేదనుకో! ఎందుకంటే ఒక్కసారిగా నువ్వు సినిమా జీవితంలోకి పోలేవు-నీకు ఏమీ తెలియదు!'

'నన్ను మీరా సినిమాలోకి తీసుకోండి-మీరుంటే నాకేమీ భయంలేదు!'

'నేను కాదుకదా నిన్నెవ్వరూ రక్షించలేరు—నీకే అంతా తెలిసి వచ్చేటంతవరకూ, నీకేవిధమైన ఇబ్బందీ రాకపోయినా ఆ వాతావరణం మహాకష్టంగా వుంటుంది. చదువుకుని, తెలివితేటలున్నవాళ్ళు సినిమాలలోకివచ్చి బాగుచెయ్యాలని కోరుకునేవారిలో నేను ఒకడిని అయినా-దానికి నువ్వుమటుకు కాదు!'

'ఎందుకని?'

'నేను చెప్పలేను—నా అనుమానం నీకు సినిమా జీవితం నిజంగా అర్థంకాలేదేమోనని!'

'నాకు అర్థం అయింది! అదీకాక మీరుండగా—'

'అదే పొరపాటు! నేను లేనప్పుడే సినిమాలోకి దిగు. ఎల్లకాలం నేను నీవెంటవుండనుగదా. ఈ పిక్చరు కాగానే ఇంకో పిక్చరులో నటించాలిసి వస్తే అక్కడి పరిస్థితులు వేరుగా వుండచ్చు. అవి నీకు రుచించక పోవచ్చు. ఈ పిక్చరు లాభించకపోతే నేను మళ్ళీ పిక్చరు తియ్యక పోవచ్చు. సినిమాతారను వాంఛించటానికెవరికైనా అధికారమున్నది కనుక ఎవరైనా నిన్ను వాంఛించితే అది నీకిష్టంలేకపోతే పాతివ్రత్యం నటిస్తున్నదీ అని హేళన చెయ్యవచ్చు. ఆ హేళన నీకు మరీ బాధాకరంగా వుండవచ్చు. నాకూ నీకు సంబంధంవుందని పుకారు బయలుదేరవచ్చు. అదేమీ ఆశ్చర్యమైన విషయంకాదు. నీకూ నాకూ ఏమీ సంబంధంలేదు అని నిజం తెలియటం అసలు ఆశ్చర్యమైన సంగతి!'

శ్యామల మాట్లాడలేదు.

'నన్ను అపార్థం చేసుకోక ఆలోచించు. నీవు సినిమాలలో చేరతానంటే నేను కాకపోయినా నిన్ను కళ్ళకద్దుకుని స్వీకరించేవారు, లేకపోయినా బయలుదేరతారు!'

'నిగారంగుకు తీసుకోరు—నాకు డబ్బుకూడా అక్కర్లేదు!'

'దానికి సమాధానం నే నిప్పుడు చెప్పలేను!'

ఆ రాత్రి శ్యామలరావుకు నిద్రపట్టలేదు. అతని మనస్సు పరిపరివిధాల పోయింది. అతను ఏరకం హీరోయిను కావాలని ఇన్నాళ్ళమట్టీ తపస్సు చేస్తున్నాడో ఆమె అతనికి అందుబాటులోవుంది! కాని తీరా సమయానికి అతనికే ఇష్టంలేకుండాపోయింది. దానికి కారణం బహుశా ఆమె శ్యామలే కావటం కావచ్చు—శ్యామలవంటిది అతనికి కావాలి కాని శ్యామల మటుకు కాదు! శ్యామలను సినిమాలో—అసంభవం!

మర్నాడు సాయంత్రం అతను కాఫీ చేసుకుని తాగుతుండగా శ్యామల తలుపు తెరుచుకుని వచ్చింది!

'ఏం తేల్చుకున్నారు?'

'నువ్వు సినిమాలలో చేరటం మీవాళ్ళకిష్టమేనా?'

'నాకు తెలియదు—బహుశా ఇష్టంవుండదు.'

'వారికి తెలియకుండా ఎట్లా?'

'వారికి తెలిసినా, వారికి ఇష్టంలేకపోయినా నాకు దిగుల్లేదు. ఈ విషయంలో వారి ఇష్టం రవ్వంతకూడా నేను పాటించపోవటంలేదు!'

'ఇంతకేనా వారు నిన్ను పెంచి పెద్దదాన్ని చేసింది?'

'నాకేలోపమూ చెయ్యనందుకు వారికి నేను యావజ్జీవితమూ కృతజ్ఞురాలుగా వుంటాను. కాని నా భవిష్యత్తును నేను ఏరుకోగలిగినంతవరకు వారు తెచ్చారు కనక అది నేనే తేల్చుకుంటాను. అని కాదనటానికి వారికి హక్కున్నప్పటికీ అధికారము లేదు. న్యాయంకూడా కాదు!'

'చాలా గట్టిగా నిర్ణయించుకున్నట్టున్నదే!'

శ్యామల మాట్లాడలేదు.

'నేను నిన్ను సినిమాలోకి తీసుకుంటానుగాని నీ కష్టసుఖాలు నీవే—వాటివిషయం నేను బాధ్యత వహించలేను!'

'అలా అయితే ఎలా?'

'నేను అంతకన్న ఏమీ చెయ్యలేను.'

'మీ అండ చూచుకునే నేను సినీమాలో చేరటం.'

'అది వద్దని నేను ఇదివరకే చెప్పాను.'

'మీ రిలా అంటారని—' శ్యామల అటువేపుతిరిగి తల వంచుకుంది.

'ఒక్క విషయం అడుగుతాను చెప్ప!'

'ఏమిటది?'

శ్యామలరావు వెళ్ళి ఆమెగడ్డం పట్టుకుని తలపైకెత్తాడు. ఇతనివంక ఒక అరక్షణం చూచి శ్యామల తలవంచుకుంది.

'ఏ మగవాడికైనా మతిపోయేటట్టు చూచావు అందుక నేనాకు తల తిరిగిందిఅని మావాడు నాతో చెప్పాడు-వాడినే అలాచూచావా లేక—'

శ్యామల మాట్లాడలేదు.

'చెప్పవూ ?'

'దేనికీ—'

'పనుంది !'

'అసలతను అక్కడున్నాడని నాకు తెలియదు !'

'నేనే అనుకుని అలా చూచావన్నమాట ! ఇన్నాళ్ళయ్యితే ఎన్నో సార్లు నువ్వు నావంక అలా చూస్తూవుండి వుండాలి. దాన్ని చూచే భాగ్యం నేనెన్నడూ వుపయోగించుకో లేదన్నమాట !'

'నాకేమీ తెలియదు–మీకు రకరకాల ఆలోచనలు తట్టుతున్నాయి–'

* * *

శ్యామల శ్యామలరావునితప్ప పెళ్ళిచేసుకోనని పట్టుపట్టింది. కలెక్టరు గారికి మరి గత్యంతరం లేకపోయింది. కాని టాకీతియ్యటానికి ఇస్తానన్న డబ్బు ఆయన ఇయ్యటం మానేశాడు. శ్యామలరావుకు టాకీతీసే అవకాశమే లేకపోయింది మిగతాడబ్బుకూడా ఖర్చుకావటంవల్ల.

తనవంక అలా చూచి తర్వాత అలా ప్రవర్తించి, చివరకు శ్యామల శ్యామలరావును పెళ్ళిచేసుకోగానే మాటలాడటం చేతకాకుండాపోయిన వారిలో వెంకట్రామయ్యకు అగ్రస్థానం లభించింది.

మరి ఇప్పుడు శ్యామలరావుకు నలుగురు పిల్లలు !

నువ్వు టాకీ తీయటం ఏమయిందిరా అని ఎవరన్నా అడిగితే ఇప్పుడు ఫిలింలేదు—యుద్ధం తర్వాత అంటాడు శ్యామలరావు.

'ఈ యుద్ధం కావటం, మీరు టాకీ తియ్యటం, ఈ పిల్లల్ని వేసుకుని నేను వేషం వెయ్యటం—చెప్పక్కర్లేదు' అంటుంది శ్యామల !

'అసలు నీకు నిజంగా వేషం వెయ్యాలనివుందీ—అంతా పచ్చి దొంగతనం. నన్ను సంసార సాగరంలో ముంచాలని నీకు దుర్బుద్ధి పుట్టిందిగాని! నీకేవిధంగానూ పెళ్ళికాక ఈఎత్తు పన్నావు !' అంటాడు శ్యామలరావు.

———

# శశాంకుడు

ఆ రోజుల్లో మేమంతా కాంతాన్ని రసపిపాసిగానే భావించేవాళ్ళం. అతని కదేమి అభ్యంతరం లేకపోవటంవల్లా, అతనికతనే రసపిపాసి ననుకుంటున్నాడేమోనని మా కో విధమైన అనుమానం వుండటంవల్లా, అతను రసపిపాసి అని మాలోమేము అనుకోకపోయినా అతనున్నప్పుడు మాత్రం, లాంఛనంగా అనే అనుకోండి, రసపిపాసి అని అంటూవుండటం జరుగుతూ వచ్చింది చెప్పొద్దూ. అయితే అసలు సంగతి ఏమిటంటే మేము అనుకుంటేనేం అనుకోకపోతేనేం అతను నిజంగా రసపిపాసి – పాపం!

ఈ సృష్టిలో అతనికి అంతులేని సౌందర్యం గోచరించేది, అని చెప్పేవాడు. ప్రకృతిలోనున్న అన్ని చిత్ర విచిత్రమైన వస్తువులలోకి "స్త్రీ" అతనికి అత్యంత సౌందర్యంగా కనిపించేది. సృష్టిలోనున్న సౌందర్యమంతా స్త్రీలో భగవంతుడు ఇమిడ్చాడు అని నమ్మాడు. స్త్రీలోనున్న సౌందర్యమంతా అర్థంచేసుకో గలిగితే ఈ సృష్టిలోనున్న సౌందర్యం అంతా చూచినట్లె అని అతని అభిప్రాయం. భగవంతుడు ఎక్కడపడితే అక్కడవున్నట్టుగానే స్త్రీ మూర్తిలోని సౌందర్యం ఎక్కడపడితే అక్కడవుంది!

కావ్యాలు, ప్రబంధాలు బాగా చదివిన పాపాన, అతని కీఅభిప్రాయం మరీ గట్టిగా స్థిరపడిపోయింది. ఆమె పిరుదులు ఇసుక తిన్నెలవలె వున్నయని అలనాడే చెప్పారు ఆ మహాకవులు! ఆమె తొడలు అరటి స్తంభాలు, కన్నులు కలువరేకులు – చూడగలిగితే ప్రకృతిలోని సౌందర్యానికి స్త్రీ ప్రతిబింబము కాదా మరి!

భగవంతుడు లీలగా చిత్రించిన ఈ సౌందర్య చిత్రాన్ని, రచించిన మహాకావ్యాన్ని ఎలా ఆనందించటం? ఎంత ఆనందిస్తే తృప్తి తీరుతుంది? తను నిజంగా ఆనందించాలిసినంత ఆనందించలేనేమోనని కాంతానికి దిగులుకూడా వేసింది!

పూర్వకాలంలో తపస్సుచేసి ఏ మహేశ్వరుడో ప్రత్యక్షంకాగానే

'నాకు చావులేకుండా చెయ్యి - నన్నెవ్వరూ జయించలేకుండా చెయ్యి' అని కోరుకున్నారేకాని ఒక్కడంటే ఒక్కడుకూడా 'ఓ దేవా! ఈ సృష్టిలోని సౌందర్యాన్ని ఒక్కరవ్వకూడా మిగలకుండా అంతా నేను ఆనందించేటట్టు చెయ్యి!' అని కోరుకున్నపాపాన పోనేలేదు. తనకే నిజంగా ఈశ్వరుడు ప్రత్యక్షమయితే, ఈ ప్రపంచంలోవున్న అందమైన స్త్రీలనందర్నీ తనచుట్టూ నక్షత్రాలలాగ చేర్చి ఆ సౌందర్యాన్ని అంతా కరతలామలకం చెయ్యమని కోరడూ!

స్త్రీ జాతియందు కాంతానికివున్న సహృదయాన్ని స్త్రీజాతి కించిత్ కూడా అర్థం చేసుకోకపోగా ఆదరించక పోవటంకూడా మహా ఘోరం. అందులో అందమైన యువతులు అతని అపార్థం చేసుకున్నట్టుగా చూడటం అన్యాయం. అందులో శాంత అతన్ని అలా చూడటం దారుణం. అతన్ని శాంత సరిగా అర్థంచేసుకోకపోతే పోయిరి - శాంత అతన్ని కనీసం అపార్థమన్నా చేసుకోలేదు!

అతను చేసిన తప్పేమిటి? అతనికి తెలిసినంతవరకూ శాంత అద్దెకున్న ఇల్లు అతనిదికావటంతప్ప మరేమీలేదు! ఆరాత్రి అతను ఇంటికి వచ్చే టప్పటికల్లా పక్కభాగం ఎవరికో అద్దెకిచ్చేశానని తల్లి చెప్పింది. మర్నాడు పొద్దున వంటగదితలుపు తెరచి ఆ ప్రాతఃకాల సమయాన ప్రశాంతంగా శాంత కొత్తగా ప్రవేశించిన ఇంటి దొడ్డిభాగాన్ని గమనిస్తూ వుండటం అతను చూచాడు.

శాంత భర్త మునసబు కోర్టులో గుమాస్తా అని తెలిసినప్పుడే అతని హృదయం బేజారయిపోయింది. ఏ భాగ్యవంతుడినో, నవనాగరికుడినో, వివాహంచేసుకుని రాణీగా కాకపోయినా రాణీగా జీవించతగిన శాంతను చూడగానే కాంతం హృదయం కాస్తా కలతచెందింది—నారచీరలు ధరించి అడవిలో కష్టాలుపడుతున్న సీతను చూచినప్పుడు రావణబ్రహ్మ హృదయంకూడా అలా చివుక్కుమని వుండదు!

కాని శాంత అతని సానుభూతిని ఏమాత్రమూ ఆపేక్షించాలన్న స్థితిలోవున్నట్టు తోచలేదు కాంతానికి. పైగా శాంత భర్తకూడా

ప్లీడరు గుమాస్తా వుండాలిసినంత మొరటుగా వుండకపోవటం శోచనీయం! పూర్వజన్మ పాపంవల్ల అతను గుమాస్తా అయిపోయినట్టున్నాడుగాని అదృష్టం బాగున్నట్లయితే అతనూ ముంగురులు మొహానికి పడుతూ, పైజామాలూ, లాల్చీలూ ధరించి, పాహీ డక్కాను సిగిరెట్లు పీల్చుతూ మానవాభ్యుదయానికి పాటుపడే నవనాగరికపు Intellectual గా వుండటానికి వీలుగా వుండటం ఆటే బాగాలేదు! ప్లీడరుగుమాస్తా అయినవాడు ప్లీడరు గుమాస్తాకు తగినట్టుగా వుండాలి—రాజువేషం వేసేవాడు ఆ వేషానికి తగినవాడుగా వుండాలన్నట్టు. శాంత భర్త గోల్డుఫ్లేకు సిగిరెట్లు పీల్చి, ఫిలిం పత్రికలు చదివీ, ఇంగ్లీషు అర్థం చేసుకునీ, రష్యాపట్ల సానుభూతి ప్రకటించినంత మాత్రాన ప్లీడరు గుమాస్తా కాకుండా ఎలాపోతాడు? అయినా ఇన్నింటిలో మనస్సు పెట్టుకుని అతను న్యాయంగా గుమాస్తాగిరిమటుకేం చెయ్యగలడు? చెయ్యలేనివాడు గుమాస్తాగిరి కెందుకు ఒప్పుకోవాలి? చూడమాడ కాంతానికి శాంతభర్త అందర్ని వెక్కిరించటానికి ప్లీడరు గుమాస్తాగా అయిపోయినట్టుగా తోచింది!

కాంతం కాలేజీలో చదివేటప్పుడూ, పరీక్ష తప్పి ఇంటి దగ్గరవుండి పరీక్షకు చదివినప్పుడూ, రోడ్లమీదా, సినిమాల దగ్గిరా అనేకమంది స్త్రీలు అతన్ని చూసి సిగ్గుపడటమో, భయపడటమో, గౌరవంగా చూడటమో, నిర్లక్ష్యంగా చూడటమో ఎగతాళిగా నవ్వటమో జరుగుతూ వచ్చింది. కాని ఎవ్వరూ శాంతమాదిరిగా అతనా ప్రదేశంలో లేనేలేనట్టుగా ప్రవర్తించలేదు! అది మరీ దుర్భరంగా వుంది కాంతానికి.

భర్త కోర్టుకు వెళ్ళినప్పుడు ఎప్పుడన్నా శాంత పిచ్చాపాటి మాట్లాడుకోటానికి అతని తల్లిదగ్గరకి వచ్చేది. ఏదో పనివున్నట్టుగా కాంత అక్కడికి వెళ్ళగానే ఆమె వెళ్ళిపోయేది. తన సమక్షమందు శాంత అక్కడేవుండి బాతాఖానీ చెయ్యాలని అతని కోరిక. కాని ఆమె ఆ వెళ్ళిపోవటమన్నా అతను వచ్చినందువల్ల వెళ్లుతున్నట్టుగా వెళ్ళేదికాదు-నిజంగా పనివున్నట్టే వెళ్ళేది! శాంత రూపమేమో అతని కవితా హృద

యానికి స్వర్గసీమగా వుంది—కాని ఆమె ప్రవర్తనేమో చన్నీళ్లు చల్లుతుండేది!

తెల్లవారగట్ల లేచి కాంతం హార్మనియంమీద "పోయేనయ్యో ఇపుడు సనుబాసి" అని మ్యూజిక్ విసరుతూ వుండేవాడు. శాంతభర్త ఆఫీసుకు పోగానే గ్రామఫోను పెట్టేవాడు. ఒకరోజున శాంత కొడుకు మూడేళ్ళ వాడు గ్రామఫోను విని వాకిలి దగ్గరకువచ్చి వుత్సాహాన్ని ప్రకటించాడు-గ్రామఫోను మోతకు. కాంతానికి పిల్లలంటే అట్టే ప్రేమలేదు—ఓ విధంగా అసహ్యంకూడాను. కారణం గ్రామఫోను పెట్టినప్పుడల్లా ఎవరో పిల్లలు అర్థంకాకపోయినా అతనిచుట్టూ చేరేవారు. కాని ఎంత శాంత భర్తకొడుకైనా శాంతకొడుకు సంగతివేరు! ఆ పిల్లవాడిని చూడగానే కాంతం "మాట!" అని పిలిచాడు. వాడు అనుమానిస్తూ లోపలికి వచ్చాడు. రెండు నిమిషాలు వున్నాడో లేదో శాంత వాడిని పిలిచి అవతలికి తీసికెళ్ళి ఏంచేసిందోగాని కాంతానికి ఆ కుర్రవాడు బావురుమని ఏడవటంమాత్రం వినిపించింది! నేనేం మహాపరాధముచేశాను అని ప్రశ్నించింది అతని కవిహృదయం.

శాంత భర్తకైనా సంగీతంలోగాని గ్రామఫోనులోగాని ఏవిధమైన అభిరుచీ వున్నట్టుతోచదు. అతనెప్పుడూ తన గ్రామఫోను వినాలని గాని, ఒక్కసారి మావాళ్ళు వింటారు ఇయ్యమనిగాని కాంతాన్ని అడగనేలేదు. కాంతంతో అతనే లోకాభిరామాయణమూ మాట్లాడే వాడుకాడు. అతనింట్లో కాంతం అద్దెకున్నట్టుండి గాని కాంతం ఇంట్లో ఆ గుమాస్తా అద్దెకున్నట్టులేదు!

శాంత కాపరానికివచ్చి ఎక్కువకాలం కాకపోయినా వారిద్దరి మధ్యా కథలలోలాగా ఏవిధమైన అపర్క ప్రేమా వున్నట్టులేదు. ఓ ప్రణయకోపంలేదు. ఓ ఎగతాళీలేదు. ఓ పోట్లాటలేదు. ఓ బతిమాలటం లేదు-ఏమీలేదు రామ రామ! ఇలాంటి సంసారాన్ని చూస్తే ఏ వ్యక్తి హృదయం పొంగి పొరలటానికి బదులుగా చప్పగా చల్లారిపోదు? పురుషుడికి నిజమైన నాగరికతా, కవితాహృదయమూ వుంటే శాంత

వంటి భార్యను వెన్నెట్లో పూవుల్లో పెట్టి పూజించదూ? సముద్రాలు దాటి మహాగ్ని ప్రవేశించదూ?

ఒకరోజు రాత్రి కాంతం కొంచం ఆలస్యంగావచ్చి స్నానం చెయ్యటానికి భావిదగ్గిరికి వెళ్ళాడు. బొక్కెన కనపడలేదు.

'అమ్మా!'

'దేనికిరా?' అంది తల్లి.

'మనబొక్కె నేదీ?'

'అక్కడ లేదూ?'

'లేదే!'

'ఆదేమిట్రూ-ఇందాక ఆ పనిచేసేటి తోడింది-భావిలో పడిందేమో!'

ఎవరి బొక్కెనైనా భావిలోపడిపోతే సకాలానికి అది పైకితీసి సంఘసేవచేసిన పుణ్యమూర్తులలో కాంతం ఒకడు. అందాకా ఎందుకు శాంతగారి బొక్కెనే ఒకసారి భావిలో పడిపోతే తీశాడు. తల్లికి వుండాలిసినంత ప్రేమా, కాంతంమీద తల్లికివున్నప్పటికీ భావిలోనించి బొక్కెన్లు తీసేటప్పుడు ఆవిడేగా మాట్లాడేదికాదు—ఆవిడకు తెలుసు బొక్కెన్లు తీయటంలో కాంతం కళానిధి అనీ, ఆ విషయంలో ఆమె ఏవిధమైన ఆశ్చర్య భయ సంభ్రమాలూ ప్రకటించ నవసరం లేదనీ.

ఆమె ఏమీ మాట్లాడక పూర్వమే కాంతం భావిలోకి దిగి నీటి అడుక్కు పోయినాడు. వెంటనేవచ్చి తల్లి వేసిన తాడుకు బొక్కెన్ని కట్టేశాడు. అది పైకితీసి ఆమె 'ఈ బొక్కెన మనదికాదురా నాయనా-వారిదీ!' అంది. కాళ్లు పోటీపెట్టి పైకివస్తున్న కాంతం మళ్ళీ భావిలోకి దిగి ఇంకో బొక్కెన తీశాడు.

స్నానంచేసి అతను ఇంట్లోకి పోతుండగా శాంతభాగంలోనించి నవ్వుమాటలు వినిపించినై.

'ఎందుకు అలా నవ్వుతావు?' అన్నాడు శాంత భర్త.

'అదికాదు—నేను నీళ్లు తోడుతుంటే మన బొక్కెన కాస్త భావిలో పడిపోయింది!' అని నవ్వింది శాంత.

'పడిపోతే! నవ్వఅన్నా చెప్పు లేక చెప్పిఅన్నా నవ్వు!' అన్నాడుభర్త.

'పక్కన వాళ్ళుబొక్కనవుంటే అదికూడా భావిలో పారేశా!' అని విరగబడి నవ్వింది శాంత.

'పారేస్తే—! ఓసి నీ దుంపతెగా—చెప్పవూ—ఏదీ!—అదిగో-!'

శాంతను భర్త ముద్దుపెట్టుకున్న చప్పుడు కాంతానికి స్పష్టంగా కళ్ళకి వాసనేసిందంటే నమ్మండి!

ఒకరోజున కాంతం అకస్మాత్తుగా చూచాడు ఓ పత్రికలో ఒక ఎడ్వర్టయిజుమెంటు. అదేదో వశీకరణమంత్రం. దాన్ని జపిస్తే ఎంతటి కఠినాత్మురాలైనాసరే లొంగి ఆమంత్రాన్ని జపించినవారిని ప్రేమిస్తుంది. కాంతం మొదట దీన్ని నమ్మలేదు. కాని ఆ మంత్రంవల్ల ప్రతిఫలం కలగకపోతే 116 రూపాయలు బహుమానంగా ఇస్తామని గ్యారంటీ కూడా వుంది. అదీకాక వుత్తర ప్రత్యుత్తరములు రహస్యంగా వుంచబడతయ్యి అని పూచీకూడా వుంది.

ఆలోచించగా కాంతానికి ఇంతకన్న మంచి వుపాయం తోచలేదు. శాంత విషయంలో అతను కొంచం ధైర్యంచేసి సాహసమార్గాన్ని తొక్కేవాడేగాని శాంత ఏ పరాయి ఇంటోనో వుండకుండా తన ఇంట్లోనే వుండటం మూలాన కొంచం గౌరవ మర్యాదలను ప్రకటించాలిసిన పూచీ అతనిమీదే వుందేమోనని కాంతానికి అనుమానం కలిగింది!

కాని ఈ వశీకరణ తంత్రం అన్నిచిక్కుల్నీ విడతీస్తుంది. కాంతం ఎవ్వరికీ తెలియకుండా దాన్ని తెప్పించుకుని చూచాడు. అదో తాయత్తు. దాన్ని ధరించిన పది పదిహేను రోజులలోగా ఫలితం కనపడుతుందని వుత్తరంలో చెప్పబడివుంది.

ఒక శుభ ముహూర్తాన కాంతం ఆ తాయత్తు ఎవ్వరూ చూడకుండా ధరించాడు. కాని అతను అది ధరించిన రెండురోజులకే శాంతపుట్టింటికి వెళ్ళిపోయింది!

అయినా దాని మహిమ వూరికేపోదు. శాంత ఎక్కడుంటే ఏమని అతనికి అనుమానం కలిగి దాన్ని అలాగే వుంచాడు. పదిహేను రోజులు

దాటినై. కాంతంలో ఏమీ మార్పు కనిపించలేదు. ఎక్కడోవున్న శాంతలోనూ ఏమార్పు కలిగినట్టు తోచదు !

మరోవారం గడిచేటప్పటికి కొంత తమాషా జరిగింది. అతన్ని అదివరకెవ్వరూ గమనించకుండా తిరగేవారు అతన్ని కొంచెం తీవ్రంగా గమనిస్తున్నట్టు తోచింది కాంతానికి. కాంతం రోడ్డుమీద పోతుంటే తలుపులుతీసి ఎవరో ఆమె ఇతన్ని చూచి మళ్ళీ తలుపులు వేసుకోవటం అనేకచోట్ల అనేక సార్లు జరిగింది. కొంచందూరం పోయింతరువాత ఆమె బయటికివచ్చి ఇతని వంకనే చూస్తున్నట్టు చూచేది.

కాంతం మొహం కాంతానికి అద్దంలో మామూలుగానేవుంది. ఇంట్లో పనిచేసేదీ, పెరుగుమనిషీ, కూరలమనిషీ అందరిలోనూ ఏదో మార్పు వచ్చినట్టువుంది. అదివరకు కూరలమనిషి కొంటే కొను, లేకపోతే లేదు అనేధోరణిలోవుండేది. ఇప్పుడో వీశె పావలాచెప్పు, వద్దన్నకొద్దీ రెండు అణాలకైనా ఇస్తున్నది.

మొదట్లో కాంతానికి ఈ అనుభవం కొంత తమాషాగానే వుంది కాని కాలం గడచినకొద్దీ వ్యవహారం ముదిరి ఎవడో పకీరు పాడితే వూళ్ళోవున్న ఆవులన్నీ వెంటబడ్డ పాకానికి వచ్చింది. కాంతం వీధిలోకి రాగానే ఆ వీధిలోవున్న స్త్రీలంతా బయటికి వచ్చేవారు.

వ్యవహారం అంతటితో ఆగినా అదో ముచ్చటగా వుండేది. ఈ స్త్రీల తాలూకు మగవారికి కాంతాన్నిచూస్తే మొదట గుర్రుగా వుంటూవచ్చి రానురాను ఏ ఆర్. పి. అలారం సిగ్నలు పరిస్థితి దాకా వచ్చి అంతటితో సమసిపోకుండా దేహశుద్ధికూడా స్వల్పంలో తప్పిపోయింది. ఒకసారి ఇద్దరు సాయిబులు దారినపోతూ అందులో ఒకడు కాంతాన్ని రెండో వాడిమీద నెట్టాడు. రెండోవాడు కాంతాన్ని మళ్ళీ మొదటివాడిమీద నెట్టాడు. మొదటివాడు నామీద పడతావా అని చెప్పుతీసేలోపల కాంతం వుడాయించాడు.

కాంతానికి రాత్రిళ్ళు నిద్రపట్టటం మానేసి చాలా రోజులైంది. ఈ బాధ పడలేక కాంతం కొన్నాళ్ళపాటు ఇంకోచోటికి వెళ్ళాలను

కున్నాడు. కాని అక్కడా ఇంతే జరిగింది. మరో రెండు చోట్లకూడా ఇదే జరిగింది.ఆడపురుగు లేనిచోట తప్ప కాంతానికి విశ్రాంతి లభించేటట్టు లేదు. చేసేది లేక కాంతం అడవులకు పారిపోయినాడు!

ఎన్నాళ్ళు కాంతం అడవుల్లో గడిపాడో అతనికే తెలియదు. ఎవరో బైరాగి కనపడితే తనకు మోక్షమార్గం చూపించమని అడిగాడు. ఆ బైరాగి 'నీ కర్మ ఇంకా పరిపక్వం కాలేదు' అని చెప్పాడు. అనేకచోట్ల తిరిగాడు. ఎక్కడ తిరిగినా చిన్న చిన్న పల్లెల్ని, జనసంచారంవున్న ప్రదేశాల్ని వదిలేవాడు—అతనికి తెలుసు ఎవరైనా స్త్రీలు అతన్ని చూస్తే ఏంజరుగుతుందో!

కాని అతనికి తెలియకుండా అకస్మాత్తుగా ఒకరోజున ఒక పల్లె సమీపానికి వచ్చాడు. కొందరు ఎరికల స్త్రీలు, గంపలూ, చేటలూ పట్టుకుని ఇతనికి ఎదురైనారు. వాళ్లను చూడగానే కాంతానికి ఎక్కడలేని భయమూ వేసింది. కాని వాళ్ళు ఇతన్ని ఏదో ప్రశ్న వేసి ఇత నేమో సమాధానం చెప్పక పోగానే వెళ్ళిపోయినారు. ఈ మధ్యకాలంలో కాంతానికి ఇంటువంటి చిన్నదూ జరగలేదు! కొంచం ధైర్యంవచ్చి పల్లె లోకి వెళ్ళాడు. అనేకమంది స్త్రీలు ఇతన్ని చూచి మామూలుగానే ప్రవర్తించారు. కాంతానికి ఇంకా ఆశ్చర్యం వేసింది. ఇంకా పెద్దవూరు వెళ్లాడు. తనెరిగినవూరు వచ్చాడు. అంతా యధాప్రకారంగానే వుంది. గాఢిభావి దగ్గిర స్నానం చేస్తున్న స్త్రీలు ఇదివరకులాగా ఇతన్ని చూడగానే కడవలు కిందపారేసి ఇతని దగ్గిరికి పరిగెత్తలేదు!

కాంతానికి కొంచం మనశ్శాంతి వచ్చింది. అతనిగుండె దడ తగ్గింది. కాని ఇంకా అతనికి పూర్తిగా ధైర్యం రాలేదు-తనవూరు వెళ్లటానికి.

అతను ఒకరోజున ఒకవూళ్లో వీధిలో వెళ్ళుతుండగా అతన్ని ఎవరో పిలిచారు. వెనక్కుతిరిగి చూచాడు. ఓ గూభైఏళ్ల ఆమె అతన్ని పిలుస్తున్నది. చచ్చాంరా భగవంతుడా అనుకుంటుండగా ఆమె సమీపానికి వచ్చి 'లోపలికిరండి!' అంది. ఆ విడను ఎక్కడో చూచినట్టువుంది కాంతానికి. లోపలికి వెళ్ళాడు.

'మావూరు వచ్చికూడా మా ఇంటికి రాకుండా వెళుతున్నారేం?' అంది ఆవిడ.

ఆవిడ ఎవరో తెలియదు కాంతానికి. కాంతం ఏమీ సమాధానం చెప్పక పూర్వమే 'ఏమండీ జ్ఞాపకం వున్నామా!' అంటూ వచ్చింది ఒకామె—శాంత! చేతుల్లో చిన్నపిల్లవాడున్నాడు, బస్తీలలో వుద్యోగస్తులభార్యలమల్లే కాకుండా శాంత నీళ్ళాండింతరువాత నడుముచుట్టూ బట్ట బిగించి కట్టుకుంటున్నది. ఆ కట్టు ఎంతో అందంగా కనపడింది కాంతానికి. కాంతం మరి ఒక్కసారిగా గిర్రున తిరిగింది. శాంత మొహం ఎంత శోభావంతంగా వుంది-అదివర కెన్నడూ అలా వుండ లేదు అతని సమక్షంలో! కాని శాంతలో ఏదో మార్పు వచ్చినట్టు కాంతానికే స్పష్టంగా తెలుస్తున్నది. అదివరకు శాంత ఎన్నడూ అతనితో మాట్లాడలేదు. కాని ఇప్పుడామె ఆ వికసించిన మొహంతో అలా మాట్లాడటం అతని కేవిధంగానూ వింతగాలేదు. పూర్వం శాంత అలా మాట్లాడితే కాంతం ఏమయ్యేవాడో కాంతానికే చూచాయిగా తెలుసు. కాని ఇప్పుడు కావాలన్నా ఆ స్థితిలోకి రాగలిగేటట్టు లేదు కాంతం!

'మాయింటో భోంచేద్దురుగాని-స్నానం చెయ్యండి!' అంది శాంత తల్లి.

స్నానం చేస్తుండగా యదార్థం తెలిసిపోయింది కాంతానికి-ఇన్నాళ్ళమట్టీ ఇంత అవస్థలోనూ ఆ సంగతే ఎందుకు జ్ఞాపకం రాలేదో? కాంతం నడుంచుట్టూ మొలతాడూ లేదు-ఆ తాడుతోవున్న తాయత్తూ లేదు-ఎప్పుడు పడిపోయిందో, ఎక్కడ పడిపోయిందో.!

# మాటా — మంచీ

౧

'దయచెయ్యండి—దయచెయ్యండి! ఒరేయి నాయనా, నువ్వు లోపలికి వెళ్లి చదువుకో అమ్మా!' అన్నాడు రాఘవయ్య.

'అలా దయచెయ్యండి!'

'ఎబ్బెబ్బే—నువ్వు అక్కడే కూచోమ్మా! నే నిలా కూచుంటాను లెండి!' అని చాపమీద కూచున్నాడు తీర్థులు.

'అదేమిటి మీరు కింద కూచోటం—'

'ఫరవాలేదండీ—మనలో మన కేమిటి లెద్దురూ. ఈ మాత్రానికే ఆపిల్లవాడిని లేవదియ్యాలా!' అన్నాడు తీర్థులు.

'ఏమిటి విశేషాలు-చెప్పండి!' అన్నాడు రాఘవయ్య.

'ఏమున్నయ్యి అండీ-మీరే చెప్పాలి!' అన్నాడు తీర్థులు.

తీర్థులు బోర్డుస్కూలులో మేష్టరు. రెండు మూడేళ్లనుంచి జిల్లాలోని వూళ్లన్నీ తిరుగుతున్నాడు. ఒక వూళ్లో నీళ్లు పడకను, మరొకవూళ్లో బ్రాహ్మణ గడప బొత్తిగా లేకపోవటంచేతను, ఒకసారి బోర్డువాళ్లు వాళ్లంతట వాళ్లే ట్రాన్సుఫరు చెయ్యటం చేతనూ మొత్తంమీద నాలుగు సార్లు వున్నచోటినించి అతను బదిలీ కావలసివచ్చింది. ఈ వూరు వచ్చి అతను నాలుగైదురోజు లయింది. ఇద్దరు ముగ్గురు తోడి మేష్టర్ల ఇళ్లకు వెళ్లి ఇదివరకే పరిచయం చేసుకున్నాడు. ఇప్పుడు రాఘవయ్యగారింటికి వచ్చాడు.

రాఘవయ్య అంటే ఆ వీధి చివర వున్న డాబా ఇల్లు స్వగృహంగా కలవాడు. వూళ్లోవున్న ఇద్దరు భాగ్యవంతులలో ఒకడని ప్రతీతి. నిక్షేపంలాంటి పిత్రార్జితం మాగాణి పాతికెకరాలు గాక నగదు సొమ్ము కూడా వుందని వాడుక. గోచీ, కొల్లాయి గుడ్డగాని స్వంత వ్యవసాయం. బెస్టు ఘీ, మాంచి గేదెపెరుగు, లేత సొరకాయలు, వాడని గోంగూర అనుభవించగలిగినవాడు.

'మీ రెంత అదృష్టవంతులండీ! ఇలాంటి వూళ్లో నిర్విచారంగా జీవితం గడపగలగటం ఎంతో పూర్వపుణ్యం చేసుకుంటేనే గాని లభించదని నా అభిప్రాయం!' అన్నాడు తీర్థులు.

'ఏం నిర్విచారమో—చక్కగా నెల తిరిగే టప్పటికి మీకు జీతాలు వస్తయి. పిల్లలకు విద్యచెప్పటం ఎంత గొప్ప విషయమండీ? అది అందరికీ లభిస్తుందా?' అన్నాడు రాఘవయ్య.

'అవుననుకోండి! అయినా చాలీచాలని మా జీత మేముందండీ! అదీ గాక వాళ్లు పొమ్మంటే పోవాలి—కూచోమంటే కూచోవాలి. మన కష్టసుఖాలు వాళ్లకేం తెలుస్తాయండీ?'

'ఎంత కష్టపడినా విద్యాదానం చేసేవారు మీరు! అంత కష్టపడుతూ కూడా అపనే మీరు చేస్తున్నారంటే దానియందు మీ కెంతో అభిమానముండి తీరాలి. సరస్వతీపూజ చేయటాని కెంత కష్టపడితే నేమండీ—దానివల్ల ఇహమూ వుంది, పరమూ వుంది!' అన్నాడు రాఘవయ్య.

'అనుకుంటాంకాని దాన్లో అంత కష్టంకూడా లేదండీ! ఈకాలపు కుర్రాళ్లు అసాధ్యులుసుమండీ—చెబితే అల్లుకుపోతారు. ఒక్కొక్కప్పుడు వాళ్లు వేసే ప్రశ్నలకు మాకే సమాధానం తెలియదు! నే నొక విధంగా అదృష్టవంతుడిననే మీతో మనవిచెయ్యాలి. నాకు చిన్నప్పటినించీ చదువంటే ఎంతో అపేక్ష! దానికి తగ్గట్టుగా భగవంతుడు నాకు చివరకు ఆ చదువు చెప్పే యోగ్యతే కలిగించాడు. ఇక జీతమంటారా? వా ళ్లేదో ఇస్తారు కాని ఈరోజులలో ఏం సరిపోతుందండీ? భగవంతుడి కృపవల్ల తిండి లోపంలేకుండా మావాళ్లు ఇచ్చిన భూము లున్నాయనుకోండి. అయినా మనం డబ్బుకోసం చేస్తున్న పనా ఇది? గమనించారో లేదోగాని చదువు చెప్పుతుంటే ఒక్కొక్కప్పుడు ఎలాంటి ఆనందం కలుగుతుం దంటారు? అడిగిన ప్రశ్నకు సరియైన సమాధానం కుర్రాడు చెప్పినప్పుడు, లేక మనం చెప్పించ గలిగినప్పుడు మనస్సు ఎలా వుప్పొంగుతుం దనుకున్నారు? ఆ కుర్రవాణ్ణి సక్రమమైన మార్గంలో పెట్టాలిసిన విధి మనయం దున్నదని గుర్తించటమేకాక సరియైన మార్గానికి తీసుకు

రాగలుగుతున్నాం, తీసుకురాగలిగాం అనేవిషయం మనం తెలుసుకోగల గటం!—చూచారూ కుమ్మరివాడు తన స్వంతచేతుల్లో మట్టిని ఎలా పాత్రల రూపకంగా చేస్తాడో! ఈపిల్లలే పెద్దలయి ఎంతెంత గొప్పవాళ్ళ యినా కావచ్చు. ఈవిషయాలు మీకు నేను చెప్పాలిసినవాడిని కానను కోండి—మీకు తెలియని దేముంది?' అన్నాడు తీర్థులు చిరునవ్వు నవ్వి.

'దాని కేమిటిలెండి! నాలుగు వూళ్ళు తిరిగి నలుగుర్ని చూచేవారు మీరు—మీ కున్న అనుభవం మా కెలా వుంటుందండి?' అన్నాడు రాఘవయ్య.

'మీరు కాబట్టి ఆమాట అన్నారు. నిజానికి ఈవూళ్ళో కూచుంటే ఏముంది చెప్పండి? ఎప్పుడు చూచినా వీళ్ళే—ఈమనుష్యులే! భావిలోని కప్ప ప్రపంచం అంతా భావే ననుకుంటుంది. అందుకనే నేను కొన్నాళ్ళయిం తరువాత బదిలీ చేయించుకుంటూవుంటాను. మనలోమాట: అన కూడదుకాని, ఆ ప్రకాశరావుగారు మాటవచ్చి మేష్టర్లను తిట్టటం మొదలు పెట్టాడు. పిల్లల్ని చావకొడతా రని ఆయనకు కోపంట! ద్వేష భావంతో, వాళ్ళని హింసించాలని కొడతామటండీ ఎక్కడన్నా! వాళ్ళు బాగుపడాలనీ—'

'ఏం కోటయ్యా!' అన్నాడు రాఘవయ్య బయటికి వెళ్ళి.

'శాసయ్యగారు దానిమాట కనుక్కునిరమ్మన్నారు!'

'ఆనక్కు మాట్లాడతాలే!' అని రాఘవయ్య లోపలికి వచ్చాడు.

'మిమ్మల్ని నే నేం శ్రమపెట్టటం లేదుకదా?' అన్నాడు తీర్థులు.

'ఏమీ లేదండి'—అన్నాడు రాఘవయ్య.

'మీపనులు మీకుంటయి—మాకు వాటి సంగతికూడా తెలియదు చెప్పినా! తల్లి పిల్లవాడిని కోప్పడితే వాడిమీద ప్రేమలేకనా? పిల్లల్ని గిల్లటం, తొడపాశం పెట్టటం, మొట్టికాయలు మొట్టటం మొదలైనవి మేష్టర్లు కేవలం చేతితీట తీర్చుకోటానికి చేస్తారని ప్రకాశంగారి వుద్దేశ్యం. వారితో నాకు పరిచయం లేదు కాబట్టి గాని లేకపోతే వారి అభిప్రాయం తప్పని అప్పుడే చెప్పేవాడిని. అయినా మన కెందుకు!'

'అంతే లెండి!' అన్నాడు రాఘవయ్య.

'వీళ్ల కేమి తెలుస్తుందండీ! వీళ్లకు ఆ మానసిక విజ్ఞానం ఎలా లభిస్తుంది? వీళ్ల కాలావకాశం ఏదీ'

'ఏం శేషయ్యన్నగార్!' అన్నాడు రాఘవయ్య.

'భలేవాడివే నే నువ్వు—'

'రాఘవయ్యగారూ, నేను శెలవు పుచ్చుకుంటాను!'

'మంచిదండి!'

'వెళ్లుతున్నారేం?' అన్నాడు శేషయ్య తీర్థులువేపు తిరిగి.

'వెళ్తాను. ఇవాళ మంచి సుదినం రాఘవయ్యగారూ.—మీతో ఎన్నో విషయాలు నాకు నచ్చినట్టు ముచ్చటించగలిగాను. చాలా బాగుంది-వస్తాను!' అని తీర్థులు బైటికి వచ్చేశాడు.

౨

'మీ నాన్నగా రున్నారమ్మా?' అన్నాడు తీర్థులు.

'వున్నారండీ-వస్తారు కూచోండి!' అన్నాడు సుబ్రాడు.

'ఏం చేస్తున్నారేం?'

'దొడ్లో ఏదో సరిచేస్తున్నట్టున్నారు!'

'ఏమండోయి-ఏమిటి విశేషాలు?' అంటూ, వచ్చాడు ప్రకాశరావు.

'ఏమున్నయ్యండీ-ఏదో పనిమీద వున్నట్టున్నారు?'

'ఏంలేదండీ-మా సుబ్రాడు ఏమన్నా చదువుతున్నాడా సరిగ్గా?' అన్నాడు ప్రకాశరావు.

ప్రకాశరావు ఆవూళ్లో రెండుమూడు బస్తీలు చూచిన మొదటివాడు-ఎరిగినంతవరకూ. ఏపనిమీదనైతేనేం పట్టణం వెళ్లివచ్చినవాడు. ఇంగ్లీషు పత్రిక తెప్పించుకుంటూ వుంటాడు.

'మీవాడికేమండీ-చాకు! ఎంతఅయినా -చిన్నతనంగదండీ. చదువులో శ్రద్ధా, అభిరుచీ కలిగే ఈడు ఇంకా రాందే—వాళ్లని అవస్థపెట్టి ప్రయోజనం ఏముంటుందండీ?...మీ ఇంట్లో చదరంగంబరిణికూడా వుండే!'

అన్నాడు తీర్థులు ఆశ్చర్యంతో.

'ఎప్పుడో కొన్నాను—!' అన్నాడు ప్రకాశరావు.

'చదరంగం అంటే నాకు చాలా అభిరుచి సుమండీ. ఈవూళ్లో అది దొరకటం నాకు మహా అదృష్టంగా భావించుకుంటాను. మీా రెవరితో ఎక్కువగా ఆడుతుంటారేమిటండీ?'

'నే నెవ్వరితోనూ ఎక్కువగా ఆడనండీ—ఏదో పత్రికలో పడ్డ వాటిని ఎప్పుడన్నా పెట్టుకుని చూచుకుంటాను—అంతే!'

'శేషయ్యన్నయ్యగారు మీారు చాలా బాగా ఆడతారని చెప్పారు—ఇప్పుడు కాదనుకోండీ—మీాకు తీరిగ్గా వున్నప్పుడు, మీా కభ్యంతరం లేకపోతే మనం ఆడుకోవాలి ఒకసారి! నాకుమటుకు బాగా చాతకాదు సుమండీ—మీాతో ఆడాననిపించుకోవా లన్న తృప్తే. అంతకన్న మరేమీా లేదు!'

'ఆడదాం అంటారేమిటి?'

'అబ్బే! ఇప్పుడు కాదు. మీాకు బాగా తీరిక వున్నప్పుడే. నే నటు దుకాణందాకా వెళ్లాలి. మనం ఎప్పుడైనా ఆడుకోవచ్చు!'

'దాని కేమిటి లెండి.'

'అలంకీనా, అలంఖీనా—వాడెవడో వున్నాట్ట, ప్రపంచంలోకెల్లా గొప్పవాడుట కాదూ?'

'అని అంటారు!'

'నా అభిప్రాయంకూడా అదే! ఈ విషయంలో నేను మీాతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. నే నెంత మందినో అడిగాను. తెలిసినా తెలియక పోయినా ప్రతివాడూ అలంఖీనుఅంత గొప్పవాడు లేడనే! మన దేశంలో పల్లెటూళ్లలో వున్నారు అతన్ని మూడునిమిషాలలో గుక్క తిప్పకో కుండా చేసేవాళ్లు.'

'కేవలం అలా చెప్పటానికి వీల్లేదు లెండి!' అన్నాడు ప్రకాశరావు తాపీగా. 'ఎందుకంటే వాళ్లల్లో మొదటివాడు కావాలంటే ఎంత కష్టం? అతనికి ఎంతమంది పోటీదార్లు వుంటారు? అనేకదేశాల్లో అనేకమంది

గొప్పవాళ్లని అనేకసార్లు వోడించగలిగినవాడు నిస్సందేహంగా గొప్ప వాడని వొప్పుకోక తప్పదు. ప్రపంచంలోకెల్లా గొప్పవాడంటే ప్రపంచంలో తెలిసినవారందరిలోకీ గొప్పవా డన్నమాట! ఎవరో మావూళ్లో వున్నాడు-వాడు అతన్ని గుక్క తిప్పుకోకుండా చెయ్యగలడు అంటే అర్థం ఏముంది? మావూళ్లోవాడు ఎంతమంది తెలిసిన గొప్పవాళ్లను వోడించివుంటా డంటారు? అతన్ని ఏది ఆధారంచేసుకుని ఆలంకీనును గుక్కతిప్పుకోకుండా చెయ్యగలడంటారు?'

'నిజం! ఇలా ఆలోచించి చెప్పగలిగిన శక్తి మనవాళ్ల కెంతమంది కుంటుందండీ! మీరు అనేకవూళ్లు చూచినవారు, పత్రికలు తిరగవేసే వారు కనక మీకు సాధ్యం అయిందికాని. మిమ్మల్ని ఈవూళ్లో పెట్టుకుని కూడా వీళ్లు మీవల్ల లాభం పొందలేకుండా వున్నారు—'

'ఏం కోటయ్యమామా—' అన్నాడు ప్రకాశరావు.

'రాఘవయ్యగారు పత్రిక ఇప్పించుకురమ్మన్నారు బాబూ!' అన్నాడు కోటయ్య.

'ఆ, తీసుకెళ్లు! ఇదిగో-పూరించటమేగాని నెయ్యి ఇప్పిస్తా నన్నావు-ఇంతవరకూ పత్తాలేదు!'

'పంపుతా బాబూ-తీరికలేదు. శలవు!'

'అరెరె! రాఘవయ్యగారు పత్రిక తిరగేస్తారు-నాకు తెలీదుసుమండీ!' అన్నాడు కోటయ్య వెళ్లింతరువాత తీర్థులు.

'ఏవో—?'

'నిజంగా ఆయనొకడండి నాకు అనేకవిధాల నచ్చినవాడు. ఆయనతో ఎంతసేపన్నా మాట్లాడవచ్చునండీ. ఈవూళ్లో వున్నాడన్నమాటే గాని, ఆయన కున్న విజ్ఞానం ఎంతమంది కుంటుందండీ—ఇంగ్లీషు వచ్చునని కూడా చెప్పలేదు సుమండీ! ఎలాగైనా నివురుగప్పిన నిప్పు!'

'మీ సుబ్బారావు మేష్టరు మహాకొడతాడండీ పిల్లల్ని!' అన్నాడు ప్రకాశరావు.

'తమాషా—నే నదే చెప్పవస్తున్నా! మొత్తంమీద మీమననూ,

సామనన్నూ ఒకవిధంగా పరుగెత్తుతున్నాయి. ఆ సుబ్బారావు అదేమి టండీ అలాబాత్తాడు పిల్లల్ని? రెండుమూడుసార్లు చెబుదామని అనుకున్నానుకాని, అయినా మన కెందుకు చెప్పండి!'

'ఆ. కొడితే కోపంతో కొడతారుట గాని—వాళ్లని బాగుచెయ్యాలనే కొడతారు ఎవరైనా—'

'అదీ నిజమే—మీరన్నట్టు అదీ నిజమే—'

'నాన్నా, రాఘవయ్యగారు నిన్ను రమ్మంటున్నారు ఓసారి!' అన్నారు కుర్రాడు.

'నేను వెళతానండీ—మీతో మాట్లాడటమే ఓ ఎడ్యుకేషన్!'

## 3

'రండి! రండి!' అన్నాడు శేషయ్య తీర్థులు లోపలికి రాగానే.

'అటు పోతూన్నాను—మిమ్మల్ని చూచి లోపలికి వచ్చాను!' అన్నాడు తీర్థులు నవ్వుతూ.

'ఏమిటి సంగతులు?' అన్నాడు శేషయ్య.

'కుర్రాళ్లకు ఏదో పనస చెప్పుతున్నట్టున్నారు!'

'ఏదో! మాగోల మాది!'

'అమ్మో! మీ రలా ఎన్నడూ అనగూడదు. పరబ్రహ్మస్వరూపం అయిన వేదంకంటె మంచి విద్య మన జాతి కేముం దండీ?'

'ఎందుకు బాబూ ఈవేదం—ఎవరి క్కావాలి? దీనివల్ల దొరికే వుద్యోగం లేదు—జరిగే గౌరవం లేదు!'

'వెధవవుద్యోగాలు మేం చేస్తున్నాం చాలదూ? మీలాంటివారు శ్రమకోర్చి ఆవేదస్వరూపాన్ని నిలబెట్టుతున్నారు గనుకనే భూమి నిలబడి వుంది. ఏమిటో చదువూ, వుద్యోగాలూ అనుకుని ఎగబడటమేకాని ప్రయోజనం ఏమీ లేదు. ఈ చదువుకున్నవారికి నోరుకూడా తిరగదు—ఏదీ వుచ్చరించమనండీ రెండు మాటల్ని? వేదఘోష! నిజంగా మీబోటి పండితులు అలా కూచుని వేదం పారాయణచేస్తుంటే నాకు వొళ్లు పులక

రిస్తుంది! నేను చాలా దురదృష్టవంతుడి నండీ-ఈ చదువు మూలకంగా బ్రతుకుతెరువని ఏవ్వూరు పడితే ఆవ్వూరు పోవాలి. వాళ్ల దయ—వడిసెలరాయి విసిరినట్టుగా విసుర్తారు మమ్మల్ని! వేదం అంటే ఎంత అభిలాష వుందో నాకు-అంత దూరం అయినాను నేను దానికి. మీరు చదువుతుంటే వినాలని నాకు మహావుంది. ఆర్నెల్లకిందటే నే నావూళ్లో వున్నప్పుడే చెప్పారు మీ సంగతి!'

'లోకం అనేకం చెబుతారు!'

'మీ రలా అనవద్దు—మీకు మల్లే వేదం పఠించగలవారు ఈప్రాంతాల లేరని నాకు తెలుసు. అయినా మీతో అనగూడదుగాని మీవర్చస్సె చెబుతుంది—రత్నం ఎక్కడున్నంటే నేమండీ—'

'ఏం కోటయ్యా—' అన్నాడు శేషయ్య.

'పొద్దున నెయ్యి పంపమని చెప్పాను, చేరిందా బాబూ?'

'వచ్చినట్టుందే—కనుక్కుంటాను.'

'నేను వస్తాను—మీరు శ్రమ అనుకోక మీరు పారాయణచేసేటప్పుడు నాకు కబురుపంపండి-శలవు!'

తీర్థులు వెనకనే కోటయ్య వచ్చాడు.

'ఏం కోటయ్య మామా, ఏమిటి విశేషాలు?' అన్నాడు. తీర్థులు.

'ఏమున్నయి బాబూ! తెలిసినవారూ, పత్రికలు చూచేవారూ మీకు తెలియాలి!' అన్నాడు కోటయ్య.

కోటయ్య వూళ్ళో పలుకుబడిగల రైతు. చనువుచేతగాని, అభిమానంచేతగాని శేషయ్య దగ్గిర్నించీ అందరూ 'మామ' అని పిలుస్తారు అతన్ని.

'మా చదువులూ, పత్రికలూ అవతల పెట్టు! ఏరోజున నాటాలో, ఏరోజున నీరు ఎంత పెట్టాలో మే మేం చదువుకుంటే తెలుస్తుంది? మీ కున్న విజ్ఞానం ఈ చదువుకున్నవారి కెవరికుంది? అసలు నిజమైన జీవితం మీది. కష్టపడి పనిచేసి ప్రతిఫలం అనందించ గలిగినవాళ్లు మీరు. నాట్లువేసేటప్పుడు వాళ్లు పాడేపాటలు నిజంగా వొళ్లు గగుర్పొడుస్తాయి! ఆపాటల్లో ఎంత నాగరికత, ఎంత జాతీయత వుందో తెలిసినవాడు

ఒక్కడున్నాడూ!'

'ఏమో బాబూ—మాకు మరోవిధంగా జరగదు!'

'నువ్వు అలా అనుకోటం పొరబాటు కోటయ్యమామా! మీకున్న నిశ్చింత మాకు లేదు. వున్నవూరు దాటక్కర్లేదు—మరొకరి దగ్గిరికి పోనక్కర్లేదు. సమస్తమూ మీకు లభిస్తాయి. మీరు రుచిచూచే పెరుగూ, నెయ్యీ మా కెప్పుడూ దొరకదనుకో! మీకు ఏచింతాలేదు. మీదే నిజమైన జీవితం అని మనజాతి గ్రహించే రోజు దగ్గిరికొస్తున్నదనుకో! ఇంకో సంగతి—మీకు తెలిసినదే తెలుసుకోటానికి దూరదేశాలు వెళ్ళి చదువుకునివచ్చినవారికి మీ అంతకూడా తెలీదనుకో!'

'ఆరోజు నిజంగా వచ్చిందంటే మానోట్లో కరక్కాయే బాబూ? మీకుమల్లే స్వంతంగా ఈవూరి వారందరూ గడ్డంగీసుకునే మాటయితే మనవూళ్ళో కొన్నాళ్ళకు మేళం దొరకదు బాబూ!' అన్నాడు కోటయ్య.

'నిజంగా ఇటువంటి పల్లెటూళ్ళో జీవితం—! మామా, మరి నాకు ఒక్కసారి మంచి పెరుగు సప్లయిచేసి పెడుదూ!'

'ఏం బాబూ మీరు తయారుచేసుకోలేరూ?'

'మాకు మంచి పాలే దొరకవు!'

'మాకుమటుకు దొరుకుతయ్యా బాబూ!'

'మాకు దొరక్కపోతే మరెవరికి దొరుకుతయి? ఒకవేళ మాకు మంచి పాలు దొరికినా మాకు అలాంటి పెరుగు తయారుకాదు!'

'మీ దొట్టి భ్రమబాబూ!'

'కాదు—నామాట నమ్ము!'

'చూద్దాంలే బాబూ!'

'చూద్దాం అంటే కాదు—తప్పకుండా—ఆఁ?'

'చూద్దాంలే బాబూ!'

౪

'ఏం సుబ్బారావూ—ఏ చేస్తున్నావు?' అన్నాడు తీర్థులు.

సుబ్బారావు ఆవూళ్లో నేసంవత్సరన్నరమట్టీ మేష్టరుగావుంటున్నాడు.

'రండి!—ఇవాళ శలవుగాదూ!'

'మరే—అయితే, ఈవూళ్లో వాళ్ళు బలే తమాషావాళ్ళోయి!'

'ఏమిటికథ!'

'కోటయ్య పెరుగు పంపిస్తావని పంపాడు. వట్టినీళ్ళు!'

'బర్రె నీళ్ళెక్కువ తాగిందేమో!'

'అలాగే వుంది చూస్తే—అలాంటిది నాకు పంపటం ఎందుకంటాను. మనవాళ్ళకు ఇటువంటి విషయాలల్లో తెలివితేటలు శూన్యమోయి. ఎన్నడూ వూరుదాటిపోరుగదూ, వీళ్ళకు మానవప్రకృతే అర్థంకాదు. నిజంగా నువ్వెలా వుంటున్నావోగాని ఈవూళ్ళో!'

'ఏం చేస్తాం మరి!' అన్నాడు సుబ్బారావు.

'ఆ ప్రకాశంగారున్నాడా—నే నెన్నిసార్లు రిక్వెస్టుచేసినా ఒక్కసారికూడా చదరంగం ఆడలేదోయి!'

'ఆయనకు నిజంగా చేతగాదోయి!'

'మరి ఆ శేషయ్యాగారలా చెప్పాడేం?'

'శేషన్నయకుమటు కేం తెలుసూ?'

'అంతేనా?'

'ఏం కోటయ్యమామా!' అన్నాడు సుబ్బారావు.

'రాఘవయ్యాగారు మిమ్మల్ని ఓసారి రమ్మన్నారు!'

'వస్తాలే—'

'నేను వెళ్ళుతున్నాను సుబ్బారావ్—అటు దుకాణాని కెళ్ళిరావాలి!' అని వెళ్ళిపోయినాడు తీర్థులు.

'నీళ్ళపెరుగు పంపావంట!' అన్నాడు సుబ్బారావు.

'పంపమని రామిగాడికి చెప్పాను—మరి నాకు తెలియదు బాబూ!'

'నువ్వు రాగానే వెళ్ళిపోయినాడేం?'

'ఏమిటో బాబూ. ఆయనకు మేమంటే ఎగతాళి! మాజీవితంఏముంది—గొడ్డల్లే పనిచెయ్యటం, ఇన్ని గంజినీళ్ళు తాగటం! వారికున్న ఇజ్ఞానం మాకెలా వస్తుంది! వారంటే అక్కడికీ ఇక్కడికీ తిరిగేవోరు—అనేకం తెలిసినవారు. పత్రికలు చదువుతుంటారు. అవి మాకు చెప్పితే మాకేం అర్థం అవుతయ్యి బాబూ!'

'ఆయన చాలా మంచివాడు—'

'ఏం మంచో బాబూ! తీపిమాటలు చెప్పి పనిచేయించుకునే రకం-ఆయనవల్ల ఎవ్వరికీ ఏంప్రయోజనం వుండదు! మేం నానాఅగచాట్లు పడుతుంటే మేవిలా కష్టపడటమే మంచిదంటాడు ఏం చెప్పను బాబూ? ఈయన ఎంత చదువుకున్నా, మేమెంత పల్లెటూళ్ళోళ్ళవాళ్ళమయినా. ఆ మాత్రం తెలుసుకోలేమా బాబూ? ఎవరిదగ్గిర ఆడిసంగతులు చెపుతాడు-ఎవరికి తెలవదనో!'

'శ్రీరామ! అంతేనా చివరకు!'

'ఏమిటో—మీకన్నా నాకేం ఎక్కువ తెలుస్తుంది బాబూ!' అన్నాడు కోటయ్యమామ.

# చిన్న—పెద్ద

వెంకట్రామయ్య ఇల్లు చేరుకు నేటప్పటికి పొద్దు కూకింది. రామారావు వున్న భాగం వరండాలో హరికేనులాంతరు చిన్నది చేసివుంది. ఇంట్లోకి వెళ్లి వుత్తరీయం అవతల పారేసి, బైట లష్టరుదీపం కొంచెం తగ్గించి, అరుగుమీద వున్న పడకకుర్చీ తీసి కింద వేసి, దాంట్లో కూచుని చుట్ట వెలిగించాడు వెంకట్రామయ్య. ఎదురుగుండా వున్నవారి దొడ్లోవున్న బాదంచెట్టుఆకుల సందునుంచి చందమామ కనపడీ కనపడకుండా వున్నాడు.

'ఏమోయి తమ్ముడూ!' అన్నాడు వెంకట్రామయ్య—అప్పుడే వచ్చిన జగన్నాథం హరికేనులాంతరు పెద్దది చేసి, పక్కన వున్న పుస్తకం తెరవగానే.

జగన్నాథం కొంతారావుకొడుకు. తొమ్మిదేళ్లుంటాయి. రామారావు ఇంట్లో వెంకట్రామయ్య అద్దె కుంటున్నాడు. వెంకట్రామయ్య పిలవగానే జగన్నాథం లేచి నిల్చున్నాడు.

'భోంచేశావా?'

'ఆ!' అన్నాడు జగన్నాథం.

'అప్పుడే! నాకు పెట్టకుండానే భోంచేశావే!' అన్నాడు వెంకట్రామయ్య ఆశ్చర్యం కనపరుస్తూ.

జగన్నాథం మాట్లాడకుండా అక్కడే నిల్చున్నాడు.

'ఇక్కడికి రావోయి-పిలుస్తుంటే నే!'

జగన్నాథం వెంకట్రామయ్య దగ్గిరికి వచ్చాడు.

'అన్నంలో ఏమేసుకు తిన్నావ్?'

'కందిపచ్చడీ—మరి—'

'కందిపచ్చడే—మరి నాకు పెట్టకుండానే తిన్నావే?'

జగన్నాథం మాట్లాడలేదు.

'పోనీ, ఈతడవ కందిపచ్చడి చేసుకున్నప్పుడు పెడతావా?'

జగన్నాథం మాట్లాడలేదు.

'ఓరి! ఈ తడవ చేసుకున్నా పెట్టవన్నమాట! ఏమంటావోయి, నీ మనమడు కొత్త కందిపచ్చడికూడా పెట్టడు!' అన్నాడు వెంకట్రామయ్య అప్పుడే వచ్చి వాకిట్లో కూచున్న శేషమ్మతో.

'వాడా—వొట్టిబడితె! పోయి చదువుకోరా!' అంది శేషమ్మ.

'అయితే నువ్విప్పు డేంచదువుతున్నావురా జగన్నాథం?' అన్నాడు వెంకట్రామయ్య.

'అయిదో క్లాసు!' అన్నాడు జగన్నాథం.

'ఇంతే—ఏదీ, నువ్వు చదివే పుస్తకం పట్టుకురా!'

జగన్నాథం పుస్తకాల దగ్గిరికె వెళ్ళాడు.

'నాన్నగారూ, అమ్మ మడికట్టుకోమంటున్నది' అంటూ వచ్చాడు వెంకట్రామయ్యకొడుకు శివరాము.

'అలాగేలే—వస్తున్నానుండూ!' అన్నాడు వెంకట్రామయ్య.

'అదేమిట్రా, ఆయన పిలుస్తుంటే వెళ్ళకుండా అలా మొద్దల్లే కూచున్నావు!' అంది శేషమ్మ మనమడితో.

'నేను చదువుకో నక్కర్లేదేమిటీ!' అన్నాడు జగన్నాథం.

'ఏడిచినట్టే వుంది నీచదువు—ఆయన పిలుస్తుంటే వెళ్ళవేం? మా వాడు వట్టి బడితె అయిపోతున్నాడు బాబూ—చదువని పేరేగాని వాడు చదివేదానికీ, వాడికి అర్థం అయేదానికీ సంబంధం వుండదు. ఏమిటో మనస్సులో చదువుకుంటాడు. చూడరా వెధవా, వాళ్ళ శివరాము ఎలా చదువుతున్నాడో గడగడా!' అంది శేషమ్మ లేచి వెళుతున్న జగన్నాథంతో, అప్పుడేవచ్చి వరండాలో కూచుని చదువుతున్న శివరామును చూపి.

'అయితే మీ పరీక్షలు జరుగుతున్నయ్యా?' అన్నాడు వెంకట్రామయ్య జగన్నాథం దగ్గిరికి రాగానే.

'ఆ!' అన్నాడు జగన్నాథం.

'రేపు ఏమిటి?'

'జాగ్రఫీ'

'అయితే మన దేశం కేన్ని పండించటంలో ప్రసిద్ధి?' అన్నాడు వెంకట్రామయ్య.

జగన్నాథం మాట్లాడలేదు.

'చెప్పరా మొద్దూ!' అంది శేషమ్మ.

'ఏమిటి మా వాడిని పరీక్షచేస్తున్నారా?' అన్నాడు రామారావు అప్పుడే వచ్చి.

'నువ్వు భోజనానికి లేవరా అబ్బాయీ!' అంది వెంకట్రామయ్య తల్లి రాజమ్మ వచ్చి గడపలో కూచుని.

'ఒరేయి, ఇటురా జగ్గూ!' అంది జగన్నాథం తల్లి వొడ్లోనించి. జగన్నాథం వెళ్లాడు.

'అదీ! ఎప్పుడు ఎవరు పిలుస్తారా అని సిద్ధంగావున్నాడు వెధవ— ఆయ నడిగిందానికి సమాధానం చెప్పవేం?' అంది లోపలికి పోతున్న జగన్నాథాన్ని చూచి శేషమ్మ.

'నీ కెందుకేం?' అన్నాడు జగన్నాథం.

'అంతేలే, ఆయనకొడుకువు గాదూ నువ్వు?' అంది శేషమ్మ.

'ఏమిటది మధ్య నన్ను ఇరికిస్తున్నావు!' అన్నాడు రామారావు తల్లితో.

'ఏంలేదు—వాడుకూడా నీకుమల్లేనే తయారవుతున్నాడని అన్నా. వాడినేం తిట్టలేదు!' అంది శేషమ్మ.

'నాకుమల్లే తయారుకాకుండా చెయ్యరాదూ వాడిని?' అన్నాడు రామారావు.

'నిన్ను చేశాను; వాడిని చేస్తాను ఇక!' అంది శేషమ్మ.

'అలాంటప్పుడు మరి అనుకోవటం దేనికి?' అన్నాడు రామారావు.

'ఏమో నాయనా, పెద్దదాన్ని కనక అనుకుంటాను' అన్నది శేషమ్మ.

'నాన్నగారూ, అమ్మ మడి గట్టుకోవచ్చునంటున్నది!' అన్నాడు

జగన్నాథం దబదబా వచ్చి.

'చంపుతా వెధవా నన్ను నాన్నగారూ అని పిలిచావంటే-నీకిదివరకు ఎన్నోసార్లు చెప్పాను!'

'అదికూడా తప్పేనుట్రా?' అంది శేషమ్మ.

'వాడు చేసే పన్లు అన్నీ తప్పేగా నీ దృష్టిలో! నాన్నగారుట నాన్నగారు—ఎక్కడ నేర్చుకున్నాడో!'

'ఇది మరీ బాగుందిరా!' అన్నది శేషమ్మ.

'నీ మనమడిమీద నీకున్న ప్రేమ నా కొడుకుమీద నాకు లేక పోలేదు లేవమ్మా—ఈ విషయంలో నువ్వు వాడిని వెనకేసుకుని రానక్కర్లేదు.' అన్నాడు రామారావు.

'నేను వెనకేసుకుని వస్తే సాగుతుందిట్రా పిచ్చివాడా. వాడికిప్పుడే నేనంటే లక్ష్యం లేదు.' అంది శేషమ్మ.

'మరి నేనంటే లక్ష్యముండేం?' అన్నాడు రామారావు.

'ఏదీ నీ ఎదటే—నువ్విటు మొహం తప్పిస్తే వాడిటు మళ్ళీ మామూలే. మరి నువ్వు వున్నా నేనంటే వాడికి లక్ష్యంలేదు సరేగదా?' అంది శేషమ్మ.

'అదికూడా నా తప్పేనా? వాడిని అలా చేసింది నువ్వు!' అన్నాడు రామారావు.

'చివరకు నేరం నామీదే పెట్టావూ—అంతేలే. నువ్వు అంతకంటె మరేమంటావు!' అన్నది శేషమ్మ.

'నేననేదేమిటి? నేనంటే వాడికి లక్ష్యం ఎందుకుండాలి-నువ్వంటే ఎందుకు ఉండకపోవాలి?' అన్నాడు రామారావు.

'నామాటంటే వాడు ఒక్కపిసరు లక్ష్యంచెయ్యకుండా వున్న సమయాల్లో నువ్వు వాడిని ఒక్కసారన్నా కోప్పడితేగా వాడికి లక్ష్యం ఉండటానికి?' అంది శేషమ్మ.

'ఇది మరీ బాగుంది! నువ్వంటే వాడికి అసలు లక్ష్యంలేని స్థితి ఎందుకు రావాలి?

'ఏమో నాకేం తెలుసు ?' అంది శేషమ్మ.

'నీకు తెలిసిందల్లా వాడు అయిపోయేటనే నలభయ్యేళ్ళవాడిమాదిరిగా వుండలేదనేగా ?' అన్నాడు రామారావు.

'ఇంకా రెండేళ్లు తగ్గించు. రేపు వైశాఖమాసానికి నీ ముద్దుల కుమారుడికి పదోఏడు వస్తుంది. అప్పుడే మరిచిపోయినట్టున్నావు !' అంది శేషమ్మ.

'వాడు నీతో మర్యాదగా వుండనిది ఇవాళ్ళకాదుగా—ఈ నాలు గేళ్ళమట్టి వాడు నీతో పెంకెగానే వుంటున్నాడుగా. నువ్వూ మరచి పోయినట్టున్నావు !' అన్నాడు రామారావు.

'వాడి ఎదటే వాడిని ఇలా వెనకేసుకొస్తే పెంకెగా వుండకేం చేస్తాడు ?' అంది శేషమ్మ.

'వెనకేసుకుని రావటం తప్పుగాదుకాని వాడి ఎదటే ఆపని చెయ్యటం తప్పుకామాలు !' అన్నాడు రామారావు.

'నాయనా, నీకొడుకుని నీయిష్టం వచ్చినట్టు పెంచుకో. ఏదో పెద్ద దాన్ని కాబట్టి వాడింత చదువుకుని బాగుపడాలని నాకుంటుంది. నువ్వు అక్కర్లేదన్నా వుంటుంది. అనుకోటమేకాని నేననుకున్నట్టు ఎలాజరుగుతుంది ? వాడు నీకొడుకాయె—నువ్వెంతో వాడూ అంతే. నీకెంత లక్ష్యం వుందో వాడికీ అంతే వుంటుంది. నామాట నువ్వెంత విన్నావో వాడూ అంతే వింటాడు !' అంది శేషమ్మ.

'నా చిన్నప్పటి సంగతులు తప్ప నావిషయం నీకింకేమీ జ్ఞాపకం లేదల్లే వుంది ?' అన్నాడు రామారావు.

'ఎలా మరిచిపోతానూ ? నీ పుత్రుడు ఒక్కొక్కపని చేస్తుంటే నీవు చేసినపనులు కళ్ళకుకట్టినట్టు వుంటయి. నువ్వు లేకపోతే వీడు నన్నెంత ఏడిపించేదీ నీకేం తెలుసు, గోడలూ చెట్లూ ఎక్కటం మొదలైన సకల విద్యలూ నీకుమల్లేనే తెలుసు—'

'నాన్నా, భోజనానికి రమ్మంటున్నది అమ్మ !'

'రామారావు లోపలికి వెళ్ళాడు. రామారావుతో జగన్నాధం

కూడా వెళ్ళాడు, అంతా నిశ్శబ్దంగా వుంది—బైట మా ధాకవళం అని అరిచేవాళ్ల గొంతులు తప్ప ఏశబ్దమూ లేదు.

'ఏం రాజమ్మగారూ, మీ ఇంటో భోజనాలయినయ్యా ?' అంది శేషమ్మ.

'ఏదీ, మావాడు భోజనం చేస్తున్నాడు" అన్నది రాజమ్మ.

'మూరామూరావు ఇప్పుడింకా నయం. వాడు చిన్నప్పుడు చేసిన గోల భగవంతుడికి తెలుసు అంది శేషమ్మ.

'ఆ—చిన్నతనంలో అల్లరి పెద్దతనంలో వుంటుందిటండీ మీకు పరీ చాద స్తంగాని!' అంది రాజమ్మ.

'మీమనమడూ, కొడుకూ చూడండి—వాళ్లు ఎలా వుంటారో?' అన్నది శేషమ్మ.

'మా వెంకట్రాముడు చిన్నప్పుడు ఒకచోట కూచోపెడితే అలా కదిలేవాడుకాదు!' అంది రాజమ్మ.

'అదృష్టం! తండ్రిపోలికే కొడుక్కు వచ్చింది. మా వాడు పెరుగు కుండలు ఎన్ని పగలకొట్టాడో లెక్కలేదు. వాడు మంచినీళ్ళగ్లాసు గిరాటేస్తే జామచెట్టుదగ్గిర పడేది' అంది శేషమ్మ.

'ఆ—చిన్నతనం' అంటూ రాజమ్మ లోపలికిపోయింది. శేషమ్మ అక్కడే కూచునివుంది. శివరాము లోపల్నించి వచ్చి పుస్తకం తీసుకుని గడగడా చదవటం మొదలుపెట్టాడు.

౨

రామూరావు ఇంటికొచ్చేసరికి జగన్నాథం ఒకమూల కూచుని వున్నాడు.

'అమ్మ ఏదిరా ?' అన్నాడు రామూరావు.

'వచ్చావు బాబూ !' అంటూ వచ్చింది శేషమ్మ. వెనకాలే రామూ రావు భార్యకూడా వచ్చింది.

'నాన్నతో చెప్పమంటావా ?' అంది జగన్నాథం తల్లి.

'ఎలా నంగనాచి అల్లే కూచున్నాడో చూడు! ఓరేయి రామూ! వీడితో వేగలేకుండావున్నాంరా. నువొక్కసారి వీడిని గట్టిగా భయం పెడితేగాని మరి మాటదక్కదు' అంది శేషమ్మ.

'నన్నేం చెయ్యమంటావు?' అన్నాడు రామారావు.

'ఇవాళ వీడు వెంకట్రామయ్యగారి రిస్టువాచీ పగలగొట్టాడు. ఆయన లేనప్పుడు వాళ్ళ రేడియో తిప్పుతుంటాడు. రాజమ్మగారు అనేకసార్లు అంది. ఆయన లేకపోతే ఆ రేడియో ముట్టుకోటానికి ఆయన భార్యకే భయం. వాళ్ళింట్లో శివరాముమటుకు కుర్రాడు కాదూ? వాడేమన్నా ఇలాటిపనులు చేస్తున్నాడా?' అంది శేషమ్మ.

'ఆయన రిస్టువాచీ ఎందుకు పగలగొట్టావురా?' అన్నాడు రామారావు.

'పెట్టుకోమని ఆయన నాకిచ్చాడు నాన్నా!' అన్నాడు జగన్నాథం,

'వెధవా, అబద్ధాలు చెబుతావెందుకు—నువ్వు అడిగితే ఇచ్చాడా, వూరికే ఇచ్చాడా?' అంది శేషమ్మ.

'నే నడిగితేనే ఇచ్చాడు!' అన్నాడు జగన్నాథం.

'ఎందుకు నువ్వాయన్ని అడగటం?' అంది శేషమ్మ.

'వాడు కుర్రాడు గదా, వాడడిగితే మాత్రం ఆయన ఇయ్యటం దేనికీ?' అన్నాడు రామారావు.

'ఇస్తే పగలగొట్టాలని వుందా?' అంది శేషమ్మ.

'ఎలా పగిలిందిరా' అన్నాడు రామారావు.

'మేము బిళ్ళంగోడు ఆడుతున్నాం నాన్నా—బిళ్ళ వచ్చి నాచేతికి తగిలింది—వాచి పగిలింది!' అన్నాడు జగన్నాథం.

'నీ ఈడుకు నీకు బిళ్ళంగోడు దేనికిరా?'' అంది శేషమ్మ.

'అదేమిటి అర్థంలేని మాట! వాడు ఏది చేసినా తప్పేనంటే ఎట్లా? అయితే పిల్లలు ఆడుకోరూ?' అన్నాడు రామారావు.

'పొద్దుస్తమానం ఆటలేనా—ఆ స్కూలువాళ్ళకన్నా బుద్ధిలేదు. పరీక్షలయింతర్వాత ఈ శలవలు దేనికి—వీళ్లు అల్లరి చెయ్యటానికి

తప్పితే!' అంది శేషమ్మ.

'ఆటలో వెంకట్రామయ్యగారి నుదురు పగిలింది—అసలు కన్ను పోవలిసింది!' అన్నది రామారావు భార్య.

'ఆయ నెందు కున్నాడూ అక్కడ?' అన్నాడు రామారావు.

'ఆయనా ఆడాడు నాన్నా!' అన్నాడు. జగన్నాథం.

'ఆడితే?' అంది శేషమ్మ.

'నేను బిళ్ళని కొట్టబోతుండగా ఆయన పట్టుకుంటామని దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు. ఆబిళ్ల వెళ్ళి ఆయన ముఖంమీద తగిలింది!' అన్నాడు జగన్నాథం.

'ఆయనకు వీడితో ఆటలేమిటి?' అన్నాడు రామారావు.

'బాగుంది! ఏదో కుర్రాడు గదా అని చనువుచేస్తే ఆయనముఖం పగలగొట్టమనీ, రిస్టువాచి పగలగొట్టమనీ, రేడియో పాడుచెయ్యమనీ వుందా ఏమిటీ? వాడిని నువ్వు కొంచెం హద్దులో పెడితేతప్ప మరి లాభం వుండదు' అంది శేషమ్మ.

'నేను వాడిని హద్దులో పెట్టేదేమిటి-మీరు పెట్టరామా?' అన్నాడు రామారావు.

'ఇందాకటినించీ నన్ను వా డెంత ధిక్కరించాడో నీ కేం తెలుసు?' అంది శేషమ్మ.

'దీనికి నన్ను కోప్పడమంటే మటుకు నే నేం కోప్పడను? కుర్రవాడికి రిస్టువాచీ ఇయ్యటం ఆయనతప్పు.'

'వీ డడగటం దేనికీ?'

'వాడు అనేకం అడుగుతాడు-వా డడిగినవన్నీ ఇస్తారా? అయినా వాడిదగ్గర పగిలిందికాని వాడుకాదు దాన్ని పగలగొట్టింది. ఆయన మొహం పగిలిందంటే వీడిదికాదు తప్పు. ఆటలో దెబ్బ అరటిపండు. పిల్లలతో ఆడుకోటానికి సిద్ధమయినవాడు దాని ఫలితానికికూడా సిద్ధం కావాలి. అనవసరంగా వాడిని కోప్పడమంటే మటుకు నేను కోప్పడను!'

'ఇలా అయితే మాట దక్కుతుందిట్రా వీడితో!' అంది శేషమ్మ.

'వాడిని ఇష్టంవచ్చినట్టు ఆడుకోనీయక వాడితో జోక్యం కలగచేసుకోవటం దేనికీ? ఆయన వీడితో ఆడుకోవటం దేనికీ? వీడికీ ఆయనకూ భేదం ఏమిటి? వాళ్ల శివరాముతో ఆయన ఎందుకు ఆడుకోడు?'

'వాళ్ళ శివరాము ఇలాంటి పిచ్చిపను లేమీ చెయ్యడు!' అంది శేషమ్మ.

'పిచ్చిపను లని నీనమ్మకం-సరదా అని ఆయన అభిప్రాయం! ఇంతకూ ఆయ నేమన్నా అన్నాడా వీ డిలా చేశాడని?'

'బాగుందిరా-ఆయన అంటాడేమిటి? వాళ్ళ రాజమ్మ అంది!'

'ఆయనవాచీ పగిలినా ఆయనకు లేని దుగ్ధ ఆవిడకూ, నీకూ పట్టింది!' అన్నాడు రామారావు.

'సొమ్ము కాదుట్రా-అలా అంటావేమిటి?' అంది శేషమ్మ.

'ఆయనకుమటుకు కాదూ సొమ్ము? ఆయన తన కొడుకుతో ఆడుకోలేక మనవాడితో ఆడుకుంటున్నాడు. చిన్నప్పుడు చిన్నతనంగా వుండకపోతే ఆ చిన్నతనం పెద్దప్పుడు ఇలాగే వస్తుంది! నేను వాళ్ళ శివరాముతో ఆడుకుంటే నావాచీ పగిలితే నే నతన్ని ఏమీ అనను సరేగదా మనస్సులోకూడా అనుకోను!' అన్నాడు రామారావు.

'నువ్వు పిల్లల్ని దగ్గరికి రానియ్యటం - నేను చూడటం!' అన్నది శేషమ్మ.

'అవును! వాళ్ళని ఆడుకోనీక మనం దేనికి? వాళ్ళతో ఆడుకోవాలంటే మనంకూడా వాళ్లతో సమానం అవాలి. అప్పుడు ఏం జరిగినా అనుకోవలసిన అవసరమే లేదు. వాళ్ల శివరాముతో ఆయనకు ఆడుకోవాలని వున్నా ఆ శివరాముకు ఆయనతో ఆడుకోవాలని లేదల్లేవుంది. అందుకనే ఆయన మనవాడిదగ్గిరికి చేరాడు!' అన్నాడు రామారావు.

'వా డిలా అల్లరిచేస్తుంటే వాడిని భయంపెట్టకపోతే ఎలాగురా?' అంది శేషమ్మ.

'నువ్వింతమటుకు వాడి అల్లరి అల్లరి అని అనేకసార్లు చెప్పావు. తొమ్మిదేళ్ల నాడు నలభైఏళ్ల వాడిమాదిరిగా ప్రవర్తించక పోవటం అల్లరి అని నీ నమ్మకం. పెద్దవాళ్ళం మనమే చిలిపిచేష్టలు చేస్తూ,

వెధవాలోచనలు మనస్సులో పెట్టుకుని మర్యాదస్థుల మల్లే తిరుగుతుంటే చిన్నపిల్లలు ఏ కల్మషం లేక, వాళ్ళ దారిని వాళ్లు ఆడుకుంటే మనం వోర్చలేకపోవటమేమిటి? పైగా ఇటువంటివాటికి నన్ను భయపెట్ట మంటావు. నా కొడుక్కి నాయందు భయమూ, భక్తీ కావు నాకు కావలిసింది. నాయందు వాడికి కొంచెం అభిమానమూ, ప్రేమా ఉంటే చాలు. నువ్వు చెప్పినట్టు చేస్తే వీడూ శివరాములల్లే తయారయ్యేవాడు. శివరాము ఎంత మంచివాడయినా అటువంటి కొడుకుమటుకు నా కక్కర లేదు. అటువంటి కొడుకే నాకూ వుంటే నేనూ వాళ్ళ నాన్నకుమల్లే ఆడుకోటానికి ఎవరినన్నా వెతుక్కోవాలి!'

'నన్ను వీడు నాయనమ్మగారూ అని పిలవటం మొదలుపెట్టాడు—కొత్తవిద్య కామాలు!' అంది శేషమ్మ.

రామారావు నవ్వాడు.

'ఇందాకటి విషయాలన్నీ అయిపోయినయి కామాలు. నన్ను నాన్నగారూ అని పిలిస్తే కోప్పడితే వాడిని వెనకేసుకునివస్తివే అనాడు? ఇప్పుడు నిన్ను నాయనమ్మగారూ అని పిలవటం నీ కిష్టం లేదు కామాలు—తమాషే!'

'ఏడీ వీడా జగ్గన్నాడా?' అంటూ లోపలికివచ్చాడు వెంకట్రామయ్య.

'రండి!' అన్నాడు రామారావు.

'ఏడీ మీవాడు?' అన్నాడాయన.

'మా వాడు చాలా అల్లరి చేస్తున్నాట్టే!' అన్నాడు రామారావు ఆయన మొఖంమీద పట్టిచూచి.

'సరేవాడండీ మీవాడు. నామీద నలభైపిల్లిలు ఎక్కించాడు. ఏడీ?'

'మీ గడియారం పగిలిందిట?'

'వెధవగడియారం—ఇంకోటి వస్తుంది!' అన్నాడు వెంకట్రామయ్య.

'వాడిని పిలవ్వే!' అని రామారావు అంటూండగానే జగన్నాథం లోపలికి వచ్చాడు.

'రా వోయి సినిమా కెళదాం!' అన్నాడు వెంకట్రామయ్య.

'వాడు మీతో సినిమా కేమిటి?' అంది శేషమ్మ.

'పర్వాలేదు! మీవాడిని పంపించాలండీ!' అన్నాడు రామారావుతో వెంకట్రామయ్య.

రామారావు జగన్నాథంవంక చూచాడు. జగన్నాథందృష్టి అంతా తండ్రిమీదనే వుంది.

'వెళ్తావుట్రా?' అన్నాడు రామారావు.

'ఊ' అన్నట్టుగా తల వూపాడు జగన్నాథం.

'అయితే వెళ్లు!' అన్నాడు రామారావు.

జగన్నాథం ఒక్క పరుగు తీశాడు బైటికి.

'ఔరేయి వెధవా—ఆ మట్టిమొఖం అదీ కడుగుతా రారా' అంది శేషమ్మ.

'నాకొద్దు!' అన్నాడు జగన్నాథం.

'చూడరా—అదీ వరస!' అంది శేషమ్మ.

శేషమ్మ బలవంతంగా జగన్నాథాన్ని పట్టుకుని, అతను గిజగిజా కొట్టుకుంటున్నా తీసుకువెళ్ళి, మొఖం కడిగి, తల దువ్వి, ఇస్త్రీబట్టలు తొడుగుతుంటే రామారావుకు నవ్వు వచ్చింది. ఏదో అందామని వెంకట్రామయ్యవంక తిరిగాడు.

వెంకట్రామయ్య అలాగే నిలబడి జగన్నాథంవంకనే చూస్తున్నాడు. అతని ముఖంలో వర్ణనాతీతమైన వుత్సాహం తాండవమాడుతున్నది. రామారావు ఆశ్చర్యపోయినాడు.

జగన్నాథం వెంకట్రామయ్యతో వెళ్ళిం తరువాత 'పాపం, ఆయన ఎంత బాధపడుతున్నాడో ఇప్పుడు-చిన్నదినంలో చిలిపిచేష్టలు చెయ్యక పోవడంవల్ల!' అన్నాడు రామారావు భార్యతో.

---

# అమాయకుడు

'ఇన్నాళ్లూ వూరుకుంటే నీకు సీటు ఎలావుంటుందనుకున్నావు?' అన్నాడు ప్రిన్సిపాల్ లాంఛనంగా.

'ఆలిస్యం అయిపోయిందండి! అన్నిటికీ నాకు నేనే కావటంవల్ల ఇలా అయింది!' అన్నాడు శాస్త్రి వినయవిధేయతలతో.

'మరి సర్టిఫికేటూ, జీతం సిద్ధంగావున్నయ్యా?'

'చిత్తం!'

'అయితే ఈఫారం పూర్తిచేసి జీతంకట్టి వెంటనే క్లాసుకు వెళ్ళిపో!'

శాస్త్రి జీతంకట్టి రసీదు తీసుకుని వెళ్ళబోతుండగా ప్రిన్సిపాలు పిలిచాడు.

'ఇప్పటినించీ నీవు సరిగా కాలేజీకి వచ్చినట్లయితే అటెండెన్సు సరిపోతుంది. నీ అశ్రద్ధవల్ల కానీ, మరి ఏ ఇతరకారణంవల్ల కానీ అటెండెన్సు కనక చాలకపోతే నేనేవిధంగాను సహాయం చెయ్యను. ఆలిస్యంగా చేరతానంటేమటుకు నన్ను ఎందుకు చేర్చుకోవాలని అప్పుడు నీవు వాదించి లాభం వుండదు. ఇవన్నీ నీవు ముందగే తెలుసుకుని కాలేజీలో చేరినట్టు భావిస్తున్నాను!'

'ఫరవాలేదండీ!' అన్నాడు శాస్త్రి దిమ్మెరపోయి.

'ఆల్ రైట్!'

ఆ సాయంకాలం గంట కొట్టగానే అందరితోపాటు శాస్త్రి తన కొత్త స్నేహితుడితో—ఆలిస్యంగా చేరేవాడికి ఎవడోఒకడు రెండునిమిషాలలో దొరకకపోడు—గదిబయటికి వచ్చాడు. ఓ యాభైమంది విద్యార్థులు గుంపుకూడి ఏమిటో చేస్తున్నారు. శాస్త్రి ఏమిటో చూద్దామని స్నేహితుడితో ఆ గుంపును సమీపించాడు. అందరు మగ విద్యార్థుల మధ్య ఓ విద్యార్థిని తలవంచుకుని నిలబడివున్నది. ఆమెపక్కన, మగ విద్యార్థి ప్రవాహాన్ని ఆపుతూ కార్తవీర్యార్జునుడిలా ఓ బ్రాహ్మణుడు నిలబడివున్నాడు. ప్రతి శుక్రవారం ఈ పేరంటం వుంటుందని శాస్త్రికి తర్వాత తెలిసినప్పటికీ అప్పుడు ఈ సినిమా ఏమిటో అర్థంకాలేదు.

ఇంతలో అర్థం అవుతున్నట్లు అనుమానం వేసింది. ఆమె ముందున్న ఇనప మెట్లమీదుగా మొదట తలలు, తర్వాత నడుములు, ఆ తర్వాత కాళ్లు బయటపడుతూ ఒక్కొక్కరే విద్యార్థులు పైకివచ్చి పైనవున్న తోటి విద్యార్థులు ఇచ్చిన దారిగుండా వెళ్ళిపోతున్నారు.

ఆ గుండ్రంగా దిగిపోయే ఇనపమెట్లమీదుగా ఒకరు దిగిపోతూ మరొకరు పైకివస్తూ ఒకరిని ఒకరు దాటిపోవచ్చు పురుషులయితేమటుకు. లేక ఇద్దరూ స్త్రీలయినా ఫర్వాలేదు. అంతేగాని ఒక స్త్రీ కిందికిపోతుండగాగాని, పైకివస్తుండగాగాని ఒక పురుషుడు అదేసమయంలో పైకి వస్తూగాని కిందికి పోతూగాని మధ్య ఒకరిని ఒకరు దాటిపోవటానికి పురుషుడికి అభ్యంతరంలేకపోయినప్పటికీ స్త్రీ సమ్మతించదు. స్త్రీకి సమ్మతం వున్నప్పటికీ అభాజనుడైతే పురుషుడికి సమ్మతంవుండదు. ఇద్దరికీ సమ్మతం వున్నప్పటికీ అలా చెయ్యటానికి కాలేజీచట్టం ఒప్పుకోదు. కాలేజీకి అటువంటిచట్టం లేకపోతే ఎవడో వొకడు సైంధవుడల్లే అడ్డుపడి అలాంటిది జరగకుండా చెయ్యటం తప్పదు. ఏతావతా స్త్రీలూ పురుషులూ ఎంత సమానమయినప్పటికీ ఆ మెట్లమీద ఒకరినివొకరుదాటిపోరు. ఇంతవరకు జరగలేదు. ఒకవేళ స్త్రీ మెట్లుదిగి వస్తున్నప్పుడుగాని, ఎక్కివస్తున్నప్పుడుగాని పురుషుడు ఎక్కిపోతూగాని, దిగిపోతూగాని ఎదురుపడితే—ఇలా జరగటానికి బోలెడు వీలుంది, ఎందుచేతనంటే పైనున్నవారికి కిందినించి స్త్రీగాని, పురుషుడుగాని అసలువస్తున్నదీ లేనిదీగాని, అలాగే కిందివారికి పైనించి స్త్రీగాని పురుషుడుగాని అసలు వస్తున్నదీ లేనిదీగాని మెట్లు గుండ్రంగా తిరిగిపోవటంవల్ల తెలియదు—ఏమవుతుంది? ఏమయినా వకర్నివకరు దాటిమటుకు పోరు!

ఇంతలో పైకివచ్చే విద్యార్థులు అయిపోయినారు. రెండు సెకండ్లు వూరుకుని ఆ బ్రాహ్మణుడు ఆమెకు 'పద' అన్నట్లు సౌంజ్ఞ చేశాడు. ఆమె కాలు మెదిపిందో లేదో మళ్లీ ఇంకోడు పైకివచ్చాడు.

'ఇంకా ఎవరన్నా వున్నారా కింద?' అన్నాడా బ్రాహ్మణుడు ముక్కోపంతో.

'చాలామంది వున్నారండి!' అన్నాడతను.

'పైకి వస్తున్నారా?'

'తెలీదండి!'

ఒక్క నిమిషం ఆగారు. ఎవరూ పైకిరాలేదు. ఎవరో శాస్త్రి వెనక 'రైట్' అన్నారు. విద్యార్థులలోనించి బయలుదేరబోయే కలకలారావమంతా ఆ బ్రాహ్మణుడు చూచిన శబ్దవేధి చూపుతో పాంగేపాలమీద నీళ్ళుపోయగానే అణిగిపోయినట్లు అణిగిపోయింది. ఏమనుకున్నాడో ఏమో, 'పద' అని ఆమెను మూడుమెట్లు దిగనిచ్చి ఆ వెధవకూత వచ్చిన వేపేచూస్తూ దిగిపోయినాడు. శాస్త్రికి కనపడ్డది ఆఖరుకు ఆయనకన్నులు, తర్వాత భాగంలో అతనికి అభిరుచి లేకపోయింది.

అందరూ దిగనిచ్చిం తరవాత 'ఆమె ఎవరూ?' అని అడిగాడుశాస్త్రి శాస్త్రస్నేహితుడిని.

'మన క్లాసేలే!' అన్నాడతను.

'ఆమె పేరు?'

'రాధిక!'

'ఆయనెవరు?'

'తెలుగు లెక్చరర్—దీక్షితులుగారు.'

'ఆమెకు చుట్టమా?'

'ఆమె విద్యార్థిని, ఆయన లెక్చరర్. మనకు తెలిసినంతవరకు అంతకంటె బాంధవ్యంలేదు. విద్యార్థినులను విద్యార్థులబారినుండి తప్పించటం ఆయనకు హాబీ, ఆ అమ్మాయిని రక్షించటం ఆయనకు విధి! అయితే ఈయన కాన్వాయిపద్ధతి కొంతమంది స్త్రీలకే ప్రాణసంకటంగా వుంటున్నప్పటికీ మొత్తంమీద గుణం కనిపించకపోలేదు. ఆమె అంటే ఆయనకు ప్రాణం!'

'ఆ చికిలి కన్నుల చకోరాక్షి!'

అతను శాస్త్రివంక ఒక్క నిముషం చూశాడు జాలిగా!

'అప్పుడే అయిందీ! ఆమెతో నీవు వెరిమొర్రివేషాలు ఏమైనా వేసినా వట్టాయినా నీకూ, ఆయనకూ గట్టిరంధిపడుతుంది తెలుసా? ఆ తర్వాత ఆయన నిన్నేమీ చెయ్యకుండా ప్రిన్సిపాలుకాదు కదా బ్రహ్మదేముడు ఆపలేడు. ఆమెకు సంగీతం చెప్పుతున్నాడనో, చెప్పిస్తున్నాడనో విన్నాను. ఆమెను విపరీతమైన తెలివితేటలు కలదాన్నిగాచేసి, అన్ని

విషయాలలోనూ సాటిలేని మేటిగాచేసి, ఆమె అట్లా కావటానికి తనే కారణం అని లోకానికి అనుమానమే కలగనిచ్చి, ఎవరైనా ఆమెను అట్లా శీలవంతురాలిగా చేసినందుకు ఆయన్ని అభినందించబోతే 'నాదేమీ లేదండీ! అసలు బంగారం మంచిదికావాలి.', అని ఒక్క చిరునవ్వులో తప్పుకునేస్థితిలో ఎల్లప్పుడూవుండి, వొంటరిగామటుకు రాధికచేతనే అరగంటకొకసారి మెప్పుపొందాలని ఆయనకు వుంది! రాధిక గుణవతి అయిన ఏ సినిమాస్టారో, ఏ ఏసంబ్లీ మెంబరో,ఏ కళాశాలలోనో ఏ లెక్చరరోఅయి ఎవ్వరికీ మాట్లాడటానికికూడ అందక, ఏ ధనవంతుడినీ సమానంగా చూడక, ఏ అధికారినీ లక్ష్యంచెయ్యక ఎప్పుడైనా ఆయన ఇంటికి ఆ కుచేలుడి ఇంటికి సాక్షాత్తు ఆ శ్రీ కృష్ణభగవాను వేతెంచి నటుల ఏతెంచి పురజనులకూ, పురప్రముఖులకూ, రాష్ట్రీయాధికారులకూ ఆశ్చర్య సంభ్రమములు కలిగించిందనుకో! 'ఆ తార ఈ గోచిపాత రాయడింటికి ఎందుకు వెళ్ళెను' అన్న ప్రశ్నకు 'ఆమె అలాకావటానికి కారణం ఆయనే! ఆయన ఆమెకు గురువు' అని సమాధానం రాగానే 'ఔరారా' అని అందరూ ఆశ్చర్య చకితులుకారో? అది ఆయనకు ఇష్టం!'

'చాలా దాకా వుందే!'

'మరేమిటనుకున్నావు? ఈ సంగతి తెలియక ఒకడు ఆమెకు ఏదో వుత్తరం రాశాడు. వెధవ వుత్తరం ఎందుకు సాక్ష్యంగా? ఈలలు వేశో, ఒక కంటితో సౌంజ్ఞ చేశో, ఫలించకపోతే రెండు కళ్ళతోనూ, చివరకి తలతోనూ సౌంజ్ఞలు చెయ్యకా! అప్పటికీ లాభించకపోతే బిక్కమొహం వెయ్యటం ఉండనేవుందికదా! ఆపైని ఆమె యింటిచుట్టూ తిరగటం, మొదలైనవి ఆమెకే తెలిసేవి, ఇబ్బందిలేనివి బోలెడు చిటికెలుండగా వుత్తరం రాశాడు. మమ్మల్ని అడిగినా ఏదోవిధంగా వెలిగించేవాళ్ళం. అలాంటిదేమీ లేకుండా, వుత్తరం రాశాడు. పైగా, తనేరాసినట్టు తెలియటానికి సంతకము చేశాడు. ఆమె ఏంచేసిందనుకున్నావు? ఆ వుత్తరం చించి వీడిమొహాన పారేసి వుమ్మెయ్యకుండా, ఆయనకు చూపించింది. చూపించింది అని మా అనుమానం. మర్నాడు ఆయన వాడికి పదిరూపాయలు అసహ్యమైన ప్రవర్తనకు ఫైను వెయ్యటమూ, దొర పదిరోజులు

సస్పెండు చెయ్యటమూ జరిగినై. రేపటినుంచీ వాడూ వస్తాడులే కాలేజీకి! ఆయనకు తెలియకుండా ఆమె అనుగ్రహం సంపాదించాలన్న వుద్దేశ్యంతో ఆయన దగ్గిర గూఢచారులుగా చేరారు కొందరు. ఎవరు ఆమెవంక ఎప్పుడు ఎట్లా చూచేదీ ఆయనకు చెబుతుంటారు. ఆయన్ని గురించి ఎవరేమనుకునేదీ—ఏవిషయంలోనైనా సరే—ఆయనకు తెలియబరుస్తారు. అందుకని ఇవాళే చేరావుకనకనూ, రేపే ఇంటికిపోవటం నా కిష్టంలేదు కనుకనూ ఇదంతా చెప్పుతున్నా.'

'ఆమెజోలి నా కెందుకూ?'

'ఆమెను బాగా తర్ఫీదుచేసి ఆయనే వివాహంచేసుకుంటాడని గిట్టని వాళ్లు ఇద్దరుముగ్గురు కసితీర్చుకోటానికి పుకారు పుట్టించినా నిజమయి వుండదని నా నమ్మకం. ఆయనకు యాభై దాటాయి; ఆమెకు పదిహారు దాటాయేమో! అంతే! అదంతా వట్టిదికాని ఆయన బంధుకోటిలోనే ఎవరన్నా వున్నారేమోనని నా అనుమానం. ఈ కాలేజీలో ఆమెతో చదివేవాళ్ళని చూస్తేనే ఆయనకు కోపం!'

'చాలా ముఖ్యమైనది చెప్పావు!' అన్నాడు శాస్త్రి.

'ఫలితం దక్కినప్పుడు కదా?'

మర్నాడు శాస్త్రి గ్రూపు మార్చి రాధిక తీసుకున్న గ్రూపు తీసుకుని ఆమెవున్న క్లాసుకు వెళ్ళాడు. మన్నుతిన్న పాములే అదివరదాకా ఏదో చెప్పుతున్న దీక్షితులుగారికళ్లు శాస్త్రిని చూడగానే మెరిసినై!

శాస్త్రి పిల్లిఅల్లే ప్రవేశించి నిలుచున్నాడు.

'ఎవరు నీవు?'

'కాలేజీలో క్రొత్తగా చేరిన విద్యార్థిని!'

'ఎప్పుడు చేరావు?'

'నిన్న.'

'ఏం గ్రూపు?'

'మీ గ్రూపేనండి!'

'మరి నిన్న క్లాసుకు రాలేదేం?'

'నిన్న ఇంకో గ్రూపు తీసుకున్నానండి—ఇవ్వాళ మార్చాను.'

తోకతొక్కిన తాచల్లే లేచికూచున్నాడు దీక్షితులుగారు!

'కారణం ?'

'నాకు అది నచ్చలేదండి !'

'ఇది నచ్చుతుందని ఏమిటి నమ్మకం ?'

'ఇది నచ్చకపోతే ఇంకోటి తీసుకుంటానండి.'

'ఇందుకేనా నీవు కాలేజీకి వచ్చింది ?'

'దేనికండీ ?'

'రోజుకో గ్రూపు మార్చటానికేనా ?'

'కాదండీ !'

'మరి ?'

'అందరూ ఎందుకు కాలేజీకి వచ్చారో అందుకే వచ్చానండీ !'

'అందరూ చదువుకోటానికి వచ్చారు.'

'నేనూ అందుకేనండి !'

'మరి అందరూ నీకుమల్లే గ్రూపులు మార్చటం లేదే ?'

'అందరూ నాకు మల్లే మార్చటంలేదు కాని నాకు మల్లే మార్చిన వారు లేకపోలేదండి !'

'ఎవరు ?'

'ఈ క్లాసులోనే వున్నారు. మీకు మల్లే తెలుగు భాషని బోధించే వారు లేరన్నసంగతి జగద్విఖ్యాతమే కాకుండా నిన్న ఒకరు చెప్పగా విన్నానుకూడ. అప్పుడే మీ క్లాసుకు వద్దామనుకున్నాను.'

'ఎవరా చెప్పింది ?'

'నాకు పేరు తెలియదండీ !' శాస్త్రి చూపు దూరాన రాధికకు అతి సమీపంలో కూచున్న కొత్త స్నేహితుడిమీద పడ్డది. వాడు శరీర మంతా కళ్లు పెట్టుకు ఇతనివంక చూస్తున్నాడు బిక్క మొహంతో !

'నువ్వు నా క్లాసులో వుండటానికి నాకు అభ్యంతరములేదు కాని నువ్వు కొద్దిరోజులలోనే ఇంకో క్లాసుకు వెళ్ళిపోవలసివస్తుందేమోనని నా భయం.'

'ఎందుకని అండీ ?'

'నాకు చిలిపిచేష్టలు చేసేవారంటే మహా అసహ్యం. కావాలంటే వీరిలో ఎవరిని అడిగినా చెప్పతారు' అన్నాడు దీక్షితులుగారు ముందుకు

వంగి శాంతంగా.

ఇంతలో గంట కొట్టారు. దీక్షితులుగారు లేచి శాస్త్రివంక అలాగే చూస్తూ నిష్క్రమించాడు. ఆయన వెళ్ళాడో లేదో పదిమందివచ్చి ఇతని చుట్టూ మూగారు. ఒకడు ఇతని రొమ్ముమీద చెవిపెట్టి గుండె ఎలా కొట్టుకుంటున్నదో పరీక్షించాడు. అట్లా ఒకరితర్వాత ఒకరు పరీక్షిస్తూ వున్నారు. ఇంతలో తర్వాతి క్లాసుమేస్టరు వచ్చాడు. ఎక్కడివారక్కడకు వెళ్ళి చతికిలబడ్డారు.

కాలేజీ వదలగానే స్నేహితుడు శాస్త్రిని కలుసుకున్నాడు.

'నీకు గట్టిగుండె వుంది కాని లాభంలేదోయ్ బ్రదర్! నీకూ, ఈయనకూ యుద్ధం తప్పదనీ, దాని ఫలితం నీకే ఎక్కువ నష్టకరంగా వుంటుందనీ వామాక్షి చెప్పుతున్నది.'

'ఎందుకని?'

'ఏమిటా సమాధానాలు?'

'ఏమిటా ప్రశ్నలు?'

'వాటికి సమాధానం లేదు!'

'ఆయన అడిగినా?'

'మమ్మల్నెవర్నీ అట్లా అడగడేం?'

'మీరెవ్వరూ జవాబియ్యరు కనక!'

'మేం చేసేదే తెలివిగల పద్ధతి అంటున్నాను.'

'నేను చేసిందాంట్లో తప్పులేదంటాను!'

'నీ యిష్టం కాని జాగర్త. తర్వాత నేను చెప్పలేదనుకోవద్దు. ఆడదానికి మల్లే నాజూకుగా వున్నానుకదా తప్పించుకోలేనా అనుకుంటున్నావేమో!'

'మీరిట్లా వున్నారు కాబట్టే ఆయనట్లా చెలాయిస్తున్నాడు. మనవల్ల తప్పులేనప్పుడు భగవంతుడు మటుకు మన నేమిచేయగలడో నాకర్థం కాలేదు'

స్నేహితుడు పెదిమ విరిచాడు. రోజులు గడచిపోతున్నాయి. శాస్త్రి మామూలుగానే కాలేజీకి పోతున్నాడు. దీక్షితులిగారి కన్ను ఒకటి అతనిమీదికివున్నట్టు అతనికే కాకుండా అందరికీ కూడ తెలుసు నను

కున్నాడు. బయటికి శాంతంగావున్నా లోపల అగ్ని రగుల్కుంటూనే వున్నదని శాస్త్రి స్నేహితుడికి అనుమానంగానే వున్నది. దానికి తగ్గట్టుగా నిదర్శనాలు కనుపించకపోలేదు. శాస్త్రి ఆలిస్యంగా వస్తే దీక్షితులుగారు ఘోరమైన నేరంగా పరిగణించి సహించలేకపోవటమూ, శాస్త్రి పక్కవాడితో ఏది మాట్లాడినా బుస్సున తాచల్లే లేవటమూ, దేనినైనా సమర్థించబోతే శాస్త్రిని బలవంతాన కూచోపెట్టటమూ మొదలైనవి ఆ రోజు కారోజుకు వృద్ధి అవుతున్నాయి. ఇతరు లింకెవరు అలా చేసినా దీక్షితులుగారు ఆట్టే పట్టించుకోకపోవటమూ, శాస్త్రినే సహించలేకపోవటమూ శాస్త్రి స్నేహితుడు గమనించాడు. కారణమేమిటో అతనికి అర్థంకాలేదు. ఎవ్వరికీ అరంకాలేదు. ఆమాటకొస్తే, దీక్షితులుగారి చర్య శాస్త్రి స్నేహితుడికి అర్థంకాకపోయినా తప్పు శాస్త్రిదే అయివుంటుందని అతని అనుమానం. ఒకరోజున శాస్త్రిని నిలవేసి అడుగాడు. తనేమీ చెయ్యలేదని విసుక్కున్నాడు శాస్త్రి. అకస్మాత్తుగా శాస్త్రి స్నేహితుడికి ఒక ఆలోచన కలిగింది.

'నువ్వు కాలేజీలో చేరిన రోజున రాధిక మెట్లు దిగపోతుంటే ఎవరో 'రైట్' అనటం నీకు జ్ఞాపకముందా ?' అన్నాడు స్నేహితుడు.

'ఆ !'

'అప్పుడాయన ఆ శబ్దంవచ్చినవైపు చూచాడు జ్ఞాపకముందా ?'

'ఆ.'

'మన వెనక ఎవరో ఆ మాట అన్నారు. ఆయన మనవంక చూచాడు నీవు కనపడివుంటావు. నువ్వే అది అన్నావని ఆయనకు అనుమానం కలిగివుంటుంది. పాతవాళ్ళం మేము చెయ్యమని ఆయనకు పూరానమ్మకం ! నీది కొత్తమొహం కావటంచూసి అప్పుడేమీ చెయ్యలేకపోయినా డనుకుంటాను. తగినట్టు మర్నాడు నీవు ఆయనక్లాసుకు వచ్చావు. అందుకనే చిలిపిచేష్టలుచేసే వారంటే మహా అసహ్యం అన్నాడు, జ్ఞాపకముందా ?'

'ఆ !'

'ఆయన వుద్దేశం అనుమానించవలసిన సందేహంలేదు. నువ్వే ఆమాట అన్నావనుకుని సరి కొత్తవాడివి కావటంవల్ల అంత తేలికగా పోనిచ్చాడు. కాని అది బైటికి వస్తునేవుంది! నన్నయినా, నిన్నయినా అను

మానించాలి ఆ మాటన్నట్టు. నాకు ఇంకా వారంటు పుట్టలేదుకనుక ఆయన నిన్నే అనుమానిస్తున్నాడని నా నమ్మకం. మాశావా?'

'మరినే చేసిన తప్పేమిటి?'

'ఆయనకేం తెలుసు ఆ సంగతి?'

'అందుకని నన్నిట్లా చూస్తాడా?'

'ఆయనగుణం అది. అదీకాక ఫలాని తప్పు నేనుకాదు చేసింది అని చెప్పటానికికూడ వీలులేదు. ఇది ఎవరుచేసింది అని ఆయనకు అనుమానం లేకుండానే తెలిసినట్లయిపోయె!'

'వీలుంటేమటుకు వెధవ దీనికి ఆయనతో మొర పెట్టుకుంటామా?'

'మరి ఏమిటి చెయ్యటం?'

'మాట్లాడకుండా వూరుకోటమే!'

'దానివల్ల ప్రయోజనంలేదు. అసలు నువ్వు రాధిక తీసుకున్న గ్రూపు తీసుకోకపోతే ఆయన అంతటితోనే మరిచిపోయేవాడు. నువ్వు మర్నాటే ఆయన క్లాసుకు చేరితివి.'

'అయితే?'

'అదీకాక నువ్వు ఆయన అనుమానించినట్టు చిలిపిచేష్టలు చేసేవాడివే అయినట్లయితే ఆయనకింతబాధ వుండదు. ఎప్పుడో నిన్ను పచ్చడిచేసే వాడు. అట్లా కాక నువ్వు నిజంగా చిలిపిచేష్టలు చెయ్యనివాడవయి నప్పటికీ చేయనివాడివిలాగ కనిపించటంచేత నిన్నెట్లా సాగతీయాలో ఆయనకు అర్థంకాలేదు! మొదటి రోజున నీ మాటలుచూసి ఆయనకు అను మానం వేసివుంటుంది ఎవరో గడుసుపిండమేనని! ఆయనతో అదివర కలా మాట్లాడినవాడే లేకపోయె! అందుచేత తలకాయ లోపలికిదూర్చిన తాబేలులా వున్నావు ఆయన ప్రాణానికి. నేర్పరి అయిన దొంగవనీ, నీతో జాగ్రత్తగా వుండటం అవసరమేననీ ఆయనకు నమ్మకం కలిగిందని నా అనుమానం!'

'అదిమటుకు నిజం! ఆయనసంగతి పూర్తిగా స్టడీ చేసినట్టున్నావే?'

'ఇదంతా నా తెలివికాదు! నేను కిందటి ఏడాది ఆయనచేత డీటెయిన్ చేయించబడ్డాను. అదివరకు నేను నీకు చెప్పినట్టే ఇతరులు ఆయన్ని గురించిచెపితే నేను నమ్మలేదు. ఆయన దెబ్బతగిలిం తరువాతగాని ఆయన తత్వం నాకు బాగా అర్థంకాలేదు! ప్రతిసంవత్సరమూ ఆయన ఆగ్రహా

నికి ఎవడో వొకడు గురి అవుతూనే వున్నాడు.'

'నిజంగానా?' అన్నాడు శాస్త్రి.

వారంరోజులు గడవకముందే 'లెక్చరర్లతో అసహ్యంగా మాట్లాడి నందుకు' శాస్త్రికి రూపాయ ఫైనువేశాడు దొర! శాస్త్రిని యజ్ఞపశువు కింద కట్టేశారు విద్యార్థులంతా. శాస్త్రిమటుకు మాట్లాడలేదు. తన తప్పేమీలేదని దొరతో చెప్పనుకూడాలేదు. వెంటనే వెళ్ళి ఫైను చెల్లించాడు. పదిహేను రోజులలో మళ్ళీ రూపాయ ఫైనుపడింది. దొర పిలిచి 'ఏమిటి ఇది' అని అడిగాడు. 'మీకు తెలియనిదేముంది?' అన్నాడు శాస్త్రి.

'ఈ తడవ నీకు ఫైను ఒక్క రూపాయతో పోదు. యూ ఫైయేళ్ళ లెక్చ రర్ను అవమానించటానికి నీవెంతవాడివి?'

శాస్త్రికి కాలేజీ అన్నా, లెక్చరర్లన్నా అసహ్యంవేసింది. అతనెంత వుత్సాహంతో పొలం అమ్మి కాలేజీలో చేరాడు! అతను కట్టిన మేడ లన్నీ ఏమయిపోయినై?

ఒకరోజున ప్రిన్సిపాల్ దొర అందరినీ హాలులోకి హాజరుకమ్మని నోటీసు ఇచ్చాడు. అందరూ చేరింతరువాత దొర శాస్త్రిని పేరుపెట్టి పిలిచాడు. శాస్త్రి ఏదో వచ్చిందనుకుని నిలబడ్డాడు.

'నీమీద ఒక అపరాధంవచ్చింది. వూళ్లో విషయాలు కథలుగానూ, పద్యాలుగానూ రాసేవాళ్లున్నారు. ఒక పుస్తకంలోనించి ఒక విష యాన్ని తీసుకుని స్వంతవిషయమల్లే అక్కడక్కడమార్చి చెత్తసాహి త్యాన్ని సృష్టించేవారున్నారు. కాని నీకు మల్లే మూలానికి మూలంఎత్తి స్వంతపేరుతో ప్రకటించే వాళ్లుండరని నా నమ్మకం! కాలేజీ తరపున ప్రకటిస్తున్న పత్రిక ఇలాంటి రచనలకూ, రచనచేతకాని రచయితలకూ నిర్దేశించబడిందికాదు. రచనాశక్తి వున్నవాళ్లు తమ శక్తిని పదును పెట్టుకోటానికే ఇది వుద్దేశించబడింది. మొన్న వెలువడిన సంచికలో నీపేరుతో ప్రచురించబడిన పద్యాలు నీవికావు. నీవుచేసిన దొంగతనం బైటపడదని నీకెలా ధైర్యం కలిగిందో నాకు ఆశ్చర్యంగావుంది! ఇలాటి పని చేసినందుకు నీవేమి చెప్పుకుంటావో నీ స్నేహితులముందు చెప్పుకో వలిసింది' అన్నాడు ప్రిన్సిపాల్. హాలంతా నిశ్శబ్దం అయిపోయింది.

అందరూ ఆశ్చర్యంగా అతని వంక చూచారు. శాస్త్రి మెల్లి గా వెళ్ళి బల్ల దగ్గిర నిలబడ్డాడు. అతని మొహాన కత్తివాటు వేస్తే నెత్తురు లేదు!

'ఇది చాలా అన్యాయం!' అన్నాడు అతను మెల్లిగా. 'నా పేర అచ్చుపడిన పద్యాలు దొంగిలించినవని చెప్పగలిగిన పండితులెవరో నాకు తెలుసు. మీ అందరికీకూడ తెలుసునేమో. నేను దొంగతనం చేశానని అనుకున్నా నాకు జరపవలిసిన శిక్ష ఇటువంటిది కాదేమో. నన్ను దొర చీవాట్లు పెట్టవచ్చును. నాకు ఫైను వెయ్యవచ్చును. నేనుచేసినపని అందరికీ తెలిసేటట్టుగా నోటీసు ఇచ్చి నాకు అవమానం కలగ చెయ్యవచ్చును. కాని, దానితో వారికి తృప్తి తీరకపోవటంచేత ఇలా జరిపారేమో! వ్యాసాల్ని చోరీచేసినవారిగతి ఇంతేనన్నట్టు దాఖలాచూపించారు కాలేజీవారు! నేనుచేసినపని అంతఘోరమైనదా? దీనికింతఘోరమైన అవమానం చెయ్యాలా? కాని దొరగారు వారంతటవారు ఇలాచేసి వుంటారని నేను అనుకోను. నా మీద ఏ కారణంవల్లనో క్రోధరసం తలకెక్కినవాడు ఈ చాడీ చెప్పివుండాలి! కాని, అతనికోరిక తీరనందుకు నేను, విచారపడుతున్నాను. అతనెంత తెలివికలవాడయినప్పటికీ ఇక్కడ పప్పులో కాలువేశాడు. అసలు సంగతి ఏమిటంటే, ఏ పద్యాలయితే నేను దొంగతనం చేశాననుకుంటున్నారో అవి నేను రాసిన పద్యాలే!'

'నీవు రాసినవా?' అన్నాడు దొర.

'అవును! కొన్నాళ్ళక్రిందట ఆ పద్యాలురాసినా అసలుపేరు పెట్టుకోటానికి సిగ్గుపడి మారుపేరుతో ఒకపత్రికకు పంపాను. నాకు ఆశ్చర్యం కలిగేటట్టు అవి అచ్చుఅయినై! అవే మళ్ళీ కాలేజీ పత్రికకు పంపాను. అచ్చయినవే పంపానన్న నేరం నామీద మోపబడితే నా కభ్యంతరంలేదు. నా కంతకంటె తెలివితేటలులేవు! అసలుసంగతి అది!'

విద్యార్థులొక్కసారి గొల్లుమన్నారు.

'అవి నీవేనని ఋజువుచెయ్యగలవా?' అన్నాడు దీక్షితులుగారు ముఖం మడతలుపడేసి.

'ఆ పని చెయ్యాలిసింది మీరు!' అన్నాడు శాస్త్రి.

దీక్షితులుగారు మండిపోయినారు. తనమీద ఒక కుర్రాడు మరచి

పోని దెబ్బతీశాడు. ఆ రోజునించీ ఆయనక్లాసులో విషంకక్కేవాడు పూరికే నే. రెండురోజులు పాఠం ఇలా తగలపడి పోవటంచూసి ఇద్దరు ధైర్యంచేసి దీక్షితులుగారు చెప్పేది ఏమీ అర్థంకావటంలేదని సవినయంగా మనవిచేశారు. కాని వారిరోదనం అరణ్యరోదనం అయింది.

చాటుగా పదిమంది విద్యార్థులుమటుకు శాస్త్రిని వేనోళ్ళ పొగడారు. కాని శాస్త్రికి ఆవిధంగా తృప్తికలగలేదు. అతను చేసింది ఏముంది? దీక్షితులుగారు ఆయనంతట ఆయనే గోతినపడ్డాడు. అతనంతట అతను చెయ్యగలిగినప్పుడుగా!

ఇంతలో College Day దగ్గిరిక వచ్చింది.

'దీక్షితులుగారు సంగీతంలో గెలిచినవారికి నూరు రూపాయలు బహుమానం ఇస్తారట. ఆయనకు సంగీతం అంటే ఎంతప్రీతి?' అన్నాడు స్నేహితుడు శాస్త్రితో.

'అదికాదు. రాధికకన్న ఎవరూ బాగాపాడలేరని ఆయన నమ్మకం. నిజం అయితే కావచ్చుకూడా. రాధికకు ఈ విధంగా బహుమానం ఇయ్యాలన్న వూహవుంది ఆయనకు.'

'అరి వీడి తస్సా చెక్కా! నువ్వు చెప్పింది నిజమేనోయి!'

'అయితే అలాజరగదు!'

'ఎందుకని?'

'దీక్షితులుగారి కోరిక నెరవేరటం భగవంతుడి కిష్టంలేదు కనక!'

'అంటే?'

'అంతే!'

హాలంతా నిశ్శబ్దంగావుంది. వూళ్ళో కొంతమంది పురప్రముఖులుకూడ విచ్చేశారు. దీక్షితులుగారి మొఖం చాటల్లే అయివుంది. తన శిష్యురాలు పైకి రాబోతున్నది! మొదటి బహుమానాన్ని నిర్ణయించుటకు ఏర్పాటు చేయబడ్డవారిలో దీక్షితులుగారొకరు.

ప్రిన్సిపాల్ లేచి సంగీతంపోటీ ప్రారంభం కావచ్చుననీ, ఆ కాలేజీలో చదువుకునే వారెవరైనా వచ్చి పదిహేను నిమిషాలకు మించకుండా పాడవచ్చుననీ, మొదటి బహుమానంవచ్చినవారికి నూరురూప్యముల కిమ్మతుగల బహుమతి ఇయ్యబడుననీ సెలవిచ్చాడు.

సంగీతంలో అభిరుచిగల యువకు లిద్దరు ముగ్గురు మొదటి బహు

మానం రాదని తెలిసికూడ పాడారు. సభికులు అభినందించారు. అసలు బహుమానం జగన్నాథానికి తప్పదని అందరికీ తెలుసు. అతను కాలేజీలో అందరిలోకీ పేరుపొందినవాడు. ఇద్దరు విద్యార్థినులుగూడ గానం చేశారు. సభికులు పాట బాగుండకపోయినా మనుష్యుల్నిచూచి మెచ్చుకున్నారు. జగన్నాంథంవచ్చాడు. పాడకముందే చప్పట్లు! రెండు రాగాలు విదలించి పారేశాడు. హాలంతా మారుమోగిపోయింది కరతాళ ధ్వనులతో. తర్వాత రాధిక వేదిక నలంకరించింది. హాలంతా నిశ్శబ్దం! ఆమె పోటీచేసేవారిలో ఒకరనుకోలేదు అసలు విద్యార్థులు! సంగీతం నేర్చుకుంటున్నదని అందరికీ తెలుసుగాని ఇలా బయటపడుతుందని ఎవ్వరూ అనుకోలేదు! సన్నని గొంతుతో పాడింది. సభికులు ఆశ్చర్య పోయినారు. ఆమె పాడటమేకాకుండా బాగా పాడుతున్నది. రెండు కీర్తనలు పాడింతరవాతగాని అందరికీ అర్థంకాలేదు ఆమె జగన్నాథం కంటె చాలా అందంగా పాడుతున్నదని. మూడోకీర్తనపాడి ముచ్చటగా ముక్తాయింపుతో ముగించి నమస్కరించి దిగివెళ్ళిపోయి యథా స్థానంలో కూర్చుంది. దీక్షితులుగారి ఆనందానికి మేరలేదు. ఆయనలేచి ఏదో చెప్పదామనుకున్నాడు. కాని శాస్త్రి జనాన్ని సర్దుకుంటూ తన వైపు రావటంచూసి ఆగాడు. శాస్త్రిదగ్గరకువచ్చి ఆయనకు నమస్కరించి వేదికఎక్కి సభికులకు నమస్కరించి కూచున్నాడు. పిలవకుండా ఎవరైనా భోజనానికివచ్చి పీటముందు కూచుంటే మనకు కలిగేటంత ఆశ్చర్యం కలిగింది దీక్షితులుగారికీ, శాస్త్రిని ఎరిగిన అందరికీ. రాధిక పాడటమే ఆశ్చర్యంగావుంది విద్యార్థులకు. ఇప్పుడు శాస్త్రి పాడబోవటం దీక్షితులుగారికి కూడ ఆశ్చర్యంగావుంది. మాట్లాడకుండా ఆయన కుర్చీలో చలికిలబడ్డాడు కానున్నది కాకమానదని.

శాస్త్రి పాడాడు. ఆదివరకెన్నడూ అతను అందరిలో పాడలేదు. ఇప్పుడూ అతను పాడకుండా వుండేవాడే. కాని అతని అంతరాత్మ అతన్ని ముందుకు నెట్టింది. అతనికి తప్పలేదు. చివరవరకూ పెనగులాడాడు అంతరాత్మతో. లాభించలేదు. కళ్లుమూసుకుని పాడాడు ఒక్కటే కీర్తన. మొదటి వొకక్షణం అతని గొంతు వణికినట్టు అతనికి అనుమానం కలిగింది. కళ్లు తెరిచాడు. ఎర్రబడి మంటపడుతున్నాయి అతని

నేత్రాలు. అందరూ అతనివంక విచిత్రంగా చూస్తున్నారు. లేచి నమస్కరించి దిగాడు. మరుక్షణం హాలు బద్దలయిపోయింది చప్పట్లతో!

శాస్త్రి ఇంటికెళ్ళుతుండగా అతని స్నేహితులు దూరంగా తొలగి అతనివంక విచిత్రంగా చూడటం మొదలుపెట్టారు. పాతస్నేహితుడు మటుకు అతని చెయ్యిపుచ్చుకుని ఆపి 'ఎన్నడూ చెప్పలేదేం?' అన్నాడు.

'ఏమిటి?'

'నువ్వు పాడతావని!'

'ఎవరు పాడలేరు?'

'అంత బాగానా?'

'బాగుందా?'

'నీకు తెలియదూ?'

'నిజంగా తెలియదు. బాగుందని అనుమానమే! నేనెన్నడూ అంత మందిలో పాడలేదు!'

'ఇక మళ్ళీపాడకు!'

'ఏం?'

'అంత బాగుండదేమో!'

'ఆహా!'

'మొత్తంమీద భలేవాడివి నువ్వు!'

'దీనికేనా?'

'ఇంటికి వెళ్ళుతున్నావా?'

'ఆ!'

'బహుమానం తీసుకోవూ?'

'ఇంకా రెండుగంటలున్నది కదా. ఈ లోపల వాళ్ళు ఏదో నాటకం ఆడుతారు. కలెక్టరు బహుమానా లియ్యటానికి వచ్చేటప్పటికి నేనూ హాజరవుతాను. ఇంటికెళ్ళివస్తాను. తల తిరుగుతున్నది.'

నాటకం మంచి రసకందాయంలో వుంది. కలెక్టరూ, ఇంకా ఇతర స్త్రీపురుష ప్రముఖులూ చాలామంది వచ్చారు. గిరీశంకో సేస్తున్నాడు ఏమిటేమిటో మధురవాణితో. దీక్షితులుగారు గాలికోసం బయటికి వచ్చాడు. వరాండాలో ఒక స్త్రీ, ఒక పురుషుడూ నిల్చునిమాట్లాడుతున్నారు. స్త్రీ

లంటేనే వుబలాటపడే దీక్షితులుగారి హృదయం ఎగిరి గంతేసింది. వారిని సమీపించాడు.

'ఏమోయ్ రామమూర్తి! ఇప్పుడేంచేస్తున్నావు?' అన్నాడు దీక్షితులుగారు ఆశ్చర్యంతో.

'ఇంటిదగ్గరే వుంటున్నానండీ. ఏదో మీ అనుగ్రహం!' అన్నా డతను.

రెండు సంవత్సరాల క్రిందట తను అతనిని డిటెయిన్ చెయ్యటంలోని డిటెయిల్స్ బాగా జ్ఞాపకంలేక పోయి నప్పటికీ దీక్షితులుగారు అసలు సంగతిమటుకు మరచిపోలేదు.

'ఆమె ఎవరు?' అన్నాడు పక్కనున్న యువతిని చూస్తూ.

'మా చెల్లెలు మద్రాసులో చదువుకుంటున్నది.'

'మన కాలేజీవుండగా అక్కడికి పంపావేమి అని అడగటానికి ధైర్యం లేకపోయింది ఆయనకు. Art for Art sake గా యువతీమణులతో తిరిగే ఎమెచూర్స్‌లో దీక్షితులుగా రొకడు. స్త్రీలకు, ముఖ్యంగా యౌవనంలోవున్న నవోఢలకు ఇచ్చే గౌరవం, చూపే మర్యాదా ఆయన ఇంకెవరిమీదా చూపడు. ఆమె ఆయన్ని ఆకర్షించింది. కళ్ళజోడులోనించి ఆమె విశాల నేత్రాలతో ఆయనను చూడగానే ఆ ఎలెక్ట్రిక్ లైట్ల వెలుతురులో ఆయన ముగ్ధుడయిపోయినాడు. ఏమిష మీద ఆమె హస్తాన్ని స్పృశించగలడు? వంగపండురంగు చీరతో, ముంగురులు నాజూకుగా మొహంమీదికి వాలుతో పార్సీయువతిలా నెత్తిన ముసుగుతోవున్న ఆమెను చూస్తుంటే దీక్షితులుగారి అంతరాత్మ మూలుగుతున్నది.

'పేరు?' అన్నాడు దీక్షితులుగారు.

'ఎవరి పేరు?'

'ఆమె పేరు?'

'జయజయవంతి!'

'ఆ!'

'అదోరాగం పేరు. అదంటే ఈమెకు ఇష్టం. ఆపేరే ఈమె పెట్టుకున్నది!'

'బాగుంది!'

'వస్తామండీ, శెలవు' అంటూ రామమూర్తి చెల్లెలుతోసహా హాలులో

ప్రవేశించాడు. పోతూపోతూ జయజయవంతి దీక్షితులువంక చూచింది. కళ్ళజోడు తీసి మొహమంతా తుడుచుకుని దీక్షితులు ఎన్నడూ ఎరగని ఆవేదనతో వానరంతోడి తేవాలమువలె హాలులో ప్రవేశించాడు. నాటకం అయిపోయింది. హాలంతా హడావిడిగావుంది. ఈ సంక్షోభంలో ప్రిన్సిపాల్ లేచి నిలబడ్డాడు. అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

'ఈ రోజు నాజన్మలో మరచిపోను! ఇంత జయవంతంగా ఈ రోజు నేనెరిగివుండగా ఎన్నడూ జరగలేదు. గెలిచినవారికి బహుమతులు ఇయ్యటానికి అంగీకరించి ఇచ్చటికి విచ్చేసి మాకు ఆనందం కలగజేసిన కలెక్టరుగారికి మేము కృతజ్ఞులం. బహుమతిపొందిన వారందరూ వచ్చి వారివారి బహుమానాలను తీసుకుపోవాలెనని కోరుతున్నాను.'

మాట్లాటటం కాగానే అందరూ కరతాళ ధ్వనులుచేశారు. ప్రిన్సిపాల్‌గారు నిలబడి బహుమతి పొందినవారిని పేర్లుపెట్టి పిలిచాడు. ఒక్కొక్కరే వచ్చి బహుమానాల్ని తీసుకుపోతున్నారు.

'రామశాస్త్రి—సంగీతం మొదటి బహుమానం!' ఎవ్వరూ రాలేదు. ప్రిన్సిపాల్ మళ్ళీ పిలిచాడు. ఎవ్వరూ రాలేదు.

'సుబ్బారావు—ఫాన్సీ డ్రస్సుకు మొదటి బహుమానం. వేషం పాములవాడు.'

సుబ్బారావు లేచి నిలబడ్డాడు.

'మొదటి బహుమానం రావలిసింది నాకు కాదండీ. ముగ్గురు జడ్జీలలో ఒక్కరైనా నన్ను గుర్తుపట్టగలిగారు, రామశాస్త్రిని ఎవ్వరూ గుర్తుపట్టలేక పోయ్యారు—'

'ఏడీ రామశాస్త్రి?' అన్నాడు ప్రిన్సిపాల్.

జయజయవంతి లేచి నిలబడింది. అందరూ ఆశ్చర్యపోయినారు. దీక్షితులుగారు నోరు తెరుచుకుని ఆమెవంక చూస్తున్నాడు. ప్రిన్సిపాల్ నివ్వెరపడిపోయినాడు. చెప్పినా గుర్తుపట్టటానికి వీలులేకుండావుంది రామశాస్త్రిణి! హాలంతా ఒక్కసారి గొల్లుమన్నారు!

'మొదటి బహుమానం రామశాస్త్రి!' అన్నాడు మారుమాట్లాడకుండా ప్రిన్సిపాల్ ఆ గోలలో.

దీక్షితులుగారివంక చూస్తూ శాస్త్రి ఆయనకు వళ్ళు జలదరించేటట్టు గాలిలో చేతిని ముద్దుపెట్టుకున్నాడు!

# కర్మకాండ

'ఇది రెండోసారి వాళ్ళింటికి వెళ్ళటం' అంది రాఘవమ్మ భర్తతో.

'వాళ్ళింటికి వెళ్ళటం ఇది రెండోసారే కాని బిచ్చానికి బయలుదేరటం ఇది ఎన్నోసారో!' అన్నాడు సత్యం.

'బిచ్చమేం ఖర్మం—ఎవ్వరికీ బాకీతీర్చకుండా వుండలేదే' అన్నది రాఘవమ్మ,

'నువ్వు చేసే బాకీలు తీరుస్తున్నాంకాని నేను చేసే బాకీలు తీరటం లేదు!'

'వారంరోజులు కాలేదు వాళ్ళింటో బియ్యం తెచ్చి. మళ్ళీ ఈశుక్రవారం పొద్దున్నే బియ్యానికపోతే—వాళ్ళుమటుకు ఎక్కడినించి తెస్తారు?'

'అదీ నిజమే. కాని మనం చెయ్యగలిగిందేమీ లేదు. నాకు జీతం వచ్చేటంతవరకూ బియ్యానికీ, నేతికీ మనం ఎక్కడికో అక్కడికి పోక తప్పదు.'

'ఎరిగున్నవాళ్ళ అందరి ఇళ్ళల్లోనూ మన ఖర్మం మనం బాకీ! నన్ను చూస్తేనే దేనికో వచ్చానని వాళ్ళకు అనుమానం. నిజంగా వాళ్ళని మొండటానికే నాకు మొహం చెల్లదు.'

సత్యం మనస్సు చివుక్కుమంది. అతని భార్య కావటంవల్ల రాఘవమ్మకీ ఖర్మం!

'మీరైనా ఎవరిదగ్గిరైనా వెళ్ళి పదిరూపాయలు తీసుకురారు. ఆ డబ్బుతో వెచ్చాలు తెచ్చుకుంటే ఈ తిరిపెం ఎత్తాలిసిన అవసరమే వుండదు.'

మురుగుగుంటలో ఈదేవాడికి దుర్వాసన దుస్సహం అయితే ఎలా జరుగుతుంది? సంభాషణ గాంధీ మహాత్ముడితో ప్రారంభం అయినా సత్యం వున్న ఇంటియజమాని దానిని తన ఆఫీసు, తన వుద్యోగం దగ్గిరికి లాక్కొచ్చేటట్లు సత్యం, రాఘవమ్మా తమ జీవితఘట్టంలో మొట్లు లెక్కపెట్టుకోవటం నిత్యకృత్యం. విసుగేసి వొక్కొక్కప్పుడు సత్యం ఆ వాసనను తప్పించుకోటానికికూడా ప్రయత్నించడు! అయితే భార్యా

భర్తలు ఒకళ్ళ కష్టసుఖాలు వొకరికి తెలియనీయకుండా వుంచటానికి ప్రయత్నం చేసినప్పటికీ వాళ్ళ ఆత్మగౌరవం మరీ మందస్థాయిలో వుండటంవల్ల అదిమామూలుగా కాబోయి అప్పుడప్పుడు తారస్థాయిలోకి పోవటంకద్దు. కేవలం రాఘవమ్మద్వారా జరగాలిసిన తిరిపెం ఆమె జరుపుతున్నప్పటికీ అందులో నాజూకులు భర్తకు తెలియనిచ్చేది కాదు. కాని అర్థంచేసుకోలేనంత పరమనిర్భాగ్యుడు కాకపోవటంవల్ల సత్యం భార్యను ప్రేమించాలిసిన వయస్సులో గౌరవించటం జరుగుతున్నది! సంసారం లేకపోతే తన కింత బాధ్యత వుండదేమోననిపించేది కాని ఆ ఈ భార్య లేకపోతే పరిస్థితి మరీ ఘోరంగా వుండేదని సత్యం నమ్మగలిగాడు. భార్యను చూచినప్పుడల్లా సత్యం తన అదృష్టం అంతా భార్యా రూపంలోనే వుందని భావించేవాడు. ఆమె తనకారణంగా అవస్థ పడుతున్నప్పటికీ అతని అభిప్రాయం మారలేదు. 'పెళ్ళి చేసుకున్నవారంతా పడుతున్న సుఖం నాకు లేదనా నీ విచారం?' అని ఒక బ్రహ్మచారి స్నేహితుడు సత్యాన్ని నిలవేశాడుకాని భార్యలేకుండా ఆ స్నేహితుడు పడుతున్న సుఖంకంటె సత్యం ఏనాడైనా రాఘవమ్మతో కష్టాన్నే అనుభవించటానికి కోరుకుంటాడని ఆ స్నేహితుడికేకాదు, ఎవ్వరికీ తెలియదు. తను లేకపోతే ఇంత కష్టం వుండేది కాదేమోనని ఒక సమయంలో అని రాఘవమ్మ కాబట్టి తప్పించుకుందికాని మగాకైతే సత్యం చీల్చివుండును!

తన సంగతి ఆవతలపెట్టి, తనకేమీ చెప్పటంలేదని రాఘవమ్మ మధ్య మధ్య సత్యాన్ని సాధిస్తుంది! బియ్యం తేవటానికే తన కింత బాధగా వుంటే ఆ బాకీతోపాటు వందబాకీలు తీర్చటానికి అవసరమైనడబ్బు తేవటానికి సత్యం ఎంతబాధ అనుభవిస్తున్నాడోనని ఆమెకు అనుమానమే కాని నిజం తెలియదు. సత్యం ఎప్పుడూ చెప్పలేదు. ఒకసారి సత్యం అయిదు రూపాయలు ఒకాయనదగ్గిర అప్పుతీసుకున్న సంగతి వూరంతా తెలిసిందని రాఘవమ్మకు తెలియదు. అంత నిర్భాగ్యుడిదగ్గిర నవంటి భాగ్యవంతుడు అక్షరాలా అయిదురూపాయలు అప్పుతీసుకోవటం వింత సంగతో, లేక అయిదురూపాయలు లేకుండా జీవితం గడపలేక పోవటం

వింతసంగతో సత్యానికి తెలియలేదు. ఇచ్చే వాడుంటే ఇంకా తీసుకోవటానికి అతనికి అభ్యంతరం లేదుకాని పావుబస్తా బియ్యం కొనటానికి డబ్బు అప్పు అడిగితే ఒకాయన సాయంత్రానికి వాయిదావేసి రెండు మానికలకు సరిపొయ్యే డబ్బు చేతిలో పెట్టినప్పటినుంచీ అతను ఎవ్వరినీ అయిదురూపాయలువించి అడగలేదు. ఆ రెండు మానికల బియ్యానికి సరిపోయే డబ్బు అయినా తీసుకోకపోతే తనకు అహంకారం జాస్తిగా వుంది అని అవతలాయన అభిప్రాయపడతాడేమోనన్న భయంతో సత్యం తీసుకున్నాడు. కాని నిజంగా ఆ వచ్చే బియ్యం అప్పుకిందనే పోతయ్యి కాబట్టి ఆ డబ్బును తీసుకోవటమే సత్యానికిష్టంలేదు! తను అయిదు రూపాయలు అప్పు తీసుకున్న సంగతి పురందరికీ తెలిసిందని తెలియగానే సత్యం అప్పు చెయ్యకూడదనే తేల్చుకున్నాడు. డబ్బు అయితే అప్పుచెయ్యకపోవచ్చుకాని నెయ్యా, బియ్యం అప్పుచెయ్యకుండా (సత్యానికి అదృష్టవశాత్తూ వుద్యోగం దొరికినప్పటికీ) జీతం వచ్చేదాకా ఎలా జరుగుతుంది? సత్యానికి తెలిసివొచ్చిందేమిటంటే డబ్బూ, బియ్యం అప్పుచెయ్యటం దరిద్రానికి నిదర్శనంకాని పుస్తకాలూ, గ్రామఫోను ప్లేట్లూ, అభిప్రాయాలూ, తాత్కాలికంగానైనా, శాశ్వతంగానైనా అప్పుచెయ్యటం భాగ్యలక్షణమేకాక అప్పుచెయ్యటం కిందికిరాకూడదు. పుస్తకాలూ, ప్లేట్లూ లేకుండా జీవించటం అసంభవంకాని బియ్యం, నెయ్యా లేకుండా జీవించలేకపోవడమేకాక అప్పుచెయ్యకుండావుండటం సులభం.

అంత అనవసరమైన బియ్యానికీ, డబ్బుకూ అప్పుకోసం బైలుదేరితే జనం ఆశ్చర్యపోవటమేకాక తమ ఈసడింపు చూపించటంకూడా సహజ ధర్మం. బియ్యానికి అప్పుకువచ్చిన వాడిమీద చూపించకపోతే ఈ ఈసడింపు అంతా ఏంకాను? పుస్తకాలకోసం వచ్చినవారితో సిగ్గు నమలి 'మరొకరికియ్యకు' అనటం ఎలానూ తప్పదు! ఇక డబ్బుకోసం వెళ్ళేవాడికి ఈసడింపును ఆనందించకుండా చిన్నబుచ్చుకోవటానికి అధికారమేముంది? అంత గోరోజనం కలవాడు అప్పుకెందుకూ బయలుదేరటం!

సత్యం గ్రహించగలిగిందీ, అనుభవించిందీ రాఘవమ్మతో చెప్పలేదు.

సత్యం ఎవరిదగ్గరికైనా పోయి ఎందుకు పదిరూపాయలు బదులు తీసుకోడో రాఘవమ్మకు అర్థంకాదు. తను వెళ్ళితే దేనికో అప్పు కోసమే వచ్చినట్లు చుట్టుపక్కల ఆడవాళ్లు చూచినట్లే, సత్యం బజారులో కనపడితేనే మగాళ్ళంతా దూరేవారున్నట్లు రాఘవమ్మకు తెలియదు. సత్యం ఆ రోజున కనపడకుండావుంటే కోటిరూపాయల భాగ్యం లభించినట్లుగా భావించేవారు లేకపోలేదు. సత్యం కనపడితేనే హడలిపోయే వాళ్లున్నారు. సత్యం అడిగేది స్వల్పమేనని వారికి తెలుసు! సత్యం ఎలాగూ పెద్ద మొత్తాలు అడగనూ అడగడు, వాళ్ళు ఇయ్యనూ ఇయ్యరు. ఇచ్చేవాళ్ళకు పెద్ద మొత్తాలు ఇచ్చినా తాకట్లుగా, ప్రాంసరీనోట్లుగావుండి రాతంతు వుంటుంది. పావలా తీసుకుంటే సాక్ష్యం ఏమిటి? వాడిని మళ్ళీ ఎలా ఆ పావలా అడగటం? ఆ పావలా ఇయ్యటానికి సత్యంపోటి అహంకారంగల మనిషికి ఎలా బుద్ధిపుట్టుతుంది? ఇదంతా ఎందుకొచ్చిన రొష్టు అని సత్యానికి కనపడకుండానే వుండేవారున్నారు.

పామునుచూస్తే మనిషికెంతభయమో, మనిషినిచూచినా పాముకూ అంతే భయం! నిత్యజీవితంలో పామునిచూచి పామూ, మనిషిని చూచి మనిషీ భయపడకుండా తిరగటం జరుగుతూవుంటుంది. అయితే పాముల్ని మింగే పాములూ, మనుష్యుల్ని మింగే మనుష్యులూ లేకపోలేదు. తన సంపర్కమే ఇతరులకు ఎంత బాధాకరంగా వున్నదో సత్యం గ్రహించకపోలేదు. దాని కతను చెయ్యగలిగిందేమీ లేదు. ఒకవిధంగా సత్యం ఇతరులని తప్పించుకుతిరగటానికి అనేక కారణం అవటమేకాక ఇతరులు అతన్ని డబ్బు అప్పుఅడగటం జరగటం కూడా ఇంకోకారణం! స్వరాజ్యంవస్తే కోశాధిపతులుగానూ, ఆర్థిక మంత్రులుగానూ నియమింపవలసినవారైన బద్రిగాళ్ళు ఆ పరిసర ప్రాంతాలలో వుండటంవల్ల వారు వీథిమలుపుదగ్గర అకస్మాత్తుగా సత్యం కనిపించగానే మరోవీధిగుండా పోవటానికి వీల్లేక సత్యాన్ని తప్పించుకోటానికి మాత్రం కనిపెట్టారు. అతనెలాగూ అబ్బు అడుగుతాడుగనక వాళ్ళే ముందర అడిగితేసరి! డబ్బు అప్పుఅడిగేవాడిని డబ్బు ఎలా అప్పు అడగటం? వీథిమలుపునైనా కొంచెం ఎడంటంగా కనపడితే ఓ చిరునవ్వు పారేసి సత్యం తమని సమీపించేలోపల నడిచి పారిపోవచ్చు. అలా

కాక ముఖాముఖి, బాహాబాహీ ఎదురైతే అవతలవాళ్లు చచ్చారన్నమాటే! మొదట ఒకరిద్దరు తననే డబ్బు అడగటంచూచి సత్యం దిమ్మరపోయి నాడు. వారేదృష్టితో అతన్ని అడుగుతున్నారో అతనికి అనవసరం-తెలీదు. అతను డబ్బుఇచ్చేస్థితిలో ఎప్పుడూ వుండడు. కాని ట్రాముకు చిల్లరడబ్బులు లేవనేవాడిని తప్పించుకోవటం ఎలా? వాడు సినిమా హాలునించి ఇంటికి నడిచిపోవాలిసివస్తుంది. అణా అవసరం మహామహులకుకూడా వస్తుందని సత్యానికి తెలుసు. అయితే సత్యాన్ని అణా అడిగిన మహామహుడు అవసరం వచ్చికాదు అడిగింది—అవసరం తెప్పించుకుని! నలుగురితో సినిమాకెళ్ళేటప్పుడు ఎక్కువడబ్బులు జేబులో వేసుకెళ్లనవాడికే క్షవరం అవటం జగద్విఖ్యాతం. అందుకని తనమాత్రం—తన టిక్కెట్టుకు—ఖర్చు పెడితే ఆ శరీరాన్ని మిగతావాళ్ళు ఈడ్చి పారెయ్యలేకపోరు! ఇటువంటివాడి పాల్పడ్డాడు సత్యం. ఓ సమయంలో ఒక అర్ధణా ఇచ్చినవాడిని సత్యం అనుదినమూ స్మరించటం, మనసారా తనకు అర్ధణాతో చేయూత ఇచ్చిన వ్యక్తిని ధ్యానించటం సత్యం అనుభవంలోదిగనక అణా విలువ సత్యానికే తెలుసు. కొత్తగా బాగుకుందామని ఫ్రూళ్లోకి దిగిన మరోవ్యక్తి సత్యంసంగతి తెలియక రూపాయిఅప్పు పుచ్చుకుని పోయినాడు వొకసారి. ఇచ్చేశక్తిలేదని చెప్పటానికి అతను మరీ కొత్తవాడు కావడంవల్ల సత్యం ఆరూపాయి ఇయ్యకతప్పలేదు! ఆరూపాయి తీసుకున్న వ్యక్తి అన్నిచోట్లా, అందరితోనూ తన ఆర్థిక సూత్రాన్ని ప్రయోగించటం మామూలు. పరపతి లేకపోతే జీవితం దుర్భరమని, అనుభవంగా కాకపోయినా, గుర్తించిన మనిషి కావటంవల్ల పరపతి పుట్టటానికి 'మంచివాడు' అనిపించుకోవటం అని ముఖ్యమని గ్రహించి డబ్బు అవసరం లేకపోయినా డబ్బు తీసుకుని రేపు, లేక ఎల్లుండి ఇస్తానని నిమిషం హెచ్చు తగ్గులేకుండా సరియైన టైముకు తిరిగి ఇచ్చేవాడు అతను! డబ్బు తీసుకుంటే మనం అడగక్కరలేకుండా నే తిరిగి తెచ్చిఇస్తాడని ఆ వ్యక్తికి అమోఘమైనపేరు. తమాషా ఏమిటంటే అతనికి నిజంగా డబ్బు అక్కర్లేదుకనక పదిరూపాయలడిగి ఒక రూపాయి ఇచ్చినా తీసుకుపోతాడు! డబ్బు తిరిగి అడగక్కరలేకుండా ఇచ్చేస్తాడన్న పేరు అతను అవలంబించే సూత్రంలో ఒక ఆయువుపట్టు

అని ఎవరికీ తెలియదు. లోకంలో రివాజు ఏమిటంటే డబ్బు తీసుకున్న వాళ్ళు అడిగితే తప్ప ఇయ్యకపోవటం. అలాంటివాళ్ళ సిద్ధాంతం ఏమిటంటే 'మన అవసరముండి మనం డబ్బు అడిగితీసుకున్నాం—వాళ్ళకా డబ్బు మళ్ళీ తిరిగి కావాలిసివుంటే వాళ్లు దాన్ని అడిగితీసుకుపోవటం డెమాక్రసీ—న్యాయం.' అని. ఇంక కొంతమంది అడిగినా ఇయ్యరు. కొంతమంది ఇదివరకే ఇచ్చామంటారు! ఇలా అనేవాళ్ళ వుద్దేశం కీడెంచి మేలెంచమని! పొరబాటున వాళ్ళిదివరకే ఇచ్చేసివుండవచ్చుననీ, అటువంటప్పుడు అవతలవారికి జ్ఞాపకంలేక అడిగినంత మాత్రాన ఇస్తే మళ్ళీ ఇయ్యటం అవుతుందికాని ఇంకేమవుతుంది? అవతలవాళ్ళు ఘట్టిగా ఇయ్యలేదని చెబితే ఇచ్చేసెయ్యటానికి వీరి కెప్పుడూ అభ్యంతరంవుండదు. అందరూ కుండపగలగొట్టి డబ్బు తిరిగి ఇయ్యమని అడగరుకనక వీళ్ళు తిరిగి ఇయ్యకుండా తప్పించుకునే మొత్తాలు చాలా వుంటయి. పెద్ద మొత్తాలతో చిక్కు ఎప్పుడూ వుండదుకనక తికమకలూ, ఎక్కువ పై ఎత్తులు చిన్న మొత్తాలలోనే. ఇక వాయిదాలూ మొదలైనవి వుండనే వున్నయి. డబ్బు అప్పుతీసుకున్నవాడు అప్పిచ్చినవాడు కనపడితే వాడే వీడిదగ్గిర అప్పు తీసుకున్నట్టుగా మాట్లాడటంమాట అటుంచి 'నీదగ్గిర అప్పుతీసుకున్న సంగతి జ్ఞాపకంవుందిలే' అన్నట్టుగా అప్పిచ్చినవాడు కనపడగానే నవ్వి వెళ్ళిపోవటంకూడా కద్దు. తలతిక్కతో తిరిగేవాడిని డబ్బుఅడిగి తీసుకుని వాడు అడిగితే తప్ప తిరిగి ఇయ్యకూడదని నిర్ధారణ చేసుకునేవాళ్లున్నారు. వాడు అడగడూ—మరీ మంచిది! వకవేళ వాడు అడుగుతాడూ—వాడి తలతిక్క అణిగిందని వీళ్ళ వుద్దేశం! డబ్బు అడగటంకంటె తలతిక్కే ప్రాధాన్యంగా భావించేటట్టయితే వాడు అడగనే అడగడని వీరి విశ్వాసం!

ఏమైతేం, ఈ లోతుపాతులు తెలీని సత్యం ఇతరులు తన్ను డబ్బు అడగటం చూచేటప్పటికి ఖంగారు పడ్డాడు. తిరిగి ఇచ్చేసినప్పటికీ అనేక మంది దగ్గిర అతను డబ్బు అప్పుఅడిగి తీసుకున్నాడు. చాలా కొద్ది మందికి చాలా చిన్న మొత్తాలు అతను అప్పుఇచ్చాడు. ఎంతమొత్తమయినా అతను ఇచ్చే స్థితిలోలేడు. కర్తవ్యం సాధ్యమైనంతవరకు తప్పించుకు తిరగటమే—ఏకారణం వల్లనైనా సరే! అనేక మంది అనేకంగా అను

కున్నారు. వాళ్లు సత్యాన్ని ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారో వాళ్లకి తెలియటమే కాక వాళ్లు అలా చెయ్యటం తప్పనిసరికనుక న్యాయం అనికూడా నమ్మేవాళ్లున్నారు. అయితే సత్యం వాళ్లనిఎందుకు తప్పించుకునితిరుగుతున్నాడో వారికి తెలియదు. మొదట్లో అసలతను తప్పించుకొంటున్నాడనికూడ తెలియదు! ఎదురుపడినప్పుడు అతను వీరిని చూడటం వీరు చూచినట్లయితే ఆదారి వేరు. అతను వీళ్ళని చూడనట్టుగానే వుండే—అక్కడా వీరి మనస్సు చివుక్కుమంది! అతనేమంత మహా ఇదని వీరిని చూడకపోవటం—చూస్తే వీళ్లు పారిపోవటం అటుంచుదాం! ఒక్కొక్కప్పుడు సత్యం నిజంగా వీళ్ళని చూడకపోయినా వీరికీ బాధ తప్పలేదు. వీరనుకునే మాటలు సత్యందాకా రాలేదు. ఆడవాళ్ళల్లోకి వచ్చేటప్పటికి చూచాయగా రాఘవమ్మకు అర్థంఅయింది. అసలు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేగని రాఘవమ్మకు ఓ ప్రఖ్యాతి మహిళలలో వుంది! వాళ్లు దాచిపెట్టటానికి ప్రయత్నించే విషయాలే రాఘవమ్మ గ్రహిస్తుందని ఆడవాళ్లు గ్రహించినప్పుడు ఇక వాళ్ళు వోయ్యారంగా రాఘవమ్మకు తెలియపరచాలనే వుద్దేశంతో చెప్పే పలుకులు రాఘవమ్మకు అర్థంకాకుండా ఎలా పోతై? నిజంగా రాఘవమ్మ ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేటంతటి గండ్రకత్తెకాదు. కాని మురికిలాగా ఇరుగుపొరుగూ అమ్మలక్కల అభిప్రాయాలు వాసనేస్తుంటే ఏరాఘవమ్మ అయినా తేమటుకు గ్రహించకుండా ఎలా వుంటుంది? అయితే ఏవిషయమూ సత్యంతో చెప్పేది కాదు. అవతల ఇంటి డాక్టరుగారు అతన్నిగురించి అంతా ఏమనుకుంటున్నారోనని ఆయన పెళ్లాన్నే అడిగినట్టుగా సత్యం ప్రవర్తించకపోవటం చూచి సత్యం అంటే రాఘవమ్మకు ఎందుకో అభిమానం ఎక్కువయింది. ఆడవాళ్లల్లో అన్ని కబుర్లూ వస్తాయి కాబట్టి ఆడవాళ్ళు అనుకునే మాటలు వినాలని మొగవాళ్లు తహతహలాడటం సహజం! తాళంచెవి అక్కర్లేదని భార్యని పంపి, ఆ తాళం చెవికోసం ఆడవాళ్లున్న చోటికి ఈ మొగపురుగు వెళ్లగానే లోపలవాళ్ళు కిచకిచలాడుకుంటున్నా బైటవున్న వనితారత్నం ఎనభైమైళ్ల వేగంతో లోపలికిపోయి 'మీఆయన వచ్చాడు' అని చిదంబర రహస్యం చెప్పటం చూస్తే వొళ్లుపులకరించేవారున్నారు! అంతటితో ఆ కిచకిచలు ఆగి

మరింత సేపటికి ఆయన భార్యవచ్చి తాళంచెవి ఇస్తే అదోముచ్చట! ఇటు వంటివి అనేకరకాలు అనేకవిధాల కొన్ని మొగపురుగులు చెయ్యటం చూచి, మధ్యమధ్య సత్యాన్ని చూచి ఆశ్చర్యపోతుంది రాఘవమ్మ. అయితే ఏవిషయమూ, ముఖ్యంగా ఇతరులు ఆతన్ని ఏవిధంగా అనుకుం టున్నారోకూడా చెప్పదు ఆమె. అందువల్ల ఆమెపాతివ్రత్యాని కేమన్నా లోటు వచ్చిందేమో తేల్చాలిసినవారు ధర్మజ్ఞులు. అసలు రాఘవమ్మ చెప్పేదేకాని కొంతమంది ఆడవాళ్లను చూచింతరువాత ఆమె వృద్దోశం మార్చుకుంది. ప్రతి చిన్నవిషయమూ భర్తతో చెప్పటం, ఆడంగిరేకుల అచ్చమ్మకు మల్లే, భర్త అన్నివిషయాలూ ప్లీడరు సాక్ష్యాన్ని, రోగి గుణాల్ని పోగుచేసినట్టు పోగుచేసి 'మీ అందరి సంగతీ నాకు తెలుసులే' అన్నట్టు తిరగటం చూచి రాఘవమ్మకు రోతగలిగింది. మొగవాళ్లల్లో తిరిగి ఆడవాళ్ళవిషయాలూ, భార్యద్వారా ఆడవాళ్లల్లో తెలిసే మొగవాళ్ల విషయాలూ తెలుసుకోవటమే పరమావధిగా పెట్టుకుంటే బతికే దెలాగ? అయినా ఎవ్వరికీ తెలియని వేముంటయికనక!

అసలుసంగతి ఇటువంటి ఆలోచనలు కలగటానికీ, తెలుసుకోటానికీ సత్యానికి టైములేదు. ఇవన్నీ రాబడి అభివృద్ధి అయినకొద్దీ చేసే పనులు, లేక చేసే ఏర్పాట్లు. సత్యానికి బొటాబొటీగానైనా సంసారం వెళ్ళటం దుకు సంపాదించుకోగలిగితే చాలు అన్న యావతప్ప మరోటిలేదు. ఇక రాఘవమ్మ ప్రస్తుత సాంఘిక వాతావరణం తప్పించుకోలేని స్త్రీ. అయినా ఆమె సత్యానికి మల్లేనే తన దారి తాను చూసుకుంటున్నది. ఈ మహా సుడిగుండంలో ఈ భార్యాభర్తలు ఎవరికి వారుగా వుండీ, మామూలు సంసారాలలో మామూలుగావుండే ఏకత్వం, ఒక్కొక్కప్పుడు ఇతరుల మెప్పుకోసం కన్పించే అన్యోన్యత, నిజంగా విరుద్ధంగావుండి గుట్టుకోసం వ్యక్తంఅయ్యే గుంభనా, సత్యం, రాఘవమ్మలమధ్య లేకపోయినప్పటికీ అనేక సంసారాలలో కంటె అన్నివిధాలా ఆదర్శమైన గుణగంభీరత్వం వారిద్దరిమధ్యా వుంది. రెండుకత్తులు ఒక ఒరలో ఇముడుతయ్యి అని రుజువుచేసేటట్టుగా వుంటుంది వారికాపురం. వారిద్దరికీ ఒకరిమీద ఒకరికి నిజమైన అభిమానం వుంది. ఆ అభిమానమే వారి కున్న ప్రేమని పైకి రానియ్యకుండా కూడా తొక్కేస్తున్నది. ఆ పరిస్థితులలో మనకు

కావలసినట్లుగా వారి ప్రేమకు తావులేదు.

ఏనక్షత్రం ఏమాగ్ని చెందిందోకాని సత్యానికి ఉద్యోగం దొరికింది. ఏకారణాలవల్ల ఉద్యోగం దొరికినప్పటికీ ఉద్యోగం ఇచ్చిన మేనేజరు సత్యానికి ఇంత తిండి దొరికేటందుకు ఉద్యోగం ఇచ్చినట్టుగానే భావించినట్లు కనిపించాడు. యథార్థం అయితే కావచ్చునుకాని ఉద్యోగధర్మంలో సత్యంలో చాలా లోపాలు కనిపించినై. అనేక స్తంభాలు పోటీపెట్టినటువంటి డేరావంటిదైనప్పటికీ, ఆఫీసులో ఏ ఒక స్తంభం తీసేసినా డేరాకు ప్రమాదం లేకపోయినప్పటికీ ప్రతి స్తంభానికీ విలువ వుంది. సత్యం కూడా మరొక స్తంభం! అయితే కొత్తబిచ్చం కావటంవల్ల పని పట్ల అతని ఉత్సాహం తోడివాళ్ళ ఛలోక్తులకు గురిఅయ్యేది. అతని ఉత్సాహం లోపాలకిందికి మారింది. 'నిపని నీవు చూసుకో' అన్న మేనేజరు తనకు సంబంధించని పని చేయనందుకు సత్యాన్ని తప్పుపట్టాడు. బంట్రోతు దగ్గిర్నించి మేనేజరుదాకా సంబంధం వుందన్నాడు. ఇదంతా కుటుంబం అన్నాడు. ఏ ఒక్కడు తనకేమీ సంబంధంలేదన్నా పని జరగదన్నాడు. మళ్ళీ కొన్ని విషయాలు సత్యానికి అనవసరం అన్నాడు. అన్నిపనులూ సత్యమే చేస్తే కడంవాళ్లెందుకన్నాడు. ఏపనిలో, తను పూరుకోవాలో, ఏపనిలో తను వేలుపెట్టాలో సత్యానికి అర్థంకాలేదు. ఒక్కొక్కప్పుడు తనే మేనేజరుకు మల్లే ప్రవర్తించాలిసిన అవసరంకూడా వుంటుందని మేనేజరు సత్యానికి తెలియబరిచాడు. సత్యానికి తలతిరిగిపోతున్నది. 'ఎందుకొచ్చింది—ఇంటికెళ్ళి చక్కగా వుండు' అని కొంతమంది నంగనాచులు ఆకష్టాలన్నీ తాము అనుభవించాలిసిందేనన్నట్లుగా సలహా ఇచ్చారు. ఏమైనా సత్యం ఎవ్వరినీ లెక్కపెట్టదలచుకోలేదు. యాభై రూపాయలు ఎలా వదలుకోవటం?

సత్యం లెక్కవేశాడు. అతను చేరింది పదోతారీకు. ఆనెల ఇరవై రోజులకూ ముప్ఫయిరూపాయలుపైగా జీతం వస్తుంది. బ్రహ్మదేముడు వచ్చేది ఆనెలఖర్చు అంతకు మించకూడదు! సత్యం చేరకమునుపు పది రోజుల క్రిందనే చేరిన మరొకతనికీ, సత్యానికీ ఒకవిధమైన స్నేహం అయింది. ఇద్దరూ గుత్తపెళ్ళికొడుకులు! అయితే అతనికి నెలజీతం పూర్తిగా వస్తుంది. రోజులు గడుస్తున్నకొద్దీ సత్యానికి ఓవిధమైన 'ఇదీ'

జైలుచేరింది. అత నెన్నడూ అంతవరకు వుద్యోగం చేసి డబ్బు గడించలేదు. రేపు, ఎల్లుండి—జీతంరావటం ఖాయం. సత్యంచేరిన ఆఫీసులో జీతాలు ఒకటోతారీఖున ఇస్తారుకాని కొన్ని ఆఫీసులలో మళ్లే నెలఆఖరికే ఇయ్యరు. అయితే ఎంతముందర జీతంవస్తే అంతముందర ఖర్చుఅవు తుందని ఒకతను సత్యానికి వేదాంతం బోధించాడుకాని మళ్ళీ జీతం ముందరే వస్తుందిగదా అని ఆ నీతిపరుడు గ్రహించినట్టు లేదు.

జీతం వచ్చేరోజున లెక్కవేసి పెట్టాడు సత్యం—ఎవరెవరికి డబ్బు రూపకంగా ఎంత బాకో, బియ్యం, నెయ్యి ఇత్యాదులరూపకంగా ఎంత ఖర్చు వుందో, జీతం వచ్చిన మర్నాడు అన్నిపోను అతనిదగ్గిర అయిదు రూపాయలకన్న మిగలవు. దాంతో మళ్ళీ నెల ఎలా గడుస్తుంది? మళ్ళీ అప్పు తప్పదు. అయితే వుద్యోగి కావటంవల్ల అతనికి అప్పుఇయ్యటానికి ఎవరూ భయపడాలిసిన అవసరం లేదు. ఎంతో జాగర్తగా జరిపితే ఒక ఏడాది అయేటప్పటికి సత్యం అప్పుచెయ్యకుండా, వచ్చేజీతంతో నెల గడపటానికి అవకాశం వుంది!

సత్యం ఆఫీసులో జీతా లిస్తున్నారు. ప్రతివాడూ వెళ్ళి జీతం తెచ్చు కోవాలి. పెద్దజీతగాళ్ళు వాళ్ల జీతాల్ని తీసుకొని వెళ్ళుతున్నారు. జీతం తీసుకునేవాళ్ళల్లో సత్యంపేరు ఆఖరున వుండటం న్యాయం! కొంతమంది జీతం తీసుకోగానే చెల్లించాలిసిన బాకీలు అప్పుడే చెల్లించి వేస్తున్నారు. వసూళ్ళు చేసుకునేవాళ్ళకు అప్పుడు వసూలు చెయ్యకపోతే మరి నెలదాకా ఆగాలని తెలుసు! సత్యంస్నేహితుడు డబ్బుతీసుకుని గుంపులోనించి వచ్చాడు. అతని పెదిమలు తొట్రుపడుతున్నాయి—అతనికి కొత్తే జీతంపుచ్చుకోవటం. సిగిరెట్టు అతని పెదిమలమధ్య నిలవకుండా వుంది.

'నీ పేరు?' అన్నాడు ఎకౌంటెంటు.

'సత్యం!'

* * *

రాఘవమ్మ స్నానంచేసి అత్తిసరు పొయ్యిమీద పెట్టి, పిల్లవాడికిపాలుపట్టి నిద్రపుచ్చి కుంపటిని తాపీగా విసురుతూ కూర్చుంది సత్యం ఎప్పుడు వస్తాడా అని. వేళ కాలేదేమోనని అనుమానం వేసింది. కాని ట్రాములు తరచు ఆలస్యంగా రావటం రాఘవమ్మకు తెలియని విషయం కాదు. అయినా సత్యం వుద్యోగంలో ప్రవేశించిందిమొదలు ఏరోజూ అప్పటి వరకూ రాకుండావుండలేదు. అన్నంగిన్నె దింపింది. రాఘవమ్మకు ఏమిటేమిటో ఆలోచనలు వస్తున్నాయి. ఏడు, ఎనిమిది, తొమ్మిదిగంటలుకూడా దాటింది. రాఘవమ్మమనసులో ఓవిధమైన ఆందోళన బయలుదేరింది. ఎన్నిసార్లు పక్కింటివాళ్లను టైముఅడుగుతుంది? ఆకలేస్తున్నది. కాని సత్యం రాకుండా భోంచెయ్యటం ఎలా? అందులో అంత ముఖ్యమైన రోజున! దీపం తగ్గించికొంగు చెరుగుపరుచుకుని పండుకుంది. ఏరోజునా, ఏకారణంవల్లా సత్యం అంత సేపటివరకూ రాకుండాపోలేదు. రాఘవమ్మ మామూలుస్త్రీయేకనక అయితే ఆపాటికి కనీసం రెండుఇళ్లకు వెళ్లి బావురుమని ఏడవాలిసిందే. కాని ఆమె మామూలు వ్యక్తికాదు. తన దుఃఖం అంతా వినియోగించాలసిన రోజులు ఇంకాముందు వున్నయ్యని ఆమెకు అనుమానం. సత్యం ఇంటికి రానందుకుకాదు ఆమె విచారం—ఆరోజున అంతవరకూ అతనురానందుకు! అని విచిత్రంగా కనిపించవచ్చునుకాని సత్యం భార్యగా రాఘవమ్మ అనుభవించిన ఒకరకం జీవితానికి ఆసిలి ఆఖరుమెట్టు. కొద్దిగా తొందరపడుతున్నదేమో—ఆమె ఎక్కడికీ వెళ్లే స్థితిలోకూడాలేదు. అయినా భార్యలదగ్గరనించి భర్తలు తమలపాకులు పుచ్చుకునే వేళ అది! రాఘవమ్మ ఏడిచేదేమోకాని ఆదుఃఖం ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుండకుండా గండితెగిన మహానదీప్రవాహంమల్లే బ్రహ్మాండమైన మోతతో తప్ప బైటపడేటట్టు లేకపోవటంవల్ల రాఘవమ్మ ఏంబాధ అనుభవించిందోకాని అంతదాన్నీ అణిచిపారేసింది! ఆమెకు నిస్త్రాణకూడా ఎక్కువఅయింది. ఎక్కడో ఒకటి, రెండు—పదకొండు కొట్టింది గడియారం!

దభాలున తలుపు తెరుచుకున్న చప్పుడయింది. రాఘవమ్మ వులిక్కిపడి దీపం పెద్దదిచేసింది, తలుపు గడియవెయ్యటంకూడా మరిచిపోయి వుండాలి! సత్యం మెల్లిగా లోపలికి వచ్చాడు. ఒక్కక్షణం అతన్ని

చూచింది రాఘవమ్మ. అతని జుట్టు వానకు తడిసి చెదిరి చెంపలమీద పడుతున్నది. బట్టలు తడిసివున్నాయి. అతని నేత్రాలు మెరుస్తున్నాయి. అతనినుదుట్లో, చెక్కిళ్లలో, పెదిమలలో దరిద్రదేవత సౌందర్యం అంతా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది! రాఘవమ్మకు శరీరంమ్లులుమనినఖశిఖ పర్యంతమూ కొత్తరక్తం వరదలై ప్రవహించింది. అతను తలుపుగడియ వేసేటప్పటికల్లా ఆమె అతనిమీద విరుచుకుపడి అతని కంఠం కావిలించుకుంది.

రాఘవమ్మఏడుపు మాన్పటానికీ, ఆమె అతన్ని పెట్టుకునే ముద్దుల సంఖ్య తగ్గించటానికీ ఎంతో కొంత పట్టించోకాని సత్యం చాలా ప్రయాసలోపడ్డాడు. రాఘవమ్మ అలా ముద్దు పెట్టుకోవాలంటే అత నా స్థితికి రావాలన్నమాట! ఆమె అతనికి దూరంగా కూచోటానికే అంగీకరించలేదు.

'ఇంత ఆలస్యంగా వచ్చారేం?' అంది రాఘవమ్మ.

'ఇంత బేజారయిపోయినావేం?' అన్నాడు సత్యం.

'ఇంక నేను ఇక్కడ వక్కక్షణం కాపురం చెయ్యలేను!' అంది దీనంగా.

'ఏం?'

'నేను ఏదీ బాకీ తీసుకుగాను.'

'అలాఅయితే ఎలా కుదురుతుంది?'

'మీా రేమవస్థపడుతున్నారో నాకు తెలియదు కాని ఈ బాకీలు చేసినందుకు నేను యాతన పడుతున్నాను!'

'అలా అనుకుంటే ఎలా!'

'ఇవాళ జీతం వస్తుందని తెలుసుగదా—డబ్బుఅయితే ఇవాళే ఇయ్యగలంకాని బియ్యం ఇయ్యటానికి అవి కొనాలికదా—ఆవిడ సాయంత్రమే బియ్యానికవచ్చి కూచుంది! ఇదివరకు తీసుకున్న బియ్యం ఎప్పుడైనా ఎగకొట్టామా? ఇదివరకల్లా ఇచ్చినప్పుడే తీసుకుందికాని ఈరోజున అంత వోపికలేకపోవటం ఏమిటో?' అంది కొంచెం రోషంతో.

'అదా నీగోల! దరిద్రుడికి ఏదైనా ఇచ్చేవాళ్లు మళ్ళీ రాదనుకునే ఇస్తారు. కాని మళ్ళీ ఇయ్యగలడని తెలిసినప్పుడు ఆ ఇయ్యగలిగిన అవకాశంలోనే రాబట్టుకోవాలికాని సమయం దాటిపోతే అది రావటానికే

వీలుండదు—అదీ రహస్యం!'

'మనకు జీతంగా వచ్చేది డబ్బుగాని బియ్యం, నెయ్యీ కావుగా! మరి వాటికోసం ఈ రోజునే వచ్చి కూచుంటే అర్థం ఏమిటి?'

'బాకీవున్న దానివి నీకు ఈ ప్రశ్నలు వేసేటందుకు అధికారంలేదు. వాళ్ళ యావ వాళ్ళది. అడగటానికి వాళ్లకెప్పుడైనా అధికారంవుంది. దానికి నువ్వు తప్పుపట్టితే అర్థం ఏముంది?'

'దేనికైనా అర్థంవుండాలి. ఇన్నాళ్ళనించి లేనితొందర ఈ కాస్తలో దేనికి? బైటపడటం కాకపోతే?'

'బైటపడటం నువ్వా, వాళ్లా? బాకీలు చెయ్యటానికి అర్థంవుంటేమో గాని బాకీలు చెల్లించటానికీ, చెల్లించమనటానికీ అర్థం అనవసరం.'

'మనంకాబట్టి ఆవిడ అలా వచ్చి అడిగిందికాని డాక్టరుగారి పెళ్లాం అయితే అలా అడుగుతుందీ?'

'డాక్టరుగారి పెళ్లాం అసలు అప్పుచేస్తుందీ?'

'మంచిమాట! ఆవిడ అప్పుచేసేది బొగ్గులదగ్గిర్నించీ—మనమేనయం!'

'బొగ్గులకూ, బియ్యానికీ భేదం నీకు తెలియటం కొత్తగా వుంది! అయినా బొగ్గులు ఆవిడ ఇయ్యగలదు కాబట్టి ఇయ్యకపోయినా ఫరవా లేదు! మరి నువ్వు బియ్యం ఇయ్యలేవు. లేనిదానికోసమే ప్రజలు తహ తహ లాడటం సహజం. తర్వాత నువ్వు బియ్యం బాకీవున్నావని ఎన్ని సార్లు అయినా నీకు తెలియబరచటానికి వాళ్ళకు అధికారంవుంది.'

'మీ మాటలు అర్థంకావు! తీసుకున్న బియ్యం ఎన్నడూ ఎగకొట్ట లేదే?'

'ఎలా అర్థం అవుతయ్యి? ఈ రోజున నువ్వు యాభై రూపాయలు సంపాదించే గొప్పవాడి భార్యవయినావు. నే నింకా బాకీలు తీర్చేదాని భర్తనే!'

'అందుకనే నేను ఇక బాకీలు చెయ్యను.'

'అది ఎలాగూ జరగదు. అయినా ఇదివరకెన్నిసార్లు వాళ్ళడిగినా కోపంలేనిదానివి ఇవాళ ఇంతలో మారావేం?'

'ఆవిడ ఈ సాయంత్రమే బియ్యానికి రావటం నాకు కష్టంగానేవుంది!'

'ఎందుకు? నీవు ఆ బాకీ తీర్చగలవని ధైర్యంవుండటం మూలాన.

ఆ ధైర్యం లేనప్పుడు నీళ్ళు నమిలేదానివి. వాళ్ళకైనా నీవు తీర్చగలవని నమ్మకం చిక్కలేదు. ఆ నమ్మకం చిక్కినరోజున వాళ్లు నిన్ను అడగనే అడగరు!'

'ఆ రోజున నేను బాకీ చెయ్యను!'

'మరి రేపటినుంచే బాకీచెయ్యనంటుంటివి?'

రాఘవమ్మ ఆడఅహంకారానికి తృప్తి కలక్కపోగా హెచ్చవుతున్నది! ఆమె సత్యంవంక చూచింది. అతను మనస్సులో మాట బైటికి రానియ్యకుండా కేవలం తర్కంతో ఆమెను ఏడిపిస్తున్నట్టు అనుమానం కలిగింది. కాని సత్యం సత్యప్రమాణకంగా సత్యస్వరూపంతో కనపడ్డాడు. అతని మొఖంలో ఏవిధమైన కల్మషమేఘాలూ కనిపించలేదు. సత్యానికికూడా రాఘవమ్మ అంటే ఓ విధమైన ఆశ్చర్యం కలిగింది. భర్తలు స్వయంగా జీవనాధారం చేసుకోలేకపోతే భార్య భర్తకన్న ఎన్నివేలరెట్లు ఎక్కువ బాధపడుతుందో అతనికి అర్థం అయింది. భర్త స్వంతంగా జీవించగలిగిన రోజున ఆడదానిలో కలిగే మార్పుకూడా అతనికి అర్థంఅయింది. భర్త కాని సంపాదించినా ఆడదానికి ఎంత అహంకారమో! ఇక వందలూ వేలూ సంపాదించే భర్తలుగల భార్యలు అహంకారంతోటే నిద్రపట్టకుండా మసలుతారంటే ఆశ్చర్యం ఏముంది? పైగా రాఘవమ్మవంటి అందంగల ఆడదానికి ఎంత అహంకారమైనా వుండటానికి అర్హతవుంది! అది బైటికిరాకపోవటానికి సత్యమే కారణం. అతను భార్యను ముద్దుపెట్టుకున్నాడు!

'అయితే మీరు బాకీఇయ్యగలరని ధైర్యం వుంటేమట్టేనా ఆయన మిమ్మల్ని ఇన్నాళ్ళనుంచీ బాకీతీర్చమని అడగనిది?' అంది రాఘవమ్మ ఎగతాళిగా. సత్యం మొఖంలో మార్పు వచ్చింది.

'నన్ను ఎంతమంది ఎన్నిసార్లు అడిగారో నీకు తెలియదు. కాని నన్ను అడగనిదల్లా ఆయన వొక్కడే. అది తలుచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. నేను ఆయనబాకీ ఇయ్యగలనని ధైర్యమో, లేక ఇయ్యకపోయినా ఫరవాలేదని సంతృప్తో చెప్పలేంకాని నన్ను ఇంతవరకూ అడగనిది ఆయన వక్కడే. కడంవాళ్లు అడక్కపోయినా నేను బాకీవున్నానని మాటల్లో అన్నా వాసనచూపించేవారు. ఎందుకంటే, బాకీ వున్న

వాడికి బాకీఇచ్చినవాడికంటె తెలివిగా వుండటానికీ, మాట్లాడటానికి అగత్యత లేదు! వాళ్ళకన్న మనం ఏ విషయంలోనైనా తెలివిగా వుంటే మనం వాళ్ళకి బాకీవున్నామని జ్ఞాపకంవస్తుంది. బాకీవుండికూడా తెలివిగావుండటం క్రూరం. అందుకనే ఆబాకీ అడిగితే వాడి తెలివితేటలూ, తిక్కా అన్నీ దారికొస్తయ్యని గ్రహించి బాకీ చెల్లించమని అడుగుతారు. ఇంక వీడు ఏమొహం పెట్టుకుని తెలివిగా వుండగలడు ? కాని ఆయనదారి వేరు. నాదరిద్రంతో నన్ను పరాభవిద్దామని ఆయ నెప్పుడూ ప్రయత్నం చెయ్యలేదు. అలాంటివారు అయినవాళ్ళల్లోకూడ వుండరు!'

'అయినా మీ రింత ఆలస్యంగా వచ్చారేం-నా కెంత ఏడుపొచ్చిందో తెలుసునా ?'

'నేను ట్రాములో రాలేదు—నడిచివచ్చాను !'

రాఘవమ్మ లేచికూచుంది.

'అదేమిటీ ?'

'ట్రాములో రావటానికి నాదగ్గిర డబ్బులు లేవు.'

'మీజీతం ఏమైంది ?'

'నాకు జీతం రాలేదు.'

'జీతంరాలేదూ—'

'నాపేరు ఇంకా జీతాలుఇయ్యాలిసినపట్టీలో చేరలేదు. రేపుగాని జీతంరాదు !'

'అయితే ఈ అయిదుమైళ్లూ ఈవానలో తడిసి నడిచివచ్చారా ?' అంది రాఘవమ్మ. సత్యం నిబ్బరంగా తలవూపటం చూచి ఆమెకు కళ్ళ వెంట నీళ్లు తిరిగినై.

'అయితే ఈ బాకీలు రేపు చెల్లించలేమన్నమాట !'

'ఎల్లుండి !'

'ఆవిడ మళ్ళీ తెల్లారకమునుపే వస్తుందేమో !'

'రానియ్యి—మనం చేసేదిలేదు.'

'నేనుమటుకు ఆవిడముఖం చూడలేను బాబూ—మీకో నమస్కారం!'

'నాకు నమస్కారం పెట్టి ప్రయోజనంలేదు.''

'నేను చెప్పేది నమ్మక ఆవిడ ఏం విసుక్కుని కేకలేస్తుందో ?'

[illegible] మా ఇంట్లో [illegible] ఈ పూట బియ్యం లేవా' అని అడుగు!'

'బాగుంది! వాళ్ళింట్లో వుంటే నేం, లేకపోతే నేం. మనం బాకీవున్నప్పుడు వాళ్ళకి అడగటానికి అధికారం వుందని మీరేగా అన్నారు!'

'సత్యం తాతకూడా దానికి సమాధానం చెప్పలేక. చెప్పగలిగితే ఏమన్నా మనమడివల్ల అవుతుందేమో!

'పోనీలెండి—ఎలాగో తంటాలుపడతాను—రేపైనా జీతం వస్తుందా?' అంది రాఘవమ్మ సత్యంనోట మాట లేకపోవటంచూచి.

'రేపు వస్తుందని అన్నారు!' అన్నాడు సత్యం. రాఘవమ్మ బేజారయిపోయింది.

'నిజంగానా, నన్ను ఏడిపిస్తున్నారా? నిజంగా జీతంరాలేదూ?' రాఘవమ్మ సత్యంజేబులు తడివిచూచి బేడా కాసు పైటికి తీసింది.

'అబద్ధాలు చెప్ప నీతో శృంగారం వెలిగించటానికి నేనేం కవిననుకున్నావా, లేక కథకుణ్ణి అనుకున్నావా?'

రాఘవమ్మనోట మాటలేదు.

'పోనీ, ఈ బేడా పెట్టి ట్రాములో రాలేకపోయారూ?'

'ఆబేడా ఖర్చుచేసి రేపు ఆఫీసుకు నడిచి పొమ్మన్నావా?'

రాఘవమ్మ ఒక్కక్షణం భర్తనుచూచి మెల్లిగా అతని వొళ్ళోకి చేరగిలబడిపోయింది. వాళ్ళిద్దరి ఆకలీ, అభిప్రాయాలూ, దేహాలూ పరిపూర్ణత్వం చెందినై!

---

B N. K. Press. Madras. Q. H. No. M. S. 100/B.
For Q. H. No. 401. Cat D. 750 Copies—May 1947